
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-4-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 70 పేజీలు: 12 వెల: 6.50

అమెరికాపై చైనా 125% సుంకాలు
9లో
అన్నాడిఎంకెతో బిజెపి పొత్తు

## అందరికి అందుబాటులోకి
# 'కృత్రిమ మేధ'
### ప్రతి ఇంటిలో ఎఐ ప్రొఫెషనల్ ఉండాలి
### ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు ప్రోత్సాహం: సిఎం చంద్రబాబు



**విజయవాడ, ఏప్రిల్11 ప్రభాతవార్తప్రతినిధి:** పరిపాలనా వ్యవస్థలో సంస్కరణలో సాంకేతికతకు ప్రజాభ్యున్నతిని కాంక్షించే ప్రాధాన్యతను ఇస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సామాజిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న పరిణామాలన్నింటిని గమనించాల్సిన అవసరం ఉందని ఇందుకు అనుగుణంగా సాంకేతికంశాల్లో చోటు చేసుకుంటున్న నూతన ఆవిష్కరణలను వినియోగించుకోవాలన్నారు.దీనిని అతి కీలకంశంగా గుర్తించాలన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో ఒక ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(కృతిమ మేధో) ప్రొఫెషనల్ ఉండాలనేదే ప్రభుత్వ ఆశయమని ప్రతి కుంటుంబంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను విరివిగా ఉపయోగించుకునేలా ఏఐని రాష్ట్రంలో పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆయన నేడు ఉండవల్లి కార్యాలయంలో మహాత్మాజ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. రాష్ట్రంలో సామాన్యులు సైతం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నది తమ ప్రభుత్వ ఆశయమన్నారు.ముఖ్యంగా జ్యోతిరావు పూలే ఆశయాలకనుగుణంగా పేద వర్గాలకు విద్యను,ఉన్నత విజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు.విదేశాల్లో చదువుకునే వారికి రూ.15 లక్షలు సాయం చేస్తున్నామని అన్నారు. సివిల్స్, గ్రూప్స్ పరీక్షలు రాసే వారికి అండగా ఉన్నామని తెలిపారు. అమరావతిలో సివిల్స్ కోచింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, బ్యాచ్‌కు 500 చొప్పున కోచింగ్ ఇస్తామని వెల్లడించారు. ఆదరణ3 కింద ఏటా రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తామని పేర్కొన్నారు. బీసీలకు అండగా ఉంటామన్నారు. వారి సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.అట్రాసిటీ యాక్ట్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఎలా అయితే రక్షణ కల్పిస్తున్నామో, త్వరలో బీసీల కోసం ప్రత్యేకంగా రక్షణ చట్టాన్ని తీసుకువస్తాం. దీనిపై సబ్ కమిటీ వేశాం. ఆ నివేదిక ఆధారంగా చట్టాన్ని రూపొందిస్తాం. స్థానిక సంస్థల్లో బీసీలకు మేం 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే, గత ప్రభుత్వ హయాంలో 24 శాతానికి తగ్గించారు. మేం మళ్లీ 34 శాతానికి మళ్లీ రిజర్వేషన్ పెంచుతామన్నారు.నామినేటెడ్ పోస్టుల్లో 33 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేస్తాం.ఉన్నత విద్యసాంకేతిక రంగాల్లో బీసీలకు అండగా ఉంటామన్నారు. ఒకప్పుడు ఐటీని మనం సొంతం చేసుకున్నామని, ఇప్పుడు ఏఐని పెద్ద ఎత్తున ఉపయోగించుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేస్తే అదే వారికి చివరిరోజు అని హెచ్చరించారు. తప్పులు చేసేవారి పట్ల చండశాసనుడిగా ఉంటానని, వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదని మండిపడ్డారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వంలో టెక్నాలజీని ఉపయోగించుకోవడం వల్ల పనితీరు మెరుగవుతుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతామని, సత్ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు ఏ విధంగా చేరుతున్నాయి, ఎక్కడైనా లోపాలున్నాయా.ఉంటే ఎందు కున్నాయి, దానికి పరిష్కార మార్గాలేమిటి అనేవి >>2



శుక్రవారం ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణంలో భక్తులకు మాంగల్యం చూపుతున్న పురోహితుడు

## వైభవంగా ఒంటిమిట్ట సీతారాముల
# కల్యాణం



పట్టు వస్త్రాలు తీసుకు వెళుతున్న సిఎం చంద్రబాబు నాయుడు దంపతులు

### పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సిఎం చంద్రబాబు దంపతులు

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** కల్యాణ వైభోగమే..శ్రీ సీతారాముల కళ్యాణ వైభోగమే అన్నట్లు ఒం టి మిట్టలో కోదండరాముని కల్యాణం >>2

# నేడే ఇంటర్ ఫలితాలు
### వాట్సాప్‌లోనూ లభ్యం

**విజయవాడ,ఏప్రిల్11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలకు ముహూర్తం ఫిక్స్ అయింది. ఈ నెల12వ తేదీన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు విడుదల కానున్నాయి. శనివారం ఉదయం 11గంటలకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు వెల్లడిస్తామని మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. ఇంటర్మీయట్ పరీక్షలు అయిన తరువాత నుంచి వీలైనంత వేగంగా ఫలితాలు విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేశారు. ఏప్రిల్ 6నాటికే మూల్యాంకనం పూర్తైనట్లు తెలుస్తోంది. ఆ తర్వాత కంప్యూట రీకరణ వర్క్ పూర్తిచేశారు. దీనికి ఐదారు రోజులు సమయం పట్టింది. ఈ సారి >>2

### చంద్రబాబు నివాసంపై దాడికేసులో
# సిఐడి విచారణకు జోగి రమేష్

**విజయవాడ,ఏప్రిల్11,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి జోగి రమేశ్ తెలుగుదేశం అధినేత చంద్రబాబు నివాసంపై దాడి కేసులో సిఐడి విచారణకు హాజరయ్యారు. ఆయనతో సహ ఐదుగురు నిందితులు కూడా హాజరయ్యారు. శుక్రవారం ఉదయం విజయవాడ రీజనల్ సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ప్రస్తుతం అధికారులు వారిని విచారిస్తున్నారు. వైకాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రెచ్చిపోయిన రమేష్ భారీ కాన్వాయ్‌తో ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంపైకి దూసుకుని వెళ్లడం,తీవ్రస్థాయిలో ఆందోళనకు దిగడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించింది. విజయవాడలోని తమ కార్యాలయంలో హాజరు కావాలని రమేశ్‌కు సీఐడీ నోటీసులు జారీ చేసింది. వైకాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా అప్పటి ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు ఇంటికి >>2

# వారం పాటు వర్షం

**విజయవాడ,ఏప్రిల్11,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండుతున్న నేపథ్యంలో వాతావరణశాఖ రాగల రోజుల్లో వాతావరణం చల్లబడే అవకాశాలున్నట్లు వెల్లడించింది. రాష్ట్రంలో వారం రోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. కోస్తా, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాజస్థాన్-కోస్తాంధ్ర మధ్య ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. హిమాలయ ప్రాంతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు మరో ద్రోణి విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో రాగల వారం రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వాతావరణ హెచ్చరికలకు తగినట్లుగానే కృష్ణా,ఎన్టీఆర్, గుంటూరు, ఉమ్మడి గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా సాయంత్రం సమయంలో సాధారణ వర్షాలు కురుస్తున్నాయి.శుక్రవారం కుడా అనేక జిల్లాల్లో వాతావరణ పరిస్థితులు చల్లబడ్డాయి.

# ఖర్చు లేకుండా పట్టా రిజిస్ట్రేషన్
### రెండేళ్లలో ఇంటి పట్టా అమ్ముకునే హక్కు
### మంగళగిరిలో 'మన ఇల్లు-మన లోకేష్'లో మంత్రి నారా లోకేష్

**మంగళగిరి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** వచ్చే వారం నుంచి రూపాయి ఖర్చులేకుండా ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, రెండేళ్లలో ఇంటి పట్టా అమ్ముకునే హక్కు కూడా వస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లుమన లోకేష్ కార్యక్రమంలో భాగంగా నాలుగోరోజు మధ్యాహ్నం మంగళగిరి డాన్ బాస్కో స్కూల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో తాడేపల్లి మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. నేడు మొత్తం 1030 పేదకుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ 2019లో నేను తీసుకున్న నిర్ణయం నా జీవితాన్ని మార్చేసింది. 2019లో మంగళగిరిలో పోటీ చేయాలని నిర్ణయించుకున్నా. నేనేంటో మీకు తెలియదు. మీ సమస్యలేంటో నాకు అర్థంకాలేదు. ఫలితంగా 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. దీంతో కసిగా పనిచేసి మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవాలని భావించా. ఆ విధంగానే చేశా అన్నారు.ఈ నెల



మంగళగిరిలో ఇంటిపట్టాలు అందజేస్తున్న మంత్రి లోకేష్

13వ తేదీన ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరుగుతుంది. ఏడాదిలోగా పూర్తిచేస్తాం. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వాటర్ పైప్ లైన్, భూగర్భ గ్యాస్, భూగర్భ కరెంట్ అందిస్తాం. లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తాం. పార్క్‌లు, చెరువులు అభివృద్ధి చేస్తాం. పిల్లలు ఆడుకునేందుకు క్రికెట్ టర్ఫ్ లు, బాస్కెట్ బాల్ కోర్టులు ఏర్పాటుచేస్తాం.

**రూ.300 కోట్లతో రిటైనింగ్ వాల్:** తాడేపల్లిలో హెల్త్ క్లినిక్ ఏర్పాటుచేయడం జరిగింది. ఆరోగ్యంగా ఉండాలంటే అందరం నడవాలి. గంట సేపు వ్యాయామం చేయాలి. నడవాలంటే పార్క్ లు కావాలని ఆనాడు అడిగారు. కొన్ని వార్డుల్లో పార్క్ లు నిర్మిస్తున్నాం. ఇటీవల మంగళగిరిలో ఎస్ఎల్ఎన్ పార్క్ ను ప్రారంభించాం. మరో 6 పార్క్ లు సిద్ధమవుతున్నాయి. 31 కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని ఆనాడు కోరారు. అందులో 17 భవనాలకు భూములను కూడా గుర్తించాం. రెండుభవనాల పనులు కూడా పూర్తికాబోతున్నాయి. వాటిని త్వరలోనే ప్రారంభించబోతున్నాం. >>2



శుక్రవారం వారణాసి పర్యటనలో ప్రధాని మోడీకి జ్ఞాపికను బహూకరిస్తున్న యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్

# సొంతకుటుంబాల వృద్ధి కోసమే అధికారం
2లో
### విపక్షాలపై వారణాసిలో ప్రధాని మోడీ ధ్వజం

## విజయవాడ మెట్రో రైలుకు
# భూసేకరణ

**విజయవాడ ఏప్రిల్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుకు భూసేకరణ పనిలో అధికారులు సమయాత్తమయ్యారు.ప్రాజెక్టు రూపకల్పనకు గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో అవసరమైన భూసేకరణకు సర్వే ప్రారంభించారు.ఇందుకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారుల చర్యలు చేపట్టారు. గన్నవరం కేసరపల్లిలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారుతలో కలిసి విజయవాడ మెట్రో చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ జీపీ, రంగారావు పర్యటించారు. బస్టాండ్ హెచ్‌సీ ఎస్, కేసరపల్లి కూడలిలో 12:42 మీటర్ల నిష్పత్తితో నిర్మించనున్న మెట్రో స్టేషన్‌లకు >>2

## పిపిపి విధానంలో వైద్య కళాశాలల
# నిర్మాణానికి కమిటీ

**విజయవాడ ఏప్రిల్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది.ఈ క్రమంలో వైద్యకళాశాల నిర్మాణానికి ముందుకు వచ్చేవారితో రాయితీ ఒప్పందాలపై రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. పీపీపీ విధానంలో ఆస్పత్రుల నిర్మాణంపై కేపీఎంజీ కన్సల్టెన్సీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ నివేదికపై కమిటీ అధ్యయనం చేయనుంది. వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాలు చేస్తూ వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో ఏపీఎంఎస్ఐడీసీ, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు, వైద్యవిద్యా డైరెక్టర్ ఉంటారు.


# బిసి సంక్షేమానికి రూ.48వేల కోట్లు
### ఆదరణ-3కు వేయి కోట్లు, త్వరలో బిసి రక్షణ కమిటీ: సిఎం చంద్రబాబు

**ఆగిరిపల్లి, ఏప్రిల్11,ప్రభాతవార్త :** దేశంలో వెనుకబడిన వర్గాలకు సంక్షేమం,విద్యా,ఉపాధి అందించడంలో తెలుగుదేశం ప్రభుత్వమే గత నాలుగు దశాబ్ధాలుగా రికార్డు స్థాయిలో సేవలు అందించిందని ఏటా 48వేల కోట్లతో బీసిలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. నూజివీడు డివిజన్ ఆగిరిపల్లి మండలం, వడ్లమాను గ్రామంలో శుక్రవారం ప్రజావేదిక నుండి ఆయన మాట్లాడారు. సుపరిపాలనకు నాంది పలుకుతూ అన్నీ వర్గాలకు న్యాయం చేస్తున్నామన్నారు.జ్యోతిరావు పూలే 198 జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సభలో ముఖ్యమంత్రి స్ఫూర్తిదాయక నేతలను గుర్తిచేసుకున్నారు.రాబోయే ఆదరణ-3కు వేయి కోట్లు మంజూరుచేయడం జరిగిందన్నారు. చేనేత రంగానికి 896 కోట్లు సబ్సిడీగా ఇవ్వడం జరిగిందన్నారు.బీసి వర్గాలు ఇల్లు నిర్మించుకుంటే అదనంగా 50వేలు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. అప్పులు అవినీతి వల్ల సమాజం మనుగడ సాగించదని పిల్లలకు నేరాలు రౌడీయిజం నేర్పవద్దని హితవు చెప్పారు.మహిళల విష యంలో తప్పు చేసిన వారిపట్ల ఛండశాసనుడిగా ఉంటా నన్నారు.నేరాస్తులకు అడ్డాగా సోషల్ మీడియా



శుక్రవారం వడ్లమాను గ్రామంలో ట్రాక్టర్ నడిపుతున్న సిఎం చంద్రబాబు

మారిందని రాజకీయాలు పూర్తిగా దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేసారు.తెలుగుదేశం పార్టీకి వెనుకబడిన వర్గాలే వెన్నెముకని పునరుద్ఘాటించారు.140 వెనుక బడిన వర్గాలకు 55 కార్పోరేషన్లు పెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీదే అన్నారు.పూలే చేసిన త్యా గాలను గుర్తిచేస్తూ మహిళ విద్యకు,బడుగులకు ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయక మన్నారు. అదేవిధంగా మహిళా విద్యకు ప్రాధా న్యత ఇస్తూ ఎన్‌టిఆర్ మహిళా యూనివర్సిటీ నెలకొల్పారని బీసిలకు ఎన్‌టిఆర్ వచ్చిన తర్వాతే తగిన న్యాయం జరగిందన్నారు.బీసి విద్యార్థుల విదేశి విద్యకు రూ.15లక్షలు సబ్సిడీగా ఇస్తూ న్నా మన్నారు. లక్షమంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మార్చడానికి కృషి జరుగుతుందన్నారు. డిఎస్సీ లో బీసి విద్యార్థులు 5,720 మందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.పి-4 మార్గదర్శి బంగారు కుటుంబం పథకం ద్వారా పేద కుటుంబాలను గుర్తించి వారికి అన్నీ విదాలు సహకారం ఇస్తూ ఉపాధి విద్యా రంగాలలో ఆ కుటుంబాలను పైకి తేవాలని జీరో ప్రావర్టీ పథకాన్ని ఎంచుకోవడం జరిగిందన్నారు.ముస్లిం మహిళ,వితంతు మహిళా కుటుంబాలను సభకువివరిస్తూ ఇటువంటి కుటుంబాలను పైకితేవడమే పి-4లక్ష్యం అన్నారు. సంపద కల్గినపదిశాతం మంది మిగతా 90 శాతం మందిని ఆదుకున్నప్పుడే తలసరి ఆదాయం పెరుగుతుందన్నారు. ఏలూరు >>2



## రాణాకు తీహార్ జైల్లో
# ప్రత్యేక సెల్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపిన 2008 నాటి ముంబాయి మారణకాండకు సూత్రధారి పాక్-కెనేడియన్ తహవూర్ రాణాకు తీహార్ జైల్లో ప్రత్యేక సెల్ కేటాయించారు. 18 రోజులపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) కస్టడీలో వున్న రాణా కోసం తీహార్‌జైల్లో 14అడుగుల పొడవు అంతే వెడల్పు కలిగిన ప్రత్యేక సెల్‌ను కేటాయించారు. గురువారం మధ్యాహ్నం రాణాను అమెరికా నుంచి ప్రత్యేక విమానంలో ఎన్‌ఐఎ అధికారులు ఢిల్లీకి తరలించిన సంగతి తెలిసిందే. గురువారంరాత్రి ఇతన్ని >>2

12-4pg2exHMNWJQE.qxd:12-4pg2exHMNWJQE.qxd 01/01/01 10:03 AM Page 1





శుక్రవారం ఒంటిమిట్ట సీతారాముల కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న పురోహితులు

# వైభవంగా ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం

అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి పౌర్ణమి వెలుగులో సీతారాముల కళ్యాణ మహోత్సవం చరిత్రలో నిలిచి పోయేలా టిటిడి అట్టహాసంగా నిర్వహించింది. ఉదయమే స్నపన తిరుమంజన సేవతో సీతారామ లక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆరోరోజు కోదండ రాముడు శివదనుర్బాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఎదుర్కోలు కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణానికి విచ్చేసిన సీఎంకు వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామికి సీఎం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన కళ్యాణ వేదిక వద్దకు చేరుకొని కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. వేద మంత్రాల సాక్షిగా టిటిడి వేద పండితులు సీతా రాముల కళ్యాణ క్రతువు నిర్వహించారు. గణపతి పూజతో కల్యాణోత్సవం ప్రారంభమైంది. పుణ్యాహవచనం కార్యక్రమం జరిగింది. అనంతరం రక్షాబంధనం జరిగింది. సీతమ్మ తల్లి కి వేద వండితులు శ్రీరాముని తరపున రక్షాబంధన చేశారు. అనంతరం శ్రీరాముడికి యజ్ఞోపవీతం సమర్పించారు. సంకల్పం అనంతరం స్వామికి మధు సంపర్కం సమర్పించారు. శుభ లగ్నే అంటూ కన్యాదానం చేశారు. ఆ తర్వాత మహా మాంగల్య పూజ నిర్వహించారు. చివరగా అర్చక స్వాములు వారు శ్రీరాముని స్వహస్థాలు తాకించి మాంగల్య ధారణ చేశారు. అనంతరం సాంప్రదాయ బద్ధంగా తలంబ్రాల వేడుక నిర్వహించారు. కళ్యాణానికి విచ్చేసిన సీఎంకు సీతారాముల చిత్ర పటాన్ని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, మంత్రి రామనారాయణ రెడ్డి, సీఎం వెంట రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి రామ నారాయణ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనకాపల్లి బిజెపి ఎంపి సీఎం రమేష్, టీడీపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు, టీడీపి పోలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, ఎంఎల్ఏ లు ఆర్. మాధవి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా చైతన్య రెడ్డి, వరద రాజుల రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశీస్సులతో రాష్ట్రంలో రామరాజ్యం స్థాపిస్తాం

### పుణ్యక్షేత్రంగా ఒంటిమిట్ట అభివృద్ధి: సిఎం చంద్రబాబు

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** ప్రజల ఆశీస్సులతో రాష్ట్రంలో రామరాజ్యం స్థాపించి ప్రతి ఒక్కరికి మేలు చేయాలని తన లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఉమ్మడి కడప జిల్లా ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణం అనంతరం భక్తులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ రామరాజ్య స్థాపనే తన ముఖ్య లక్ష్మన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి మేలు జరగడమే తన ఆకాంక్ష అన్నారు. మానవసేవే మాధవసేవ అని అన్నారు. శ్రీరాముడు అంటే మంచి పరిపాలన దక్షుడిని అన్నారు. శ్రీరామ స్ఫూర్తిగా రాష్ట్రంలో పరిపాలన సాగిస్తామన్నారు. రాష్ట్రానికి వారసత్వ సంపద ప్రధాన సంపదన్నారు. ఒంటిమిట్ట పుణ్యక్షేత్రంలో అన్నదానం కూడా ప్రారంభిస్తామన్నారు.

# ఖర్చు లేకుండా పట్టా రిజిస్ట్రేషన్

మిగతా భవనాలు కూడా యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తాం. రూ.300 కోట్ల వ్యయంతో రీటైయినింగ్ వాల్ నిర్మించబోతున్నాం. కట్టించి అందజేసే బాధ్యత మేం తీసుకుంటాం.

**గతంలో ఇంటి పట్టాల కోసం చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకోలేదు**

2019లో ఓడిపోయినప్పుడు అందరూ ఎగతాళి చేశారు. బాధ కలిగింది. ఇంత మెజార్టీ గెలిపించడంతో నా పరువును కాపాడారు. శాసనసభలో నా గౌరవం పెంచారు. కేబినెట్ లో మంగళగిరి ప్రజలకు ఏదైనా చేయాలంటే చర్చ అవసరం లేకుండానే మంజూరు చేస్తున్నారు. మా పైన బాధ్యత పెరిగింది. దశాబ్దాల కల అయిన శాశ్వత ఇంటి పట్టాలు అందించాలని కోరారు. మూడు, నాలుగు దశల్లో ఇంటి పట్టాలు అందిస్తామని ఆనాడు చెప్పా. ఏడాదిలోగా బట్టలు పెట్టి మొదటి దశ ఇంటి పట్టాలు ఇస్తానని చెప్పా. 11 నెలల్లో హామీని నిలబెట్టుకునేందుకే మీ ముందుకు వచ్చా. పద్ధతి ప్రకారం హామీలు నిలబెట్టుకుంటున్నామన్నారు. వచ్చే వారం నుంచి రూపాయి ఖర్చు లేకుండా పట్టా రిజిస్ట్రేషన్ రెండేళ్లలో ఇంటి పట్టా అమ్ముకునే హక్కువచ్చే వారం నుంచి ఇంటి పట్టాను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఒక్క రూపాయి ఖర్చుపెట్టకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రెండేళ్లలో పట్టాను అమ్ముకునే హక్కు కూడా మీకు వస్తుంది. దయచేసి ఎవరూ అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. మన ప్రాంతం అద్భుతంగా అభివృద్ధి చెందుతుంది. మంగళగిరిని చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దుతున్నాం. అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతాం. ఇందుకు మీ అందరి సహకారం కావాలి. స్వచ్ఛతలో మీ సహకారం కావాలి. మీరు నన్ను పెద్దఎత్తున గౌరవించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారు. మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. మీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని చెప్పారు.

### గచ్చిబౌలి భూముల్లో గోల్‌మాల్

# రూ.10వేల కోట్ల కుంభకోణం

### ఒక బిజెపి ఎంపి సపోర్ట్‌తో కుంభకోణానికి తెరతీసిన తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి: కెటిఆర్ సంచలన ఆరోపణలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్11:** కంచ గచ్చిబౌలి భూ కుంభకోణం కర్త, కర్మ, క్రియ, సూత్రధారి, పాత్రధారి అంతా రేవంత్ రెడ్డినే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. హెచ్‌సీయూ భూముల వెనుక రూ.10 వేల కోట్ల ఆర్థిక కుంభకోణం ఉందని, రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అటవీ భూమిని తాకట్టు పెట్టడం, అమ్మే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఒక బీజేపీ ఎంపీ సపోర్ట్‌తో రేవంత్ రెడ్డి.. హెచ్‌సీయూ భూముల కుంభకోణానికి తెరతీశారని వ్యాఖ్యలు చేశారు. ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్మెంట్ అనే కంపెనీ రేవంత్ రెడ్డికి బ్రోకరిజం చేసిందన్నారు. అందుకు గాను సదరు కంపెనీకి రూ.170 కోట్లు లంచం ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి పాలన అంటేనే మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడమనే త్రీడీ విధానంతో పేదల బతుకులను కాంగ్రెస్ నాశనం చేస్తోందని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. అటవీ భూమిని అమ్మాలని రేవంత్ ప్రభుత్వం చూస్తోందన్నారు. నామమాత్రపు జీవోతో అమ్మకానికి పేపర్లు రాసిచ్చారన్నారు. రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం ఆ భూమి విలువ రూ.5,239 కోట్లు అని చెప్పుకొచ్చారు. ఆ భూమి విలువ రూ.30 వేల కోట్లు అని ప్రభుత్వం చెబుతోందని.. లేని భూమి ఉన్నట్లు చూపి లోన్ తీసుకోవాలని చూశారని వ్యాఖ్యలు చేశారు. భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదు.. అతిపెద్ద కుంభకోణం అని వ్యాఖ్యలు చేశారు. తమది కాని భూమిని టీజీఐఐసీ ఎలా తాకట్టు పెడ్తుంది అని కెటిఆర్ ప్రశ్నించారు. స్కామ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఆర్బీఐకి ఫిర్యాదు చేస్తామన్నారు. స్కామ్‌లో రేవంత్ రెడ్డికి సహకరిస్తుంది బీజేపీనే అని ఆరోపించారు. ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థికమంత్రికి తెలియకుండా ఈ వ్యవహారం జరిగిందన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వెంటేనే సీవీసీ, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య ఒప్పందం ఉన్నట్లే అంటూ వ్యాఖ్యలు చేశారు. హెచ్‌సీయూ భూముల వెనుక క్విడ్ ప్రోకో ఉందన్నారు. సదరు బీజేపీకి రేవంత్ రెడ్డి కొన్ని లాభాలు చేయబోతున్నారన్నారు. ఆర్బీఐ నిబంధనలు పాటించకుండా.. 10వేల కోట్లు తెచ్చారన్నారు. లిటికేషన్ ల్యాండ్‌కు ఐసీఐసీఐ బ్యాంకు ఎలా లోన్ ఇచ్చిందని ప్రశ్నించారు. ఫీల్డ్ విజిట్ చేయకుండానే బ్రోకర్ ఆధారంగా బ్యాంక్ ప్రభుత్వానికి రుణం ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 15 16 నెలల్లో డిసెప్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ అనే 3డీ మంత్రతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి బతుకుల్ని నాశనం చేస్తోంది అని కేటీఆర్ ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ పక్కన ఉన్న అటవీ భూములను అడ్డం పెట్టుకుని ఒక అతిపెద్ద ఆర్థిక మోసానికి రేవంత్ ప్రభుత్వం పాల్పడింది. ఇదొక నేరపూరిత కుట్ర. తెలంగాణ ప్రజల పట్ల విశ్వాసఘాతుకం. రాత్రికి రాత్రి బుల్డోజర్లను పెట్టి వందల ఎకరాల్లో చెట్లను కూల్చివేసి మూగ జీవాలకు నిలువ నీడ లేకుండా చేసిన రేవంత్ ప్రభుత్వ ఆరాటం వెనుక పదివేల కోట్ల రూపాయల స్కాం ఉంది. సుప్రీం కోర్టు తీర్పుల ప్రకారం ఆ 400 ఎకరాలు ముమ్మాటికి అటవీ భూమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోడీ ఆరోపించారు కానీ ఇప్పటిదాకా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అమృత్ స్కాంలో రేవంత్ రెడ్డి బావమరిదికి రూ.1137 కోట్ల రూపాయలు దారి మళ్లించాడని ఆధారాలతో సహా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే ఇప్పటిదాకా ఎలాంటి చర్య తీసుకోలేదు. రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద ఈడీ దాడులు జరిగితే ఇప్పటిదాకా అధికార ప్రకటన రాలేదు. ఈ వ్యవహారాన్ని ఈ ఆర్థిక మోసాన్ని కూడా అదే కోవలో కలిపేసి కాంగ్రెస్ బీజేపీ ఒకరినొకరు కాపాడుకుంటారో.. లేదంటే నిజంగానే సమగ్ర విచారణకు ఆదేశించి మేము నిజాయితీగా ఉన్నాం, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఈ దోపిడీని ఉపేక్షించమని చెప్పి కేంద్రం తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.

# బనకచర్లను అడ్డుకోవాలి

### శ్రీశైలం కుడికాలువ లైనింగ్ పనులు నిలిపివేయాలి

### కెఆర్‌ఎంబికి ఇఎన్‌సి జి.అనిల్‌కుమార్ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** బనకచర్ల ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళ్ళకుండా గోదావరి నది యాజమాన్య బోర్డు అడ్డకోవాలని అదే విధంగా శ్రీశైలం కుడికాలువ లైనింగ్ పనులు చేయకుండా కృష్ణా నది యాజమాన్య బోర్డు చర్యలు చేపట్టాలని తెలంగాణ ఇఎన్‌సి జి. అనీల్‌కుమార్ లేఖలు రాశారు. గోదావరి నది యాజమాన్య బోర్డు సోమవారం నాటి 17వ సమావేశంలో బనకచర్ల డిపిఆర్ సభ్య రాష్ట్రంకు సమర్పించలేదని అదేవిధంగా జలశక్తి మంత్రి, ఆర్థిక మంత్రి లేఖలు సభ్య రాష్ట్రంకు తెలుపకుండా గోప్యంగా పెడుతున్నారని దానిని నిలిపివేయాలని కోరామని జిఆర్‌ఎంబి ఏ చర్యలు చేపట్టకుండా ఉందని ఆయన లేఖలో ఆవేదన వ్యక్తంచేశారు. బనకచర్ల ప్రతిపాదనలు మాత్రమే అంటూ కొట్టిపడేసిన జిఆర్‌ఎంబి సమావేశంలో కొట్టిపడేసిన ఆంధ్రప్రదేశ్ మరోవైపు జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందిని ఇఎన్‌సి అనిల్‌కుమార్‌తెలిపారు. రూ.80112 కోట్ల తో నిర్మించే పోలవరం బనకచర్ల ప్రాజెక్టు కారణంగా తెలంగాణ ప్రయోజనాలకు ఇబ్బంది కలుగుతోందని పెన్నా బేసిన్ వరకు తరలించడం వల్ల గోదావరి బెసిన్ అవసరాలు తీరడం కష్టమని ఆయన లేఖలో పేర్కొన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఉత్తర్వులును ఉల్లఘించి శ్రీశైలం కుడి ప్రధాన కాలువకు లైనింగ్ పనులతో ముందుకు పోతుందని పలు పరాయయలు కెఆర్‌ఎంబికి లేఖలు రాసినా అడ్డుకోవడంలేదని కెఆర్‌ఎంబికి లేఖలో వివరించారు. 2020 అక్టోబర్ 2న అపెక్స్‌కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్ళామని 1973 కెడబ్ల్యుడిటి-1 అవార్డు ప్రకారం బేసిన్‌లో భవిష్యత్‌లో నిర్మించబోయే ప్రాజెక్టు లకు ముందు ప్రాధాన్యతతో నీటి కేటాయింపులు జరిపాకనే బేసిన్ బయటకు నీటిని తరలించాలని ఇతర బేసిన్‌కు వెళేందుకు నీటినికేటాయించకూడదని తెలిపారని పేర్కొన్నారు. శ్రీశైలం కేవలం జలవిద్యుత్ కేంద్రమని 1976-77 చెన్నైకి 15వందల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో కాలువను ఏర్పాటు చేశారని వివరించారు. కెడబ్ల్యుడిటి -1అవార్డుకు భిన్నంగా సెంట్రల్ వాటర్ కమీషన్ అనుమతితో శ్రీశైలం కుడికాలువ నుంచి నీటిని తరలిస్తున్నదని ఆరోపించారు. తెలంగాణలోని కృష్ణాబేసిన్‌లోని అనేక గ్రామాలు, జనవాసాలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నాయని సిడబ్ల్యుసి, ట్రిబ్యునల్‌లో వాజ్యం కూడా ఉందని పేర్కొన్నారు. సిడబ్ల్యుఎస్ఎస్, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, శ్రీశైలనం కుడికాలువ, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వంటివి నిర్మించి 1980 నుంచి నీటిని అక్రమంగా తరలించడం మొదలు పెట్టిందని ఆరోపణలతో లేఖను రాశారు. పోతిరెడ్డిపాడు 44,600క్యూసెక్కులు, శ్రీశైలం కుడికాలువ 19150క్యూసెక్కులులు, బనచకర్ల 48525క్యూసెకులు తరలిస్తున్నారని ఇక లైనింగ్ చేసేనత 1,56,100 క్యూసెక్కుల నీటిని తరలించుకొని పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎస్ఆర్‌ఎంసి శ్రీశైలం రైట్‌మెన్ కెనాల్ 81975క్యూసెక్కుల సామర్థ్యం కుపెరుగుతుందని పేర్కొన్నారు. శ్రీశైలం లైనింగ్‌పై ఏ చర్య తీసుకోవడంలేదని అనిల్ పేర్కొన్నారు. బనకచర్లను అడ్డుకోవాలని పోలవరం నిర్మాణం పూర్తైన వెంటనే తాడిపూడి ప్రాజెక్టు వదిలిపెట్టాలని ట్విన్‌టన్నెల్ పరిమాణం పెంచకుండాచూడాలని ఆయన లేఖలో పేర్కొన్నారు.

# రూ. 150 కోట్ల నయీం ఆస్తులు జప్తు

### ఇడి విచారణ వేగవంతం

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** తొమ్మిదిదేళ్ల క్రితం పోలీసు ఎన్‌కౌంటర్‌లో హతమైన గ్యాంగ్‌స్టర్ నయీంకు సంబంధించిన కేసు విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ వేగవంతం చేసింది. నయీం ఎన్‌కౌంటర్ తరువాత అతని కుటుంబీకుల పేరిట వున్న 150 కోట్ల రూపాయల విలువచేసే 35 ఆస్తులకు సంబంధించి వివాదాలు నెలకొనడంతో దీనిపై వివరాలు ఇవ్వాలని ఈడీ అధికారులు సంబంధిత వ్యక్తులను పలుమార్లు కోరినా స్పందించక పోవడంతో వీటిని జప్తు చే సేందుకు నిర్ణయించింది. గ్యాంగ్‌స్టర్‌గా వున్న కాలంలో నయీం వందల కోట్ల రూపాయల ఆస్తులను కూడా బెట్టడం తెలిసిందే. ఇందులో అనేక ఆస్తులను తన కుటుం బీకుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం విదితమే. 2016 ఆగస్టులో షాద్‌నగర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో నయీం చనిపోయిన తరువాత అతని అనుచరులు, కుటుం బీకుల్లో చాలా మంది పోలీసులకు లొంగిపోయి సాధారణ జీవితం గడుపుతుండగా కొందరు మాత్రం నేర జీవితం వైపు మళ్లీ జైలు పాలయ్యారు. కాగా నయీం సంపాదించిన వందల కోట్ల రూపాయల ఆస్తుల్లో చాలా వరకు ప్రభుత్వం అప్పట్లోనే జప్తు చేసింది. ఇందులో కొన్ని తమ నుంచి బలవంతంగా లాక్కున్నట్లు ఆయా ప్రాం తాల రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై విచారణ సాగుతోంది. మరోవైపు నయీం బినామీ ఆస్తులపై వివరాలు సేకరించేందుకు 2022 మార్చి నెలలో ఈడీ అధికారులు రంగంలో దిగి మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. నయీం వందల కోట్ల రూపాయల ఆస్తులను ఎలా సంపాదించాడు...? ఐటి ఎందుకు చెల్లించలేదు...? అనే కోణంలో ఈడీ అధికారులు విచారించారు. ఈడీ నమోదు చేసిన కేసులో నయీం భార్య హసీనా బేగం పేరును చేర్చారు. నయీం బినామీ ఆస్తు ల్లో అతని కుటుంబ సభ్యులె తహీరా బేగం, సలీమా బేగం, అబ్దుల సలీం, అహేలా బేగం, సయ్యద్ నిలోఫర్, ఫిర్దోస్ అంజుం, మహమ్మద్ ఆరిఫ్, హసీనా కౌసర్‌ల పేరిట ఎక్కువగా వున్నట్లు ఈడీ గుర్తించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఈడీ అధికారులు పలుమార్లు వీరికి నోటీసులు ఇచ్చినా సమాధానం లభించలేదు. దీంతో వీరి పేరిట వున్న 35 ఆస్తులను జప్తు చేయాలని ఈడీ నిర్ణయించినట్లు తెలిసింది. కాగా నయీం ఎన్‌కౌంటర్ తరువాత అతని అక్రమాలపై విచారిం చేందుకు సిట్‌ను ఏరా ్పటు చేయగా 250కి పైగా కేసులు నమోదయ్యాయి. నయీం27కు పైగా హత్యలు, పదుల సంఖ్యలో కిడ్నాపులు, అత్యాచారాలు, దాడులకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలినా ఈ కేసుల విచారణ నేటికీ పూర్తి కాలేదు.

# రాణాకు తీహార్ జైల్లో ప్రత్యేక సెల్

ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు. అనంతరం రాణాను 2008 ముంబాయి మారణకాండపై లోతుగా విచా రించేందుకు కస్టడీకి ఇవ్వాలని ఎన్ఐఎ అధికారులు కోర్టును కోరగా అందుకు న్యాయమూర్తి సమ్మతించి 18 రోజుల కస్టడీకి ఇచ్చారు. రాణా కోసం ఈ సెల్‌లో ఎసి సౌ కర్యం కల్పించారు. ఇందులో ఒక మంచం, అటాచ్ టాయ్‌లెట్ వుంది. అయితే రాణాకు టివి, పుస్తకాల సౌకర్యం కల్పించలేదు. భోజనంతో పాటు మంచి నీరు, వైద్య సదుపాయాలు జైలు అధికారులే ఏర్పాటు చేశారు. కాగా రాణా వున్న సెల్‌లో వెళ్లేందుకు ఎన్ఐకు చెందిన సీనియర్ అధికారులు 12 మందికి మాత్రమే అనుమతినిచా ్చరు. రాణా తరపున వాదిస్తున్న న్యాయవాదికి కోర్టు నిబంధనల మేరకు అతన్ని కలిసేందుకు అనుమతి ఇచ్చారు. రాణాను వుంచిన సెల్‌పై 24 గంటలు సిసి టివిలతో నిఘా వుంచారు. గది బయట ఐదుగురు సిఆర్‌పిఎఫ్ కమాండో లతో పాటు ఢిల్లీ పోలీసుల పహారా ఏర్పాటు చేశారు. రాణాను భారత్‌కు తీసుకువచ్చిన తరువాత ఢిల్లీలో ఎన్ఐఎ కార్యాలయం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు,

## విజయవాడ మెట్రో రైలుకు భూసేకరణ

అవసరమైన భూసేకరణపై సమాలోచనలు చేశారు. ప్రాజెక్టు మొదటి కారిడార్‌లో 26 కిలోమీటర్లు మేర మెట్రో నిర్మాణాన్ని ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కారిడార్ పీఎన్‌బీఎస్ నుంచి గన్నవరం వరకు ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో రెండు ,మూడు నెలల లోపలే భూసేకరణ పూర్తి చేసి, ప్రాజెక్టు నిర్మాణాన్ని మొదలు పెట్టాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఆ దిశలో మెట్రో రైలు ప్రాజెక్టు అధికారులతో ప్రభుత్వ ఉన్నత అధికార వర్గం ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటుంది.

# నేడే ఇంటర్ ఫలితాలు

వాట్సప్‌లోనే ఫలితాలు విడుదల చేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో విద్యార్థి మార్కులను పీడీఎఫ్ రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఇవే విద్యార్థులకు షార్ట్ మెమోలుగానూ ఉపయోగపడనున్నాయి. గతంలో ముందుగా ఫలితాలు ఇచ్చి, ఆ తర్వాత షార్ట్ మెమోలను ఆన్‌లైన్‌లో ఉంచేవారు. అయితే ఈసారి వాట్సప్‌లో ఫలితాలు ఇస్తున్నందున పీడీఎఫ్ రూపంలో మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులను ప్రైవేటు కాలేజీలకు దీటుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తోంది. ఎన్నడూ లేని విధంగా ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఈనెల 1 నుంచే తరగతులు ప్రారంభించారు. ఇంటర్ ఫలితాలను లో చూడవచ్చు. లేదంటే ఎంతో సింపుల్‌గా వాట్సప్ ద్వారా తెలుసుకోవచ్చు. మనమిత్ర వాట్సప్ నంబర్ 9552300009కు హాయ్ మెసేజ్ చేసి ఫలితాలు తెలుసుకోవచ్చు. తద్వారా ఫోన్ లోనే రెండే రెండు నిమిషాల్లో రిజల్ట్స్ చూసుకోవచ్చు. ముందుగా మనమిత్ర వాట్సప్ నంబర్ 9552300009కు హాయ్ మెసేజ్ చేయాలి. తరువాత మనకు సేవను ఎంచుకోండి అనే ఆప్షన్ వస్తుంది. అందులో మనకు కావలసిన విద్య సేవలు అనే ఆప్షన్ ఎంచుకోవాలి. అందులో ఇంటర్మీడియట్ ఫలితాలు అనే కాలమ్ ఉంటుంది. దానిని సెలక్ట్ చేసుకుని, నిర్ధారించండి అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేస్తే, ఫలితాలు వస్తాయి.

# సిఐడి విచారణకు జోగి రమేష్

జోగి రమేష్ తన అనుచరులతో వచ్చి ఆందోళన చేసారు. దీనిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసు నమోదయింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం సీఐడీ అధికారులు విచారణకు రావాల్సిందిగా జోగి రమేష్‌ను పిలిచారు. దీంతో ఆయన ఇవాళ విచారణకు హాజరయయారు. చంద్రబాబు ఇంటిపై దాడికి ప్రయత్నించిన వ్యవహారంలో కూటమి ప్రభుత్వం 20 మందికి పైగా కేసులు నమోదు చేసింది. వీరిలో వైసీపీ నేతలు దేవినేని అవినాష్, మాజీ మంత్రి జోగి రమేష్ ఉన్నారు. అయితే చంద్రబాబు ఇంటిపై దాడి చేసే నాటికి జోగి రమేష్ కేవలం ఎమ్మెల్యేగానే ఉన్నారు. ఈ కేసులో వారిని ఇప్పటికే పోలీసులు పలుమార్లు విచారించారు. అయితే ఈ కేసులో తమను అరెస్టు చేయకుండా సుప్రీం కోర్టుకు వెళ్లి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. అయితే దేశం విడిచి వెళ్లొద్దని, పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని కోర్టు ఆంక్షలు విధించింది.

# 'కృత్రిమ మేథ'

రియల్ టైమ్‌లో విశ్లేషించాలన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల డాటాను అనుసంధానం చేసే ప్రక్రియ వేగంగా నిర్వహిస్తున్నట్లు సేకరించిన డేటా ఆధారంగా ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేక ప్రొఫైల్ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంలోని 40 శాఖలకు సంబంధించి వివిధ శాఖాధిపతులు, విభాగాధిపతుల వద్ద ఉన్న డేటాను సేకరించి అనుసందిస్థామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ డేటాలో లేకుండా ఉన్న పౌరుల డేటాకు కూడా కొత్తగా సేకరించామని తెలిపారు. ఆధార్ నమోదు చేసుకోని పౌరులను గుర్తించి వారిని వివరాలు కూడా సేకరించామన్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి 5 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మార్గదర్శి బంగారు కుటుంబాలఖి నమోదు చేపడుతున్నట్టు సమీక్షలో అధికారులు సీఎంకు వివరించారు. ఇందుకోసం మిలాప్, డొనేట్‌కార్ట్, రంగ్‌దే సంస్థలు ప్లేయర్లుగా పీ4లో భాగస్వాములు అవుతున్నాయని తెలిపారు. దాతలు కుటుంబాలను, మండలాలను, గ్రామాలను కూడా దత్తత తీసుకోవడంతో పాటు, నిధులు సమకూర్చేలా పీ4 రూపకల్పన చేశామన్నారు. దాతలు తాము ఎవరికి ఆర్థికంగా సాయం చేయాలి అనుకుంటున్నారో ఆన్ లైన్ ద్వారా కూడా వారికి సాయం అందించే అవకాశాన్ని కల్పించామన్నారు. దాతలు ముందుగా పీ4ప్లాట్ ఫామ్ ద్వారా లాగిన్ అవ్వడంతో ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఇప్పటికే ఈ పథకంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులు తమ కార్యక్రమాలను ప్రారంభించారన్నారు. ఆగస్టు నాటికి ఈ నమోదు ప్రక్రియ పూర్తి చేసి కార్యరూపం దాల్చేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. వచ్చే ఉగాది నాటికల్లా పీ4 కార్యక్రమం ద్వారా ఏడాది కాలంలో ఏం సాధించామనే దానిపై వార్షిక ప్రగతి నివేదిక విడుదల చేయాలని స్పష్టం చేశారు.



శుక్రవారం మేకల పెంపకాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి పార్థసారథి

# బిసి సంక్షేమానికి రూ.48వేల కోట్లు

జిల్లాలో ఆగిరిపల్లి తలసరి ఆదాయం తక్కువగా ఉందని అందువల్ల ఈ గ్రామంలో 206 కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. ఎంత సంపద ఉన్నా బంగారం తినలేమని, బంగారం మంచం మీద పడుకోలేమని అందువల్ల మన మనస్సుకు సంతృప్తి కల్గించే మంచి పనిని ఎంచుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా నూజివీడు సీడ్స్ అధినేత ప్రభాకరరావు, సిద్దార్థ, గౌతమ్, నితిన్ కృష్ణ, పిన్న మనేని ధనప్రకాశ్ తదితరులు తమ ద్వారా అందే సహకారాన్ని అందుకు తగిన ప్రణాళికలను సభలోముఖ్యమంత్రికి ముఖాముఖిగా వివరిం చారు. ప్రభాకర్ మాట్లా డుతూ ఆగిరిపల్లితో పాటు పి-4క్రింది తమ స్వగ్రామమైన తుక్కులూరును కూడా అభివృద్ధి చేస్తా మన్నారు. **మంత్రి పార్థసారథికి కితాబు:** రాష్ట్ర సమాచార శాఖా మంత్రి నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థ సారథిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. నూజివీడు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆయనకు అండగా తాను ఉంటానన్నారు. నీటిసమస్య రాకుండా చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. జనాభా పెరుగుదల అవసరమని ప్రజలే రాష్ట్రానికి ఆస్థి అన్నారు. తొలిత ముఖ్యమంత్రికి రాష్ట్రమంత్రులు పార్థసారధి, సబిత, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎమ్మెల్యేలు బడేటి రాధా కృష్ణయ్య, పత్సమట్ల ధర్మరాజు, కామానేని శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్, ఏలూరు రేంజ్ ఐజి కిషోర్ కుమార్, ఎస్పీ కె. ప్రతాప్ కిషోర్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కాపు కార్పోరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఏలూరు మేయర్ నూర్జహాన్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

# సొంతకుటుంబాల వృద్ధి కోసమే అధికారం

**వారణాసి, ఏప్రిల్ 11:** అధికారాన్ని కోరుకునేవారు తమ సొంత కుటుంబాల వృద్ధిపైనే దృష్టి పెడతారని, తమ ప్రభుత్వం మాత్రం సమ్మిళిత అభివృద్ధి కోసమే పని చేస్తోందని విపక్షాలను ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొంత నియోజకవర్గమైన వారణాసిలో పర్యటించిన ప్రధాని, అక్కడ రూ.3,880కోట్ల విలువైన 44 గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ ప్రతిపక్ష పార్టీలపై ఈ మేరకు విమర్శలు చేశారు. దేశానికి సేవ చేయడంలో మా ప్రభుత్వం సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ మంత్రంతో ముందుకు సాగుతోంది. కానీ అధికారం దాహం కోసం ఆరాటపడే వారు రాత్రి, పగలు రాజకీయ ఆటలు ఆడుతున్నారు. జాతీ ప్రయోజనాలకు కాకుండా కుటుంబాల అభివృద్ధిపైనే దృష్టి పెడుతున్నారు. ప్రతిపక్షాలు పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్ అనే మంత్రంతోనే వ్యవహరిస్తున్నారు. ఈ రోజున భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో కలిసి ముందుకు సాగుతోంది. అందుకు కాశీనే ఒక ఉదాహరణగా మారుతోంది. ఇక ఆయుష్మాన్ భారత్‌తో పేదలు అప్పులు చేయకుండా మెరుగైన వైద్యం లభిస్తోంది. మరోవైపు యువతకు క్రీడా రంగంలో వృద్ధి అవకాశాలను అందించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి మేము మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాము. కానీ ఒలింపిక్స్‌లో మెరవాలంటే, యువత ఈరోజే నుంచే శిక్షణ ప్రారంభించాలిఖి అని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాని మోదీ ప్రారంభించిన ప్రాజెక్టుల్లో 130 తాగునీరు, 100 అంగన్వాడీ కేంద్రాలు, 356 లైబ్రరీలు, పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రోడ్లు, హాస్టళ్ల ఉన్నట్లు వారణాసి డివిజనల్ కమిషనల్ కౌశల్ రాజ్ శర్మ తెలిపారు. అంతేకాకుండా ముగ్గురు వృద్ధులకు ఆయుష్మాన్ కార్డులు, పాడిరైతులకు బోనస్‌లు అందజేశారు. అంతకుముందు వారణాసిలో ల్యాండ్ అవగానే అక్కడ 19 ఏళ్ల యువతిపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటనపై పోలీసు కమిషనర్, డివిజనల్ కమిషనర్‌తో పాటు జిల్లా మెజిస్ట్రేటుతో ఆరా తీశారు. నిందితులపై సాధ్యమైనంత కఠినమైన చర్యలు తీసుకోవాలని, మరోసారి ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారికి ప్రధాని సూచించారు.

## వారం - వర్జ్యం

తేది : 12-04-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
పౌర్ణమి పూర్తి
హస్త సా.6.08
వర్జ్యం రా.3.09 - తె.4.58
దు.తె.5.55 - ఉ.7.33
శుభసమయం : ఉ.6.16-6.55
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. వస్తులాభం.

**వృషభం:** సంఘంలో మీ మాటకు విలువ పెలుగుతుంది. వస్తు వస్త్రాలు కొణాలగోలు చేస్తారు. దైవదర్శనాలు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**కర్కాటకం :** జీవిత భాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. శుభకార్యలలో పాల్గొంటారు.

**సింహం:** ఋణ యత్నాలు ముమ్మరం చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు. స్వల్ప ధనలాభం.

**కన్య :** దూర ప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత ఊరట చెందుతారు. ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణాలు.

**తుల :** ఋణ బాధలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్త అవసరం. సోదరుల కలయిక.

**వృశ్చికం:** విలువైన పత్రాలు, వస్తువులు జాగ్రత్త అవసరం. ప్రయాణాలలో తొందరపాటు వద్దు. శ్రమాధికం.

**ధనుస్సు:** ఉద్యోగాలలో మార్పులు వుంటాయి. అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి.

**మకరం:** పూర్వపు మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**కుంభం:** కుటుంబసభ్యుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు. ప్రయోగాలలో ఆటంకాలు ఎదురువుతాయి.

**మీనం :** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. వాహన యోగం.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పంటల సాగు విస్తీర్ణం మేరకు ఉత్పాదకత పెంపు

## - చిత్తూరు మామిడికి బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ప్రాధాన్యం

## - రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల డైరెక్టర్ కె.శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**చిత్తూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లాలో మామిడి పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, ఈ మేరకు మామిడి ఉత్పాదకతను సైతం పెంచాల్సిన అవసరం వుందని రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. చిత్తూరులో ఎన్‌పిసి పెవిలియన్‌లో శుక్రవారం మామిడి రైతులు, కొనుగోలుదార్లు నిర్వహించిన ఉద్యాన పంటల సదస్సుకు రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాస్ హాజరయ్యారు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సుమిత్‌కుమార్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలిరిరి మురళీమోహన్, మేయర్ అముద, చుడా ఛైర్పర్సన్ కఠారి హేమలత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక హెక్టర్ విస్తీర్ణంలో 12 వేల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి అవుతుందని, అదే గుజరాత్‌లో ఒక హెక్టర్ విస్తీర్ణంలో 15 వేల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పాదకత వుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే మన దేశంలో ఒక హెక్టారుకు 9 మెట్రిక్ టన్నులు వుండగా బ్రెజిల్ లాంటి దేశాల్లో ఒక హెక్టారుకు 20 నుండి 25 మెట్రిక్ టన్నుల ఉత్పాదకత వుందన్నారు. మామిడి పంటతో పాటు ఇతర ఉద్యాన పంటల ఉత్పాదకత, మార్కెటింగ్, ప్రాసెసింగ్, గిట్టుబాటు ధరలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు వున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ఏడు నెలల్లో లక్ష హెక్టార్లకు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అమలు చేయడం జరిగిందని, దేశ స్థాయిలో గత ఏడాది కాలంలో 1.12 లక్షల హెక్టార్ల మైక్రో ఇరిగేషన్ అమలు చేసి రాష్ట్రం దేశ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. అలాగే ఉత్పాదకత లేని మామిడి తోటలను తిరిగి పునరుజ్జీవం చేసేలా, పంట తెలుగు నివారణపై శాస్త్రజ్ఞులతో పరిశోధనలు చేస్తున్నామని, బయో లిక్విడ్ వాడకం ద్వారా భూసారం పెంచగలిగితే ఉత్పాదకత పెరిగే పరిస్థితి వుంటుందన్నారు. ఈ విధంగా చేస్తే గతంలో 5 వేల రూపాయలు ఆదాయం చూసిన రైతు 30 వేల రూపాయల ఆదాయం చూడవచ్చునన్నారు. రాష్ట్రంలో మొదటి సారిగా మామిడి పంటకు ఇన్సురెన్స్ చేయడం జరిగిందని, 20 వేల రైతులు ఇన్సురెన్స్ చేయడం జరిగిందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా చిత్తూరు మామిడికి చాలా ప్రాధాన్యత వుందని, రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతుకు అండగా నిలుస్తోందన్నారు. జిల్లాలో 75 వేల మంది రైతులు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారని, జిల్లాలో 90 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు వుండగా అందులో 70 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి పంట వుందన్నారు. గత పదేళ్ళుగా చెరకు, వేరుసెనగ రైతులు మామిడి పంటపై అధిక దృష్టి సారించడంతో మామిడి సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. ప్రతి ఏడాది 10 నుండి 15 శాతం మామిడి పంట సాగు విస్తీర్ణం పెరగడం గుర్తించామన్నారు. జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు అధికంగా మామిడి పంటపై ఆధారపడ్డారని, మామిడి, ఇతర పంటలను మార్కెటింగ్ చేయడానికి తగిన సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



# 'స్వర్ణ' రథంపై 'శేషాద్రివాసుడు'

**తిరుమల,ఏప్రిల్ 11ప్రభాతవార్తప్రతినిధి:** సప్తగిరుల్లో కొలువైన శ్రీనివాసుడు శుక్రవారం ఉదయం స్వర్ణమయమైన మహోన్నత రథం అధిరోహించి భక్తులను కటాక్షించాడు. ఏడుకొండలస్వామికి వేసవితాపం నుండి ఉపశమనానికి జరిపిస్తున్న వసంతోత్సవాల్లో రెండవరోజు శుక్రవారం ఉదయం శ్రీదేవిభూదేవిసమేతుడై మలయప్పస్వామి బంగారురథంపై భక్తులను కటాక్షించడం ఆనవాయితీ. ఉదయం నిత్యకైంకర్యాలు ముగించుకున్న తరువాత బంగారుదేవుడు ఉభయదేవేరులతో కలసి బంగారురథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. స్వర్ణరథోత్సం ఒక విశిష్టమైన వాహనం. స్వర్ణమయమైన రథం ఆలయం వద్ద నుండి బయలుదేరింది. దాసభక్తుల నృత్యాలు ఆకర్షణీయంగా కనువిందుచేశాయి. భగవంతుడు శైల్య, సుగ్రీవ, మేఘ,పుష్ప, పలహాకా అనే నాలుగు గుర్రాలు పూన్చిన రథమెక్కి విహరించాడు. దారుకుడు ఆయనసారధి. ఈ రథంమీద పయమినస్తూన్న శ్రీమలయప్ప స్వామిని దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. స్వర్ణరథాన్ని మహిళా భక్తులు లాగారు. ఈవాహనసేవలో టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతులనెహ్రూ, టిటిడి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విఎస్ఒ సురేంద్ర, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పోషకాహారం

## - బాలామృతంలోను కొన్ని మార్పులు

**విజయవాడ ఏప్రిల్ 11 ప్రభాతవార్త ప్రతినిధి:** అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మంచి పోషక ఆహారం ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ దిశలో ఇప్పటికే చర్యలు చేపట్టింది. పోషకాహారాన్ని రుచికరమైనది అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఆహారంలో ఎక్కువ పోషకాలుంటే చిన్నారులు ఆరోగ్యంగా ఎదుగుతారనే ప్రభుత్వం అభిప్రాయం, అందుకే డైటిషియన్స్, న్యూట్రిషన్‌తో చర్చించి కీలక నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే 3-6 వయసున్న పిల్లలకు మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు చేయనుంది. వారంలో ఉడికించిన శనగలు అందించనుంది. అన్ని కూరలు, పప్పులో మునగ పొడిని వినియోగించనుంది. బాలామృతంలోనూ చక్కెర స్థాయిని తగ్గించి మార్పులు చేసింది. బాలామృతంలో పోషకాలు పెంచేందుకు చేయాల్సిన మార్పులపై యునిసెఫ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్ సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ టాటా ట్రస్ట్ మంగళగిరి ఎయిమ్స్ ప్రతినిధుల బృందంతో కమిటీని వేసి మహిళా శిశు సంక్షేమ శాఖ సంక్షేమ శాఖ అధికారులు పలు దఫాలు చర్చించారు. వారిసూచనలు సలహాల ఆధారంగా చక్కెర స్థాయిని తగ్గించి పోషకాలు పెంచేందుకు పెసరపప్పు గోధుమపిండి వేయించిన వేరుశనగ పొడి, శనగ పొడిని కలిపి పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. చక్కెర లేకపోవడంపై పిల్లల తల్లిదండ్రుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొంతమేర చక్కెర లేదా బెల్లం కలపాలని పలువురు సూచించారు. శ్రీకాకుళం జిల్లా గార ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తల్లిదండ్రులు బాలామృతంలో వేరుశనగ కలపడం వల్ల వాసన వస్తోందని జీలకర్ర కలిపితే అది తగ్గుతుందని అభిప్రయాపడ్డారు. చిత్తూరు గ్రామీణ ఐసీడీఎస్ పరిధిలో చక్కెర కలపొద్దని సూచించారు. ఇప్పటివరకు 6 నెలల నుంచి 3 ఏళ్ల వయసు పిల్లలకు నెలకు రెండున్నర కిలోల బాలామృతం అందిస్తుండగా ఇకపై దాన్ని 2 విభాగాలుగా చేయనున్నారు. 7 నుంచి 12 నెలల చిన్నారులను జూనియర్‌గా 13 నుంచి 3 ఏళ్ల పిల్లలను సీనియర్‌గా పరిగణించనున్నారు. అందించాల్సిన పోషకాలతో బాలామృతంలో మార్పులు చేయనున్నారు. ఈ బాధ్యతను అక్షయపాత్రకు అప్పగించారు. తొలుత దీన్ని అధికారులు పైలట్ ప్రాజెక్టు కింద విశాఖ, ఏలూరు, ఒంగోలు, కర్నూలు జోన్ల పరిధిలోని ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో నెలపాటు అమలు చేశారు. మార్పులపై అక్కడి తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. వాటి ఆధారంగా మరిన్ని మార్పులు చేసి, మరో పది రోజుల్లో 26 జిల్లాల్లోని ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తారు. నెల తరువాత ఆయా కేంద్రాల పరిధిలోని తల్లిదండ్రులు, పిల్లల అభిప్రాయాల నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, తదుపరి అమల్లోకి తీసుకువచ్చేలా చేశారు.



జ్యోతిరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విజయానంద్

**విజయవాడ,ఏప్రిల్11,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మా జ్యోతి బా పూలే 199 వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అదే విధంగా రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, సిఎం కార్యదర్శి ఎవి రాజమౌళి,,ఐటి శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తదితర అధికారులు పాల్గొని జ్యోతిబా పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ సమాజానికి పూలే అందించిన సేవలు ఎనలేనివని మహారాష్ట్రలో జన్మించిన కుల వ్యతిరేక కార్యకర్త, రచయిత, ఆలోచనా పరుడు మరియు సామాజిక సంస్కర్త జ్యోతిబా పూలే అని పేర్కొన్నారు. అదే విధంగా భారతదేశంలో సామాజిక మార్పును పెంపొందించడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. ఆయన జయంతి రోజైన నేడు దేశ పౌరులు బహుముఖ ప్రజ్ఞాశాలైన సామాజిక సంస్కర్త గురించి ప్రతి ఒక్కరూ తెల్సుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అంతేగాక జ్యోతిబా పూలే భార్య సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళల విద్య కోసం విశేష కృషి చేశారని చెప్పారు. పూలే సమాజానికి చేసిన సేవలను గుర్తుంచుకుని సామాజిక సంస్కర్తగా ఆయన కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులు మరియు చేసిన త్యాగాలను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని సిఎస్ అన్నారు. 1873లో కుల వ్యవస్థ వల్ల కలిగే సామాజిక ఆర్థిక అసమానతలను తిప్పికొట్టడానికి సత్యశోధక్ సమాజ్ ("సత్యశోధక్ సమాజ్") అనే సంస్కరణ సంఘాన్ని పూలే స్థాపించారని సిఎస్ విజయానంద్ ఈసందర్భంగా గుర్తు చేశారు. పూలే బాల్య వివాహాలను వ్యతిరేకించడం తోపాటు వితంతు పునర్వివాహం చేసుకునే హక్కును సమర్థించారని సిఎస్ విజయానంద్ గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పిల్లల అల్లరిని భరించలేకున్నాం..

## పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం!

### - తల్లిదండ్రులకు ఆమిద్యాల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం జి.వి.నాగమంజుల లేఖ



విద్యార్థుల చేతిలో ధ్వంసమైన సీలింగ్ ఫ్యాన్

**ఉరవకొండ, ఏప్రిల్ 11 ప్రభాతవార్త** మీ పిల్లల అల్లరిని భరించలేకున్నామని ఇప్పుడెలాగో విద్యార్థులను ఉపాధ్యాయులు దండించే పరిస్థితి లేదు..తల్లిదండ్రులుగా మీరు వారిని కట్టడి చేయలేకపోతే వారిపై పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయాల్సి వస్తుందని ఉరవకొండ మండలం ఆమిద్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.నాగమంజుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు లేఖ రాశారు. ఈనెల 10వ తేదీన లేఖను రాసి పాఠశాలకు చెందిన 9వ తరగతి బి సెక్షన్ విద్యార్థుల తల్లిదండ్రుల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. ఈ లేఖ తీవ్ర కలకలంరేపి సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గత నెలలో విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం విద్యార్థులకు సాష్టాంగ నమస్కారంచేసి మేము కొట్టలేం..తిట్టలేం ఏమీ చేయలేం, మీ ఎదుట చేతగానివారిలా చేతులు కట్టుకొని ఉండాల్సి వచ్చింది. క్రమశిక్షణ తప్పితే మిమ్మల్ని శిక్షించబోం. మాకు మేమే శిక్ష అనుభవిస్తాం అంటూ వారి ఎదుటే గుంజీలు తీసిన ఘటన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అదే తరహాలోనే ఇప్పుడు ఆమిద్యాల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం లేక సంచలనంగా మారుతోంది. వివరాల్లోకి వెళితే... 9వ తరగతి విద్యార్థులు కొందరు చేస్తున్న అల్లరిని, పాఠశాలలో చేస్తున్న విధ్వంసాన్ని భరించకలేక ఆమిద్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.నాగమంజుల తీవ్ర ఆవేదనతో ఈ లేఖను తల్లిదండ్రులకు రాసినట్లు తెలుస్తోంది. హెచ్ఎం రాసిన లేఖ పూర్తి సారాంశంలోకి వెళితే...పాఠశాలలో ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయని పరీక్షల మధ్యలో నీళ్ల కోసం బయటకు వెళుతున్నారని అలాగే ఇంటికి వెళ్లిపోతున్నారు. 9వ తరగతి విద్యార్థులు కొంతమంది అల్లరి గ్యాంగ్‌గా తయారవుతున్నారు. ఎన్నిసార్లు వాళ్లకు మంచిగా చెప్పినా వినడంలేదు. స్కూల్ టైంలో ఏదైనా జరిగితే అందుకు అందరూ బాధపడాల్సి వస్తుంది. కనుక మీ పిల్లల విషయంలో మీరు కొంత శ్రద్ధ తీసుకోవాలి. అంతేకాక అల్లరి గ్యాంగ్ పనులు చూసి మిగిలిన తరగతుల విద్యార్థులు అలాగే తయారవుతున్నాయన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు దండించలేని పరిస్థితి. ఇప్పుడు 10వ తరగతి పరీక్షలు వ్రాసి వెళ్లిన విద్యార్థులు బెంచీల పలకలు, స్క్రూలు తీసివేసి విరగొట్టడం, ఇంటికి తీసుకొని వెళ్లడం, కాంపౌండ్ గోడకు ఉన్న బండలు విరగ్గొట్టడం, స్విచ్ బోర్డులు విరగొట్టడం వంటి పనులు చేసినారు. అదేవిధంగా ఇప్పుడు 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా ఫ్యాన్‌లు వంచడం, స్విచ్ బోర్డులు పీకడం, ఆండ్రాయిడ్ బాక్సులు, స్టాండ్లు పగులగొట్టడం వంటి పనులు చేశారు. మళ్లీ ఇలాగే జరిగితే విద్యార్థుల మీద పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వాల్సి ఉంటుంది. దయచేసి అర్థం చేసుకొని మీ పిల్లల ప్రవర్తన గమనించి సరిచేయవలసినదిగా కోరుచున్నాను. అంటూ లేఖలో పేర్కొన్నారు. గతంలో ఉరవకొండలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలోనూ ఇదే పరిస్థితి ఏర్పడగా విద్యార్థులు కొందరు ఎదురుతిరిగి హెచ్ఎం, ఉపాధ్యాయులు తమను మందలిస్తున్నారని ఏకంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వారిపై పిర్యాదు చేసిన ఘటన అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ తరువాత హెచ్ఎం విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి వారి చేష్టలను వారికి తెలియజేసి ఇలాంటివి మరోమారు జరుగకుండా పూర్తి బాధ్యతను తాము తీసుకుంటామని పూచికత్తు లేఖలు రాయించుకున్న విషయం తెలిసిందే.

# టిడ్కో కాలనీల్లో ఎంఎస్ఎంఇ యూనిట్లతో మహిళలకు జీవనోపాధి: మంత్రి నారాయణ



ఎంఎస్ఎంఈ యూనిట్ల అధ్యయనానికి హైదరాబాద్ ప్రగతినగర్ లో మంత్రి నారాయణ బృందం పర్యటన

**విజయవాడ,ఏప్రిల్11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో నివసించే మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించేందుకు ఏపీ మున్సిపల్ శాఖ వేగంగా అడుగులు ముందుకు వేస్తుంది...ఈ ఏడాది రాష్ట్రంలో లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారు..పట్టణ ప్రాంతాల్లో 30 వేల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను రూపొందించాలనేది ఉద్దేశంగా పెట్టుకున్నారు.ఇదినికోసం ఏపీ పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ కొంతకాలంగా వివిధ రాష్ట్రాల్లోని కీలక నగరాల్లో మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలో పర్యటించి అధ్యయనం చేస్తోంది.ఈ క్రమంలోను ఎంఎస్ఎంఈ యూనిట్ల అధ్యయనానికి హైదరాబాద్ లో మంత్రి నారాయణ బృందం పర్యటించింది..రాష్ట్రంలోని టిడ్కో గృహాల్లో నివసించే మహిళల ద్వారా ఎంఎస్ ఎంఈ యూనిట్లు నెలకొల్పి వారికి జీవన భృతి కల్పించాలని నిర్ణయించింది.టిడ్కో నివాస సముదాయాల్లో ఖాళీ స్థలాలున్న 163 ప్రాంతాల్లో పట్టణ పేదరిక సంస్థ ద్వారా లైవ్ లీ హుడ్ సెంటర్లను ఏర్పాటుచేస్తున్నారు...ఈ జీవనోపాధి కేంద్రాల్లో(లైవ్ లీ హుడ్ సెంటర్ లు) మహిళలకు వివిధ నైపుణ్యాలకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారితో ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు చేయిస్తారు...అయితే ఎలాంటి యూనిట్లు ఏర్పాటుచేయాలి..ఏయే యూనిట్ల ద్వారా ఎక్కువ ఆదాయం వస్తుంది,ఎలాంటి సాంకేతిక ఉపయోగించాలనే దానిపై అధ్యయనం చేస్తున్నారు.మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో భాగంగా హైదరాబాద్ లోని ప్రగతినగర్ లో మహిళా పారిశ్రామిక వేత్తలఅసోసియేషన్(ఎలీప్) ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ను సందర్శించింది మంత్రి నారాయణ బృందం.. ఈ పర్యటనలో మంత్రి సందర్శించారు.

# తిరుమల సమాచారం

## మలయప్ప ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా వసంతోత్సవం



**తిరుమల,ఏప్రిల్ 11ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి వేసవితాపం నుండి ఉపశమనం కోసం రెండవరోజు శుక్రవారం మధ్యాహ్నం విశేష స్నపనతిరుమంజనం నిర్వహించారు. మూడురోజుల వసంతోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఆలయ అర్చకులు పాలు,పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, గంధంతో ఆగమోక్తంగా అభిషేకించారు. ఉత్సవర్ల అభిషేకసమయంలో తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతిమంత్రాలు,దివ్యప్రబంధంలోని అనుసంధానం పాశురాలను జీయంగార్లు పఠించారు. సాయంత్రం వసంతమండపం నుండి బయలుదేరి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

### - శ్రీవారిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు



**తిరుమల,ఏప్రిల్ 11ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా వుండాలని,ప్రజలు అన్ని విధాలా ఆర్థికంగా అభివృద్ధిచెందాలని ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు తెలిపారు. తిరుమలలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, దర్శనాలు మార్పు రావడంతో అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి పనులు చేస్తోందన్నారు. పి4 విధానంతో ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయమన్నారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి శేషవస్త్రం,చిత్రపటం బహుకరించారు.

## ప్రపంచ భాషలలో సంపూర్ణ శ్రీమద్భగవద్గీతను రూపొందించడమే లక్ష్యం: డాక్టర్ గజల్ శ్రీనివాస్



**విజయవాడ,ఏప్రిల్11,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ బాషలలో సంపూర్ణ శ్రీమద్భగవద్గీత ఆడియో ను రూపొందించడమే తన లక్ష్యమని ప్రఖ్యాత గజల్‌గాయకుడు,దేవాలయాల పరిక్షణ సమితి నేత మ్యాస్ట్రో డాక్టర్ కేశిరాజు శ్రీనివాస్ వెల్లడించారు. ఇప్పటికే 25 భాషల్లో రికార్డింగ్ పూర్తి అయ్యిందన్నారు. శ్రీమద్భగవద్గీత యూట్యూబ్ , ఇతర మాధ్యమాల ద్వారా ఉచితంగా వినవచ్చునని, పల్లె పల్లె కు, గుండె గుండె కు , ఖండఖండాతరాలకు గీతను చేర్చాలన్నదే నా ఆశయమని శ్రీమద్భగవద్గీత తెలుగు ఆడియో లోకార్పణ సభలో డా.గజల్ శ్రీనివాస్ అన్నారు. తన స్వస్థలమైన పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన గీత ఆవిష్కరణ సభలో డా గజల్ శ్రీనివాస్ తండ్రి కేశిరాజు నరసింహారావు (93) చేతుల మీదుగా డా.గజల్ శ్రీనివాస్ స్వరపరిచి, గానం చేసిన శ్రీమద్భగవద్గీత ఆవిష్కరణ జరిగింది. ఈ సభలో పూర్వ శాసన సభ్యులు డా. సి.హెచ్. సత్య నారాయణ మూర్తి(బాబ్జిగారు) పూర్వ శాసన మండలి సభ్యులు అంగర రామ మోహన్, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణ, కళారత్న రసరాజు, రోటరీ అంతర్జాతీయ డైరెక్టర్ డా. వడ్లమాని రవి , సేవ్ టెంపుల్స్ భారత్ సభ్యులు మేడికొండ శ్రీనివాస్, అడ్డాల వాసుదేవరావు, శ్రీ ముచ్చర్ల సత్య నారాయణ, శ్రీ విఠకుల రమణ, రెడ్డప్ప ధవీజీ , మాంటిస్సోరి వర్మ , శ్రీ తటవర్తి కృష్ణ మూర్తి , స్థానిక పెద్దలు , పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ సభలో పాల్గొని డా.గజల్ శ్రీనివాస్ గీతా గాన యాజ్ఞాన్ని అభినందించారు.

## శ్రీవారి ఆశీస్సులందుకున్న తెలుగురాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు



**తిరుమల,ఏప్రిల్ 11ప్రభాతవార్తప్రతినిధి:** రెండు తెలుగురాష్ట్రాలు అన్ని విధాలా బావుండాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని ఇరురాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు ఆకాంక్షించారు శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ నీలంసాహ్నీ, తెలంగాణ కమిషనర్ రాణికుముదిని ఇరువురూ ఆలయంలోనికి చేరుకుని కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నారు. టిటిడి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ స్వామివారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి అనుగ్రహంతో శుభాలు కలగాలి : సుజనాచౌదరి

**తిరుమల,ఏప్రిల్ 11ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వకస్వామి అనుగ్రహంతో అందరికీ శుభాలు కలగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని బిజెపి ఎంఎల్ఎ సుజనాచౌదరి ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో అనేక సంక్షేమపథకాలతో ముందుకు వెళుతోందన్నారు. ప్రజలకు మంచి చేస్తున్నామని తెలిపారు.శుక్రవారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మహాత్ముడు జ్యోతిరావ్ పూలే

**విజయవాడ, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం ఏపి బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవివిఎస్ మూర్తి అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

నిట్ నెం.01/EE/R&B/KNG/TO/2025-26 తేది: 08.04.2025

పనిపేరు: ప్రకాశం జిల్లా పొదిలి వద్ద కోర్ట్ బిల్డింగ్‌కు అంతర్గత రోడ్‌కు మరియు నివాసిత క్వార్టర్స్‌కు అత్యవసర మరమ్మతులు, అంచనా మొత్తం రూ.4.70 లక్షలు. డౌన్‌లోడ్‌కు తేది: 15.04.2025 ఉ.10గం. నుండి 28.04.2025 సా.4.00గం. తదుపరి వివరాలు ఇ-మార్కెట్ ప్లేస్ tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (R&B) డివిజన్, కనిగిరి.

DIPR.NO. 16088/CL/ADVT/1/1/2022-23 తేది: 11.04.2025

వార్త

కోపం ఒక ఘనత అనుకొని, లాభం అనుకుని దానికి లొంగిపోయిన వారికి అందువల్ల కలిగే కీడు అనుభవించక తప్పదు.

-తిరుక్కురళ్

# పౌష్టికాహార లేమి!

ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టికాహార లోపం నుండి గట్టెక్కించ లేకపోతున్నారు. ఇప్పటికీ దేశంలో కోట్లాది మంది పౌష్టికాహార లోపంతో రకరకాల సమస్యలతో సతమత మవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవైశాతంపైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదికలు ఏనాటి నుంచో చెబుతున్నాయి. ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లోదాదాపు నలభైశాతం మంది తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో దాదాపు ఆరేడు శాతం మంది పిల్లలు పుట్టినా ఐదేళ్లలోపే మరణిస్తున్నారని ఎన్నో నివేదికలు వెల్లడించాయి. ఈభూమ్మీద పుట్టినవారికి ఎవరికైనా జీవించేహక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది పాలకపెద్దలే. తల్లీబిడ్డకు పోషకాహారం అందివ్వకపోవడం కూడా పాలకుల బాధ్యతారాహిత్యం కిందకే వస్తుంది. అందుకోసం కొత్తగా పథకాలు ప్రవేశపెట్టకపోతేపోయారు ఉన్నపథకాలను ఏ మేరకు అమలు చేస్తున్నారో, అర్హులైన వారిలో ఎంత మందికి అందిస్తున్నారో పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలువెలుగులోకి వస్తాయి. పర్యవేక్షణాలోపం కారణంగా తల్లీబిడ్డలకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారిపడుతున్న విషయం ఎన్నో సార్లు వెలుగు చూసినా పటిష్టమైన చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పోషకాహార లోపం పెచ్చరిల్లిపోతుందనే చెప్పొచ్చు. భారత్‌లో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషక ఆహార సమస్య అధికంగాఉంది. ప్రపంచవ్యాప్తంగా పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిలో మూడోవంతుభారత్‌లో ఉన్నారనే విషయం అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈలోపాన్ని అధిగమించేందుకు పాలకులు ఏమీచేయడంలేదని చెప్పడంలేదు. ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఉద్యోగులు, స్వచ్ఛంద సేవాసంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయి. 1975లోనే ఆరేళ్లలోపు పిల్లలకు,తల్లులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఆనాటి కేంద్ర ప్రభుత్వం సమీకృత శిశు అభివృద్ధిపథకాన్ని ప్రవేశపెట్టింది.ప్రధానమంత్రి మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారాఎన్నో కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. పోషకాహార లక్ష్యంగా పని చేయాలని అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిస్థాయిలోఆ దిశగా అడుగులు వేయాలని తెలంగాణ పంచాయతీరాజ్,మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క గురువారం జరిగిన ఉన్నతాధికారుల సమీక్షాసమావేశంలో ఆదేశాలిచ్చారు.రాబోయే రోజుల్లో అంగన్‌వాడీ సెంటర్లకు గ్రేడింగ్ ఇస్తామని మంచి ఫలితాలు సాధించిన సెంటర్లకు సిబ్బందికి,అధికారులకు అవార్డులు ఇస్తామని కూడా ప్రకటించారు.అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరఅయ్యే సరుకుల్లో నాణ్యతలోపిస్తే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని మంత్రి హెచ్చరించారు. ఒక్క తెలంగాణనే కాదు అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఆమాటకొస్తే అనేక రాష్ట్రాల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయినా భారత్‌లో ఈసమస్య ఎందరినో పట్టిపీడిస్తున్నది. 2022ప్రపంచ ఆకలి సూచీలో 121 దేశాల్లో భారత్ 107వస్థానంలో ఉంది. ఈ పౌష్టికాహార లోపంకారణంగానే ఆరోగ్యపరంగా ముఖ్యంగా మహిళలు,చిన్నారుల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లల్లో దాదాపుముప్పైశాతానికి పైగా వయసుకు తగినఎత్తుకు పెరగడంలేదు.మరో పంతొమ్మిదిశాతం ఎత్తుకు తగినబరువు ఉండడంలేదు. ముప్పై రెండుశాతం పిల్లల ఎదుగుదల లోపాలను ఎదుర్కొంటున్నారు. జార్ఖండ్, అసొం, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ఈపౌష్టికాహార సమస్యలు అధికంగా ఉన్నాయి. ఇంకోవైపు పదిహేనేళ్ల బాలికలనుండి యాభైఏళ్లలోపుఉన్న మహి ళలల్లో దాదాపు యాభైఏడుశాతం రక్తహీనతతో బాధపడు తున్నారు. ఎనభైశాతానికి పైగా సూక్ష్మపోషకాల కొరతను ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా పోషకాలుకలిగినబియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగిస్తామని ప్రధాని ప్రకటించారు.2030నాటికే పిల్లల్లో తీవ్రమైన పౌష్టికాహారాన్ని నియంత్రించేందుకు మూడువేల కోట్ల రూపాయలకుపైగా వ్యయంతో ప్రత్యేక పథకాన్ని ఒడిశా ప్రభుత్వం తీసుకువచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. మరికొన్ని రాష్ట్రాలు కూడా ఆ కోణంలో ఆలోచించి పథకాలు ప్రవేశపెడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం మొన్న ఉగాది నుంచి సామాన్యుల నుంచి నిరుపేదలు ఇష్టపడే సన్నబియ్యాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం పట్ల సన్నజనం ఎంతోసంతోషం వ్యక్తంచేస్తున్నది. గతంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారావస్తున్న దొడ్డుబియ్యాన్ని తినలేక ఐదు, పదిరూ పాయలకు కిలో అమ్ముకునేవారు. దళారులకు ఇది ఒకవరంగా మారిపోయి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. పథకాలు,ఉద్దేశాలు అన్నిసక్రమంగా ఉన్నా సంతృప్తి కల్పించేవిధంగా కన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి చాలావరకు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాస్తవంగా చూసినా గతదశాబ్దకాలంగా భారత్‌లో ఆహారధాన్యాల ఉత్పత్తులకు కొరతలేదు. రికార్డుస్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఈపరిస్థితుల్లో కొత్త పథకాల గురించి ఆలోచించకపోయినా ప్రస్తుతం ఉన్న పథకాలను సవరించి పర్యవేక్షణను మరింత పటిష్టం చేస్తే కొంతవరకైనా లక్ష్యాన్ని చేరుకుంటాం.

ఏమీ చేయకుండానే ఎంతో కొంత పొందాలని ఎదురుచూసే వ్యక్తులు తప్పనిసరిగా నిరాశకు గురవుతారు.



ఎలైట్

ఏ పని అయినా తరచూ చేస్తూంటేనే ఒక అలవాటుగా మారుతుంది. ఆ అలవాటును కొనసాగిస్తే మనసులో పాతుకుపోతుంది.



ఎడ్వర్డ్స్

# ప్రజాచైతన్యమే పరిష్కారం

**సినిమా యాక్టర్‌లు రాజకీయాల్లోకి రాకూడదని, రారాదని చెప్పడం లేదు. స్వతంత్ర భారతావనిలో భారత పౌరులు ఎవరైనా రాజకీయ రంగంలో ప్రవేశించవచ్చు. అందులోనూ కళామతల్లికి వారు చేస్తున్న సేవలను, ప్రజలకు వారు అందిస్తున్న వినోద విజ్ఞానాన్ని విస్మరించలేం. ఇందులో మరో అభిప్రాయానికి తావులేదు. తాము చేస్తున్న కళాసేవను ఆరాధించే తమ అనుచరుల అభిమానాన్ని ఓట్లుగా మలచి పలనా పార్టీకి ఓటువేయమని చెప్పడం ఎంతవరకు సమంజసమో వారే విజ్ఞతతో ఆలోచించాలి. రాజకీయరంగం రానురాను కలుషితమైపోతున్నది.ప్రజాసేవ,నీతి నిజాయితీ నిస్వార్థం,నిష్పక్షికత లాంటివి దూరంమైపోతున్నాయి. ప్రజల్లో చైతన్యం వస్తే తప్ప ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశాలు కన్పించడంలేదు..**

దామెర్ల సాయిబాబ

పాలకులు వ్యాపారులైతే ప్రజలు బికారులు అవుతారనే చాణక్యనీతిని విస్మరించలేం. ప్రజాసంక్షేమంపై తీవ్ర దుష్ప్రభావాలు చూపుతాయని ఆనాడే చాణక్యుడు హెచ్చరించారు. అప్పట్లో రాజులు కూడా వ్యాపారంగంలో ప్రవేశిస్తే ప్రజలకు మేలు జరుగుతుందనే ప్రతిపాదనను చాణక్యుడు పూర్తిగా వ్యతిరేకిస్తూ అదే జరిగితే అందులో అక్రమాలకు, అవకతవకలకు ఎవరు అడ్డుపడతారు?ఎవరు నియంత్రిస్తారు? అంటూ అభ్యంతరం వ్యక్తంచేశారు.అదే జరిగితే ప్రజలు బికారులు అవుతారని చాణక్యుడు స్పష్టంచేశారు. అది అప్పటికీ,ఇప్పటికీ అక్షరసత్యం. రాజులు పోయారు. రాజరికాలు అంతరించాయి. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులే ప్రభువులు అయ్యారు. ప్రజారక్షణతోపాటు సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో ప్రవేశపెట్టి ప్రజా అవసరాలను తీర్చేందుకు, పర్యవేక్షించేందుకు నిబంధనలను, చట్టాలను రూపొందించుకున్నాం. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత చాలా కాలం పాటు రాజకీయ నేతలు వ్యాపారాల్లో భాగస్వాములు అయ్యేవారు కాదు. కాంట్రాక్టులు ముఖ్యంగా మద్యం వంటి వ్యాపారాలకు దూరంగా ఉండేవారు. వ్యాపారాల్లో కల్తీ, అవినీతి, అవకతవకలు జరిగితే అవి చుట్టుముట్టి తమ రాజకీయ జీవితానికి పరిసమాప్తం పలుకుతాయనే భయం ఉండేది. చట్టపరంగా కూడా రాజ్యాంగంలో కొన్ని నిబంధనలను మన రాజ్యాంగ నిర్మాతలు విధించారు. కానీ పరిస్థితులు మారిపోయాయి. లాభసాటిగా ఉన్న వ్యాపారాల్లో పరోక్షంగానో, పత్యక్షంగానో కొందరు రాజకీయ నాయకులు భాగస్వామ్యులౌతున్నారు. అసలు రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించే రాజకీయ నాయకులు కనుమరుగైపోయారు. ఎన్నికల వ్యయం కూడా అంచనాలకు అందకుండా పెరిగిపోయింది. పెట్టుబడి, తిరిగి సంపాదన, మళ్లీపెట్టుబడి సంపాదన అన్నట్టుగా రాజకీయాలు ఒక విషవలయంగా మారిపోయాయి. తెలుగురాష్ట్రాల్లో కానీ, దేశంలోకానీ పెరుగుతున్న అవినీతికి ప్రధానంగా కారణాల్లో ఇదికూడా ఒకటి. ఏ కుంభకోణాన్ని అయినా తీసుకోండి పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ఏదో ఒక రాజకీయ నాయకుడికి సంబంధం ఉంటున్నది. అందులో కొన్ని మాత్రమే బయటకు వస్తున్నాయి. వెలుగు చూసిన ఆ కుంభకోణాల్లో కోట్లాది రూపాయలు ప్రజాధనం కొల్లగొట్టినట్లు బయటపడినా బాధ్యులైన నేతలను జైళ్లకు పంపినా దోచుకున్న డబ్బులు తిరిగి రాబట్టు కోలేకపోతున్నారు. ప్రజారోగ్యంపై దాడి చేస్తున్న కల్తీ భూతం గురించి అందరికి తెలిసిందే. పెట్రోల్‌నే తీసుకుందాం. ఎంత పెద్దఎత్తున కల్తీ జరుగుతున్నదో జగమెరిగిన సత్యం. పెట్రోలులో కల్తీ వల్ల వినియోగదారుడికి జరుగుతున్న నష్టం గురించి అటుంచితే కాలుష్యం ఎంతగా వెదజల్లుతున్నదో, ఎన్నో కోట్ల మంది ప్రజల ఆరోగ్యాన్ని బలితీసుకుంటున్నదో అంచనాలకే అందదనే విషయం వైద్యనిపుణులే అంగీకరిస్తున్నారు. ఆ పెట్రోల్ బంక్‌లు ఎవరివి? ఎవరు పేరుమీద నడుస్తున్నాయి? వెనుక ఉన్న పెద్దలు ఎవరు? ఆయా ప్రాంతాల ప్రజలకు తెలియని విషయాలు ఏమీ కావు. అంతా బహిరంగ రహస్యమే. ఇక కాంట్రాక్టర్లు కోట్లాది రూపాయల వ్యయంతో చేపడుతున్న పథకాల పనుల్లో కాంట్రాక్టర్లు ఎవరు? ఏ రాజకీయ నాయకుడికి ఏయే కాంట్రాక్టులు ఉన్నాయో తెలియని విషయాలు ఏమీ కావు. లాభసాటిగా ఉన్న గోదాముల కేటాయింపులనే తీసుకోండి ఎవరి పేరు మీద ఉన్నాయో జగమెరిగిన సత్యమే. ఢిల్లీ లిక్కర్ స్కామ్ భాగోతంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలే కాదు కేసులు కూడా నమోదయ్యాయి. కేసులు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. మరొకపక్క చీప్‌లిక్కర్ ప్రజారోగ్యాన్ని కబళిస్తున్నది. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమై కృంగికృశించి అసువులు బాస్తున్నారు. ఇక అన్నింటికంటే ముఖ్యంగా ఈ ప్రభావం విద్యారంగంపై పడడం కూడా ఆందోళనకరం. ఇది ఇప్పటికిప్పుడు మొదలైందని చెప్పడం లేదు.ఏనాడో మొదలై రాను రాను విస్తరిస్తుండడం ఆందోళనకరం. తమ వ్యాపారాల కోసం కొందరు నేతలు నైతిక విలువలకు తిలోదకాలిస్తూ రాత్రికిరాత్రే పార్టీలు మారుస్తున్నారు. నిబంధనలు గాలికి వదిలి కప్పదాట్లకు పాల్పడుతున్నారు. వారికి కావల్సింది వారి వ్యాపారాభివృద్ధి, ఆస్తుల పరిరక్షణే ధ్యేయం. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. పేర్లు రాసి వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకు కానీ పార్టీ అధికారం కోల్పోగానే క్షణం ఆలోచించకుండా అధికారంలో ఉన్న పార్టీలోకి దూకే పెద్దలెందరినో చూస్తున్నాం. ఇలాంటి ఫిరాయింపుదారులను, నియోరిచ్ కుబేరులను వ్యాపారులను పార్టీలు కూడా రెడ్‌కార్పెట్ పరిచి ఆహ్వానించి అందలమెక్కిస్తున్నాయి. ఆ పార్టీ ఈపార్టీ అని కాదు దాదాపు అన్ని పార్టీలదీ ఇదే పరిస్థితి. వారి కుటుంబ సభ్యులను కూడా తమ వారసులుగా రాజకీయ అరంగేట్రం చేయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆ పార్టీలోనే ఉండి ఏళ్లతరబడి పార్టీ జెండామోస్తున్న కార్యకర్తల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. కూడు, గుడ్డ అడక్కపోతే బిడ్డను సాకినట్లు సాకుతామని అన్నట్లుగా ఉంది కార్యకర్తల పట్ల కొన్ని రాజకీయ పార్టీల నేతలవైఖరి. శిక్షణా తరగతులు అంటారు. రాస్తారోకోలు అంటారు. ఛలో కార్యక్రమాలు అంటారు. సమావేశాలకు, సభలకు జనాన్ని తరలించుకురావాలంటారు. తీరా ఎన్నికల్లో లేక ఏదైనా పదవుల ఎంపిక సమయంలో ఈ ఫిరాయింపుదారులు నియోరిచ్ కుబేరులు ప్రత్యక్షమై తన్నుకుపోతున్నారు. పైకి ఏమన లేకపోయినా జీతభత్యం లేని సేవలు ఎన్నాళ్లనే వారిసంఖ్య పెరిగిపోతున్నది. అందుకే కొన్ని పార్టీల్లో దిగువస్థాయి కార్యకర్తలు, రెండూ, మూడు స్థాయి నాయకులు తగ్గిపోతున్నారు. అయితే ఏనాటికైనా తమ సేవలు గుర్తించకపోతారా? ఏదో ఒక పదవి రాకుండాపోతుందా? అనే ఆశతో కొందరు ఈ రాజకీయ యజ్ఞంలో పోరాటం చేస్తూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. దీనికితోడు ఇటీవల కాలంలో సినిమా గ్లామర్ కూడా తోడవుతున్నది. గతంలో లేదనికాదు, రాను రాను పెరిగిపోతుండడం కొందరు నాయకులుసైతం అయోమయంలో పడుతున్నారు. పొరుగునున్న తమిళనాడులో చూస్తున్నాం. తమిళ రాజకీయాలన్నీ సినిమా రంగం చుట్టే తిరుగుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కూడా విస్తరిస్తున్నాయి. కేంద్ర పెద్దలు కూడా వారిని ఎలా ఆకట్టుకోవాలనే ప్రయత్నంలో మునిగితేలుతున్నారు. తెలుగురాష్ట్రాలకు సంబంధించి తెలుగుదేశం పార్టీని స్థాపించి ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో తన సినీ గ్లామర్‌ను కలగలిపి ప్రజాభిమానం సంపాదించి అధికారాన్ని దక్కించుకున్నారు ఎన్టీరామారావు. అంతకుముందు కానీ, ఆతర్వాత కానీ ఎంతోమంది సినిమా రంగానికి సంబంధించిన వారు రాజకీయాల్లోకి వచ్చినా తమ పరిధిలో వ్యవహరించేవారు. తమ వారసుల భారంప్రజలపై మోపలేదు. ఒంగోలు పార్లమెంటు స్థానానికి సినీనటుడు కొంగర జగ్గయ్య 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. అయితే జగ్గయ్య సినీ గ్లామర్‌ను ఉపయోగించుకొని రాజకీయాల్లోకి రాలేదు. సాహిత్యాన్ని ఒక తపస్సుగా ఆరాధించి రవీంద్రనాథ్ ఠాగూర్ 'గీతాంజలి'ని ఆయన పద్య రూపంలో అనువదించారు.సాహితీ రంగంలో ఆయన ప్రావీణ్యతను, విజ్ఞానాన్ని గుర్తించిన ఆనాటి కాంగ్రెస్ నేత కొత్త రఘురామయ్య అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు పరిచయం చేయడంతో ఆయన జోక్యం చేసుకొని టిక్కెట్టు కేటాయించారు. జగ్గయ్య రాజకీయరంగ ప్రవేశం ఆనాడు ఎలాంటి హంగామా జరగలేదు. అలాగే పదవీకాలం అనంతరం నిశ్శబ్దంగా రాజకీయాల నుంచి నిష్క్రమించారు. తమ వారసులుగా తమ కుటుంబ సభ్యులను ఎవరినీ ఆ ప్రాంత ప్రజల నెత్తిపై పెట్టేందుకు ప్రయత్నించలేదు. తన ఎన్నికల ప్రచారం కోసం ఏ సినిమా యాక్టర్‌ను రమ్మని కోరలేదు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. అగ్రనటులు అటుంచి ప్రజల్లో కొద్దోగొప్పో పేరున్న చిన్నాచితక నటులను కూడా ప్రజలను ఆకర్షించడంలో ఎలా ఉపయోగించుకోవాలనే ఆరాటంలో రాజకీయ పార్టీలు పోటీపడుతుండడం దురదృష్టకరం. సినిమా యాక్టర్‌లు రాజకీయాల్లోకి రాకూడదని, రారాదని చెప్పడం లేదు. స్వతంత్ర భారతావనిలో భారత పౌరులు ఎవరైనా రాజకీయ రంగంలో ప్రవేశించవచ్చు. అందులోనూ కళామతల్లికి వారు చేస్తున్న సేవలను, ప్రజలకు వారు అందిస్తున్న వినోద విజ్ఞానాన్ని విస్మరించలేం. ఇందులో మరో అభిప్రాయానికి తావులేదు. తాము చేస్తున్న కళాసేవను ఆరాధించే తమ అనుచరుల అభిమానాన్ని ఓట్లుగా మలచి పలనా పార్టీకి ఓటువేయమని చెప్పడం ఎంతవరకు సమంజసమో వారే విజ్ఞతతో ఆలోచించాలి. రాజకీయరంగం రానురాను కలుషితమైపోతున్నది. ప్రజాసేవ, నీతి, నిజాయితీ, నిస్వార్థం, నిష్పక్షికత లాంటివి దూరంమైపోతున్నాయి. ప్రజల్లో చైతన్యం వస్తే తప్ప ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశాలు కన్పించడంలేదు. •

## ఒక్క మాట

# పెరుగుతున్న ధరలను నియంత్రించలేరా?

బుగ్గన మధుసూదనరెడ్డి,

అసలే ఈ మధ్యకాలంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటడంతో తీవ్ర ఇక్కట్ల పాలు అవుతున్న పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాలపై గ్యాస్ సిలిండర్ ధర మోత, వడ్డన రూపంలో మరో గుది బండను మోపారు కేంద్ర ప్రభుత్వం వారు. గ్యాస్ సిలిండర్ ధరను తప్పనిసరి పరిస్థితుల్లో ఏ 5 రూపాయలో, 10 రూపాయలో పెంచితే పర్వాలేదు. కానీ ఏకంగా 50 రూపాయలు పెంచడంతో 860 రూపాయలు వున్న గ్యాస్‌సిలిండర్ ధర 910 రూపాయలు చేరుకోవడమే కాదు డోర్ డెలివరీతో 960 రూపాయలకు చేరుకోవడంతో ఒక్కసారిగా పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజల గుండెల్లో గుణపాలు దిగినట్లయింది. దీంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది గ్యాస్ కనెక్షన్ వున్న వారి తలపై పెనుభారం పడనుంది. ఇదివరకు సైతం కేంద్రప్రభుత్వం వారు ఇలాగే గ్యాస్ సిలిండర్ ధరను పెంచి పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల జీవితాలతో ఆటలాడుకున్న వైనం మనందరికీ తెలిసిన విషయమే. అయితే ఏ మాత్రం జాలి, దయ, కరుణ చూపించకుండా మరో మారు 50 రూపాయల మేర కేంద్రప్రభుత్వం వారు గ్యాస్ సిలిండర్ ధరను పెంచి పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల వారిని కొంత మేర దెబ్బతీశారు అనే మాట సత్యదూరం కాదు. దీనికి తోడు కేంద్రప్రభుత్వం వారు సిలిండర్ పై కేవలం రూ.44.62 మాత్రమే సబ్సిడీ ఇస్తుండటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఎందుకంటే కూలి పనులకు వెళ్లే కుటుంబాలు సైతం గ్యాస్‌ను వినియోగిస్తూ వంటలు తయారు చేసుకుంటున్న నేపథ్యంలో ఈ గ్యాస్ సిలిండర్ ధర బాదుడుతో వారిపై మరింతగా పెనుభారం



పడనుంది అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. ఏదిఏమైనా కేంద్రప్రభుత్వం వారు కంకణం కట్టుకొని మరీ ఇలా గ్యాస్ సిలిండర్ ధరను దశల వారీగా పెంచుకుంటూ పోతే అల్ప ఆదాయం మాత్రమే గల పేద,సామాన్య, మధ్యతరగతి వర్గాలు ఒక్కసారిగా కూదేలు అయ్యే ప్రమాదం పొంచి వుంది. అసలే నిత్యావసర వస్తువుల ధరలు అడ్డు, అదుపు లేకుండా పెరగడం మూలాన పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల వారు అయితే మూడు పూటలా తిండి తినాలంటేనే బెంబేలు పడిపోయే దయనీయ స్థితి ఉత్పన్నమవుతున్నది అనే మాట సత్య దూరం కాదు. ఏమైనా ఇప్పటికయినా కేంద్రప్రభుత్వం వారు నిద్రాణావస్థ నుండి మేల్కొని మానవతా దృక్పథంతో ఆలోచించి పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరను తక్షణమే యుద్ధప్రాతిపదికన తగ్గించి పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల వారికి కాస్తంతా వెసులుబాటు కల్పించాల్సిన గురుతర బాధ్యత ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వం వారిదే. ఎందుకంటే గరీబ్ హటావో దేశ్ బచావో అనే నీతి సూత్రానికి కేంద్రప్రభుత్వం వారు కట్టుబడి,ఒక మెట్టు క్రిందకు దిగి వచ్చి పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించకపోతే మాత్రం పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులను అత్యంత బలవంతంగా, అజమాయిషీతో నామ రూపాల్లేకుండా చేసిన ఘనతను కేంద్రప్రభుత్వం వారు తమ సొంతంచేసుకోవడం తథ్యం.పెంచినగ్యాస్ సిలిండర్ ధరను తక్షణమే కేంద్రప్రభుత్వం వారు తగ్గించి పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలనుఆదుకోవాలి. లేకపోతే వారి విలువైన జీవితాలు అధోగతి పాలే. ఒక వైపుఏమో నిత్యావసర వస్తువుల ధరలు అదుపు తప్పడం మరోవైపు గ్యాస్ సిలిండర్ ధర తన విశ్వరూపం చూపడం వెరసివారి ఎంతో అమూల్యమైన జీవితాలు ఇక నరకప్రాయమే అనడంలో ఎలాంటి సందేహానికి తావులేదు. •

# ప్రజావాక్కు



### సమాఖ్య స్ఫూర్తికి పట్టం కట్టిన సుప్రీంతీర్పు

**తమిళనాడు** గవర్నర్ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాల్ని చట్టవ్యతిరేకమంటూ సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మకం.ఆయన తొక్కిపెట్టిన పదిబిల్లులను ఆమోదించినట్టుగానే భావిస్తూ తీర్పునివ్వడం సరైనచర్య. ముందు ముందు అలా తొక్కిపెట్టే అవకాశాల్ని తగ్గిస్తూ గవర్నర్ విధులకు అవసరమైన పరిమితుల్ని విధించడం కూడామంచిదే.గవర్నర్ స్థానానికి పెద్దరికం కట్టబెడుతూ,రాజ్యాంగం అస్పష్టంగా వదిలివేసిన లక్ష్మణ రేఖల్ని నేడు న్యాయస్థానం దిద్ది బాగా కనబడేట్టు చేయాల్సిరావడం రాజకీయాల పుణ్యమే.మన దేశం పార్లమెంటరీ ప్రజాస్వామ్యవ్యవస్థ.ప్రజలెన్నుకున్న ప్రతినిధుల ద్వారా సాగే ప్రజాపాలన. వారి అభీష్టం మేరకు, వారు చేసే చట్టాలు అమల్లోకిరావాలి.ఇక్కడ రాష్ట్రపతి, గవర్నర్లది కేవలం నామమాత్రపుపాత్ర. అయితే దానికి రాజకీయవాసనల్నిఅంటగట్టేప్రయత్నాలతోనేచిక్కులొస్తున్నాయి.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### మామిడి రైతులను ఆదుకోవాలి

**తెలంగాణ** రాష్ట్ర ప్రభుత్వం ఆకాలంలో పడుతున్న వర్షాలు, గాలి వానకు మామిడి కాయలు రాలుతున్నాయి. దీంతో మామిడి రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పండించిన మామిడి కాయలు నేలపాలు కావడంతో పెట్టిన పెట్టుబడులు రాకా అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని మామిడి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### అనాథ విద్యార్థులు

**తెలంగాణ** రాష్ట్రంలో వివిధ కారణాల చేత తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ విద్యార్థుల విద్యాభివృద్ధికిగాను ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లో ఉచిత వసతి కల్పించాలి. ఫీజులను ప్రభుత్వం మినహాయించాలి. మరికొన్ని అనాథ సంక్షేమ హాస్టళ్లనుప్రారంభించాలి.18సంవత్సరాలు లోపు ఉన్న విద్యార్థులకు ప్రత్యేకమైన అనాథ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి.తల్లిగాని తండ్రిగాని ఇద్దరిలో ఒకరు సంరక్షకులుగా ఉన్నవారిని కూడా గుర్తించి వచ్చే విద్యా సంవత్సరం ప్రత్యేక బోధన వసతి ఏర్పాటు చేయాలి. విద్యతోపాటుగా బట్టలు పుస్తకాలు నోట్స్ సరఫరా చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### కేంద్రం చర్యలు తీసుకోవాలి

**తమిళనాడు** ప్రభుత్వం ఆమోదించిన పది ముఖ్యమైన బిల్లులను ఆరాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి గారు తన దగ్గర కొంత కాలం ఉంచుకొని వాటిని సుప్రీం కోర్టుకు పంపడం బహుశ మన ప్రజాస్వామ్య చరిత్రలో ఇదే మొదటిసారికావచ్చు. ఒక పక్క ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం.మరోపక్క రాజ్యాంగ విధులను కాపాడే గవర్నరు ఇలాఏవో కారణాలతో పరస్పర విరుద్ధంగా ప్రవర్తించడం వలన పరిపాలన కుంటుబడడం, ప్రజలు ఇబ్బంది పడడం జరుగుతుంది. గతంలో కూడా ఈ గవర్నరు ఉభయ సభలను ఉద్దేశించి ప్రభుత్వం రాసిన పత్రాలను వక్రీకరించి చదవడం, సభ నుండి వాకౌట్ చేయడం కూడా జరిగింది.రాష్ట్రప్రభుత్వం రెండవసారి పరిశీలించి పంపిన బిల్లులమీద గవర్నరం ఆమోదముద్ర వేయాలని రాజ్యాంగం చెబుతోంది. సుప్రీంకోర్టు తీర్పుగవర్నరు పదవికిచెంప పెట్టులాంటిది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేయకూడదు. రాజ్యాంగ పరిరక్షణే గవర్నర్ల విధి అని పదేపదే చెప్పనక్కరలేదు.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### వయోపరిమితి పెంచాలి

**ఏడు** సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క డిఎస్సి నోటిఫికేషన్ కూడా విడుదల చేయకపోవడంతో ఎంతో మంది అభ్యర్థులు నిర్ణీత వయసుమీరి డిఎస్సి రాసేందుకు దూరమవుతున్నారు. కొత్త ప్రభుత్వం ప్రకటించనున్న డిఎస్సిలో అభ్యర్థులందరికీ న్యాయం జరిగేలా జనరల్ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిని యాభై యేళ్లకు, మిగతా వెనుకబడిన కులాల వారికి యాభై ఐదేళ్ల వరకు పొడిగించాలి. వయో పరిమితి పెంచితే నిరుద్యోగ సమస్యనుకూడా కొంతవరకు తగ్గించవచ్చు.రాష్ట్రంలో నిరుద్యోగులసంఖ్య పెరుగుతున్నది. నిరు ద్యోగ సమస్యకు అడ్డుకట్ట వేయాలంటే కొంత వరకు వయోపరిమితిని సడలించాలి. వయో పరిమితి సడలింపు విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

-టి. రమణారావు, అక్కరాపల్లి

### యువ నేతకు అవకాశం ఇవ్వాలి

నిత్యం పని వత్తిడిలో ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివిద్యా శాఖా మంత్రిగా ఉండడం సమంజసం కాదు. విద్యా శాఖ మీదే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంది. విద్యా శాఖను ఉన్నత విద్యావంతుడైన యువనేతకు అప్పగించాలి.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గ్రూప్1 పోరాటం రావణ కాష్టం

సంపతి రమేష్

రాష్ట్రంలో ఉన్నతమైన పరిపాలన ఉద్యోగంగా గ్రూప్ 1ను భావిస్తారు. మెజార్టీ నిరుద్యోగులు ఆ సర్వీస్ సాధించాలని కృషి చేస్తుంటారు. ఈ క్రమంలో మూడేళ్ల కింద వేసిన గ్రూప్ 1 నోటిఫికేషన్ అనేక అవాంతరాలను ఎదుర్కొంటూ గత ఏడాది మెయిన్స్ పరీక్ష నిర్వహించడం జరిగింది. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ సెలక్షన్‌లో సామాజిక న్యాయానికి విరుద్ధంగా జీవో 29ను తీసుకురావడం జరిగింది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం జరిగింది. కోర్టులో కేసులు కూడా వేయడం జరిగింది. అయినప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరితో ముందుకెళ్లి మెయిన్స్ పరీక్ష నిర్వహించింది. ఇప్పుడు మెయిన్స్ పరీక్ష అనంతరం తుది ఫలితాలు విడుదల చేసింది. ఇక్కడ కూడా గందరగోళ పరిస్థితులను నెలకొన్నాయి. పరీక్ష ఫలితాల్లో దాదాపు 80 నుంచి 90 శాతం వరకు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అధిక మార్కులు రావడం జరిగింది. వారికే సర్వీస్ వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. తెలుగు మీడియం విద్యార్థులలో కేవలం 10 నుంచి 20 శాతం వరకే సర్వీస్ వచ్చే విధంగా మార్కులు వచ్చాయి. అంటే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో భారీ లోటుపాట్లు జరిగాయని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మరోవైపు హైకోర్టులో కేసులు కూడావేశారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీస్తుంది. అంతేకాకుండా భారీ స్కాం కూడా జరిగిందని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మరి దీనంతటినిచూస్తే అసలు గ్రూప్ 1 నియామకంలో పారదర్శకత ఏ మేరకుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పుడు గ్రూప్ 1మెయిన్స్ రాసిన వేలాది మంది విద్యార్థులు నైరాశ్యంలోకి వెళ్లారు. దీని ప్రభావం తెలుగు మీడియం విద్యార్థులపై చాలాఉంది. ప్రతిష్టాత్మకంగా భావించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలో విద్యార్థులకు పెద్ద ఎదురు దెబ్బతగిలింది. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ సెలక్షన్లో జీవో 29 తీసుకురావడమే దీనికి కారణం. ముఖ్యంగా జీవో 29తీసుకువచ్చి సామాజిక రిజర్వేషన్లకు తూట్లు పొడిచారు. దీని ద్వారా ముఖ్యంగా ఎస్సీ ఎస్టీలకు అన్యాయం జరిగింది. వీరికి అదనంగా ఎలాంటి లాభం జరగలేదు. జీవో 29 ప్రభావం చివరకు మెయిన్స్ నుంచి తుది ఫలితాలపై కూడా పడింది. ఇక్కడ సామాజిక వర్గాల వారీగా సెలక్షన్స్ తగ్గిపోయాయి.ఓపెన్ అభ్యర్థులకు ఎక్కువ అవకాశాలు ఏర్పడ్డాయి. టాప్ 100లో ఎస్సీ ఎస్టీ సెలక్షన్స్ వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. బీసీలలో కూడా అంతగా లేరు. నాన్‌లోకల్ వారికి అవకాశాలు పెరిగాయి. ఇంత ప్రభావాన్ని చూపిన జీవో 29పై అటు ప్రభుత్వం, ఇటు కోర్టులలో చర్చకురాకపోవడం విస్మయంకలిగిస్తుంది. చట్టాలు, శాసనాల రాజ్యాంగ బద్ధతను ప్రశ్నించే కోర్టులు జీవో



29పై చర్చించకపోవడం అభ్యర్థుల్లో కోర్టులపై నమ్మకం సన్నగిల్లుతుంది. ఇప్పటికే జీవో 29రద్దు చేయాలని ఢిల్లీలో గత కొన్నిరోజులుగా విద్యార్థులు ధర్నా చేస్తున్నారు. కావున ఎన్నో రోజులుగా పోరాటం చేస్తున్న జీవో 29ను రద్దుచేసి పాత జీవో అయిన జీవో55 ప్రకారం మెయిన్ సెలక్షన్ లిస్ట్ తీయాలని డిమాండ్ చేస్తున్నారు.అప్పుడే సామాజికన్యాయం చేకూరుతుంది. తెలంగాణప్రాంతంలో తెలుగు అధికారికభాషగా ఉంది. దాదాపు 40శాతంమంది విద్యార్థులు గ్రూప్1 మెయిన్స్ పరీక్షలు తెలుగులో రాశారు. కానీ చివరికి ఫైనల్ సెలక్షన్ వచ్చేసరికి కేవలం 10నుంచి 20శాతం మాత్రమే తెలుగు మీడియం విద్యార్థులు ఎంపికయ్యే అవకాశం ఉండడం ఆందోళన కలిగిస్తుంది. మెజార్టీ ఇంగ్లీష్‌మీడియం విద్యార్థులు ఎంపిక కావడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ముఖ్యంగా ఇక్కడ మూల్యాంకనం సరిగ్గాజరిగిందా? జరగలేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కేవలం మూడు నెలల సమయంలోనే 21వేలమంది విద్యార్థుల పేపర్లు ఎలా దిద్దారు అనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది.మరోవైపు కొందరు పక్కపక్కన ఉన్న విద్యార్థులకు ఒకేరకమైన మార్కులు రావడం, కొన్ని ఎగ్జామ్స్ సెంటర్లోనే అత్యధిక మార్కులు రావడం వంటి సంఘటన పలు అనుమానాలకు దారితీయడం జరుగుతుంది. వాస్తవ ఫలితాలను చూస్తే అదే కనబడుతుంది. నామమాత్రం రాసిన సగటు ఇంగ్లీష్ మీడియం అభ్యర్థికి వచ్చిన మార్కుల కన్నా ఎంతో విశ్లేషణాత్మకంగా రాసిన తెలుగుమీడియం అభ్యర్థులకు రాకపోవడం విస్మయం కలిగిస్తుంది. అంతేకాకుండా ఉర్దూమీడియంలో రాసిన 13మంది విద్యార్థుల్లో దాదాపు 6 నుంచి 7గురు విద్యార్థులకు సర్వీస్ వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. అసలు కొన్ని సబ్జెక్టులలో తెలుగు మీడియంలో మెటీరియల్ లభించడమేగగనంగా మారింది. ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీ, గవర్నెన్స్, పర్యావరణంలో సరైన మెటీరియల్ తెలుగులో ఇప్పటికి లేదు. అలాంటిది ఉర్దూమీడియం వాళ్లకు ఎలాలభించింది? యూపిఎస్‌సి సివిల్ సర్వీస్ మెయిన్స్‌లో 50శాతం మార్కులు దాటడమే కష్టం. అలాంటిది టీజీపీఎస్సీ మూల్యాంకనంలో 60శాతం మార్కులు దాటడం లోపభూయిష్టమైన మూల్యాంకనానికి నిదర్శనం. మెయిన్స్ పరీక్ష అనేది అభ్యర్థుల జీవితాలను తీర్చిదిద్దే. అలాంటిది ఇష్టారీతిన జరిగిన మూల్యాంకనం వల్ల మెజార్టీ అభ్యర్థులు నష్టపోయారు. ముఖ్యంగా తెలుగు మీడియం వాళ్లకు తీవ్రనష్టం జరిగింది. భవిష్యత్తులో తెలుగులో గ్రూప్1 రాయాలంటే భయపడుతున్నారు. కావున ప్రస్తుతం విద్యార్థులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనాఉంది. ఎందుకంటే ఒక 12 సంవత్సరాల తర్వాత గ్రూప్ 1 నోటిఫికేషన్ పడింది. మంచి పోస్టులతో వేసిన ఈ నోటిఫికేషన్‌లో ఉదారమైన మార్కులతో నాణ్యత లేని విద్యార్థులకు సర్వీసు అప్పచెపితే తీవ్ర నష్టం జరుగుతుంది. గ్రూప్ 1వంటి పరీక్షకు విలువ తగ్గిపోతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి నిరుద్యోగుల పక్షాన నిలబడాలి. మంచి ప్రమాణాలతో మూల్యాంకన వ్యవస్థలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. •

## క్విస్ విద్యార్థుల రక్తదానం



**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్, ఎన్సిసి విభాగాల ఆధ్వర్యంలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులతో పాటు ఫ్యాకల్టీ స్వచ్ఛందంగా రక్తదానం చేయగా కళాశాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి అభినందించి సర్టిఫికేట్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు, హెచ్ఓడి డాక్టర్ శ్రీనివాసరావు, రిమ్స్ వైద్యాధికారి డాక్టర్ మానసేష్ పాల్గొన్నారు.

**ముగిసిన డ్రోన్ వర్క్‌షాప్..**



క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఐటి, రూర్కెలా సౌజన్యంతో డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై ఐదు రోజుల వర్క్‌షాప్ నేటితో ముగిసింది. దాదాపు 120 మంది విద్యార్థులు పాల్గొని వారు నేర్చుకున్న అంశాలను టెక్నికల్ పేపర్ల రూపంలో ప్రదర్శించారు. ఎన్ఐటి ప్రొఫెసర్ డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ కొనియాడతగినదని, సమ్మర్ ఇంటర్న్‌షిప్ అవకాశాలను తెలియజేస్తామన్నారు. అనంతరం డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ భార్గవ్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికేట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు, హెచ్ఓడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మా సమస్యలు పరిష్కరించండి

### - వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి ఆర్ఎంపిల వినతి



**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్ఎంపి యూనియన్ నాయకులు పలువురు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం జిల్లాలో పలు కార్యక్రమాల్లో భాగంగా ఒంగోలు వచ్చిన మంత్రి సత్యకుమార్‌ను కలిసిన వారు తమ ముఖ్య సమస్యల్లైన గత 50-60 సంవత్సరాలుగా తమకు గుర్తింపు కోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నామని, కానీ ఎవరు ఇంతవరకు ఇవ్వలేదని వాపోయారు. మంత్రి ద్వారా ఈ గుర్తింపు ఇప్పించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా యూనియన్ అధ్యక్షులు బట్టు బాలాజీ, గౌరవ్యక్షులు గుంటూరు భాస్కర్‌రావు, జాయింట్ సెక్రటరీ శిబు కృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శి నాగరాజు, డివిజన్ కార్యదర్శి అద్దంకి లెనిన్, బి. అనిల్, జానా శ్రీనివాస్ తదితరులున్నారు.

## వైసీపీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే జయంతి వేడుక



**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలులోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా వైసీపీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, బొట్ల రామారావు, మాజీ ఎమ్మెల్యే కే.ఆదెన్న, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, బత్తుల బ్రహ్మానందరెడ్డి, పట్టణ అధ్యక్షులు కటారి శంకర్‌లు పాల్గొన్నారు.

## పేస్‌లో "నెక్స్ట్‌జెన్ ఫ్రంట్ ఎండ్ రియాక్ట్ జెస్ విత్ విటే ఫర్ అప్లికేషన్ డెవలప్మెంట్" పై ఆన్లైన్‌లో అతిథి ఉపన్యాసం







**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలులోని స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్ఐటీ చదువుతున్న విద్యార్థులకు "నెక్స్ట్ జెన్ ఫ్రంట్ ఎండ్ రియాక్ట్ జెస్ విత్ విటే ఫర్ అప్లికేషన్ డెవలప్మెంట్" పై ఆన్లైన్‌లో అతిథి ఉపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కె ఎల్ యూనివర్సిటీ విజయవాడ కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. ఎమ్. బాలాజీ హాజరయ్యారు. ఆయన తన ప్రసంగంలో మాట్లాడుతూ విద్యార్థులకు ఎఐ ఎక్కువగా వాడుతున్న ఈ పరిస్థితులలో జావాను ముందు నుండి వాడుతున్న విద్యార్థులు ఎలాంటి టూల్స్ వాడడం ద్వారా మరింత మెరుగ్గా త్వరితగతిన కొత్త అప్లికేషన్లు ఎలా తయారుచేయాలో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండ్ డాక్టర్ ఎం. శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎల్లప్పుడూ ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉండే జావా లాంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌ని ఇప్పుడున్న కొత్తరకం టూల్స్‌తో కలిపి నేర్చుకోవడం ద్వారా అందరికంటే మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఎలా పొందగలరో తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.కె. మూర్తి, డీన్ అకడమిక్స్ డాక్టర్ సివి సుబ్బారావు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు, సిఎస్ఐటి హెచ్ఓడి ఏన్ శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ వై అనూష, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్యోతిరావుపూలేకి ఘన నివాళి



**టంగుటూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన టంగుటూరులోని బస్టాండ్ సెంటర్‌లో కూడలి మధ్య ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి బీసీ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగశ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జ్యోతిరావుపూలే చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి యుఎమ్‌హెచ్ఇయు వినతి



**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలువురు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అన్ని విభాగాల ఉద్యోగులకు సాధారణ బదిలీలు చేపట్టాలని, స్టేషన్ సీనియారిటీ జీరో ఉన్న వారికి రిక్వెస్ట్ బదిలీ అవకాశం కల్పించాలని, ఫీల్డ్ స్టాఫ్‌కు ఎఫ్ఆర్ఎస్ హాజరు నుండి మినహాయింపు ఇవ్వాలని, గ్రామ, వార్డుహెల్త్ సెక్రటరీస్‌ను వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి తేవాలని, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ అదనపు పోస్టులు మంజూరు చేయాలని, జివో నెం.32 రద్దు, జివో నెం.115 అమలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్రగౌరవ అధ్య క్షులు ఎవి నాగేశ్వర రావు, రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్‌రావు, జిల్లా అధ్యక్ష, కార ్యదర్శులు సురేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

### - రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్





**ఒంగోలు, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన వైద్య విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 6.06 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన గుండె సంబంధిత పరీక్షా కేంద్రంను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఏపీ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, జనసేన ప్రతినిధి రియాజ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం జీజీహెచ్‌లో అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చేపడుతున్న పనుల పురోగతిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, జీజీహెచ్ అధికారులతో సమీక్షించి పలు సూచనలు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన వైద్య విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవల ద్వారా పేద ప్రజలకు రూ.25 లక్షల రూపాయల వరకు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయడం జరుగుతుంది. ప్రేవెంటివ్ మెడిసన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 100 బెడ్స్‌తో అన్ని మౌలిక సదుపాయాలతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. టీచింగ్ హాస్పిటల్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయలేని కొన్ని శస్త్ర చికిత్సలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేస్తున్నట్లు మంత్రి అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల కంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందని , ప్రజల్లో భావన కలిగేలా వైద్యులు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులతో ఉన్నప్పటికిని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తే మెరుగైన వైద్యం అందింది అనే భావన ప్రజల్లో ఏర్పడేలా వైద్యులు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల పట్ల ప్రజల్లో భరోసా కల్పించి వారి మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని, అందుకు అనుగుణంగా వైద్యులు పని చేయాలన్నారు. రిమ్స్ అభివృద్ధికి ఒంగోలు ఎమ్మెల్యేగా తన వంతు కృషి చేస్తానన్నారు. మంచి వాతావరణంలో వైద్య సేవలు అందేలా పారిశుధ్య ఏర్పాట్లుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి తిలకించారు. అనంతరం మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ రిమ్స్ ఆవరణంలో వైద్య విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జమున, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, జీజీహెచ్ వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారీ జనసందోహం మధ్య జనసేన ప్రభతడిక ఊరేగింపు



**చీమకుర్తి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
రామతీర్థంలో జరగబోతున్న గంగమ్మ తిరుణాలకు జనసేన ప్రభ తడిక శుక్రవారం తరలి వెళ్ళింది. వేలాదిగా జనసేన నాయకులు, కార్యకర్తలు యువకులు తరలి వచ్చారు. గాంధీనగర్ శివార్ల వద్ద జనసేన ప్రభ తడికకు జిల్లా నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై టెంకాయ కొట్టారు. భారీ యంత్రాల సాయంతో దానిని లారీపై ఎక్కించి ఊరేగింపు ప్రారంభించారు. సంతనూతలపాడు



ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్, జనసేన జిల్లా నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు, జేష్యా శ్రీని వాసరావు, నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరి బాబులు రథం, ఓపెన్ టాప్ వాహనాలపై ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. చీమకుర్తి మండల పార్టీ అధ్యక్షులు వల్లపు శివప్రసాద్ టౌన్ పార్టీ అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ పలువురు నాయకులు, జనసైనికుల నాయకత్వంలో ఊరేగింపు పెద్ద ఎత్తున కొనసాగింది. గుర్రాలపై నాయకులకి అభిమానం చేశారు. బాణసంచా కాలుస్తూ డీజే మోతలతో మాబ్ డాన్సులతో చీమకుర్తి మెయిన్ రోడ్డు దద్దరిల్లింది. యువకులు మోటరు బైక్ ర్యాలీ నిర్వహించారు. రామతీర్థం నిధిలో ప్రభ తడికను రథంపై నిలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా హాజరై వీరికి మద్దతు తెలిపారు.

## గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కలెక్టర్ ఘన స్వాగతం





**చీరాల, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
చీరాల మండలం వాడరేవు సముద్రతీరం వద్ద ఉన్న స్థానిక ఐటీసీ గెస్ట్ హౌస్‌కు శుక్రవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేరుకున్నారు. ఆయన రాక సందర్భంగా జిల్లా కలెక్టర్ జే.వెంకట మురళి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు తుషార్ డ్యూడి, చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో వారు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పలుశాఖల అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.







# హరిహర క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవ వేడుకలు

### - వేద పండితుల మంగళ శాసనాలలో అంకురార్పణ - ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు







**చీమకుర్తి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
చీమకుర్తిలోని హరిహర క్షేత్రం ప్రతిష్ఠించి 18 సంవత్సరాలు పూర్తి చేసుకొని, 19వ వార్షికోత్సవంలోకి అడుగుపెట్టిన వేడుకలు ఎంతోభక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆగమ విశారదకృష్ణశర్మ బృందం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం వార్షికోత్సవ తొలి రోజు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల నిర్వహణలో గోపూజ,బ్రాహ్మణ అను జ్ఞ జ్యోతి ప్రజ్వలన, మహా గణపతి పూజ, క్షేత్ర ప్రతిష్టిత దేవతా మూర్తులకు పంచ వింశతి కలశ స్నపన అనంతరము తత్త దేవతా మూల మంత్ర హవన పూర్వకముగా ప్రాయశ్చిత్త హోమములు నిర్వహించారు. మహా గణపతి, విష్వక్సేన ఆరాధనలు, పుణ్యాహవాచన, పంచగవ్యప్రాసన మార్జనలు, రక్ష సూత్రధారణ, ఆచార్య రుత్విజవరణలు, విహిత మంటపార్చన, మృత్సంగ్రహణము, అంకురారోహణ, ప్రధాన దేవతా వాహనాదులు, సర్వతో భద్ర మండప ఆవాహన, ప్రధాన కలశ స్థాపన చేపట్టారు. తొలుత ఆలయ అర్చకులు, వేద పండితులు శిద్దా రాఘవరావు దంపతులకు మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం శిద్దా రాఘవ రావు దంపతులు, సిద్ధ సుధీర్ కుమార్ లక్ష్మీ శృతి కుటుంబ సభ్యులతో కలసి క్షేత్రంలో కొలువై ఉన్న సర్వ దేవతా మూల విరాట్టులకు విశేష పూజలు నిర్వహించారు. 19 వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ హరిహర క్షేత్రం సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా మూల విరాట్టులకు విశేష పూల అలంకారాలు,విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో శోభాయమానంగా తీర్చి దిద్దారు. ఆధ్యాత్మిక వాతావరణ శోభతో శ్రీ హరిహర క్షేత్రం నెలకొంది వైభవంగా శ్రీ హరిహర సుత అయ్యప్పస్వామి వారి అష్టాదశ సోపాన పడిపూజ కార్యక్రమం. హరిహర క్షేత్రం 19వ వార్షికోత్సవం సందర్భంగా మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగారావు దంపతులు, సిద్ధ సుధాకర్ దంపతులు, సిద్ధ సురేష్ దంపతులు, సిద్ధ బాలాజీ దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రముఖ వేద పండితులు ఆగమ విశార ద కృష్ణ శర్మ నిర్వహణలో అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ హరిహర క్షేత్రం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో వార్షికోత్సవానికి విచ్చేసిన భక్తులకు, ఉచిత బస్, అన్నదాన సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.




## నేడు గార్లపాడు బాల గంగమ్మ తల్లి తిరునాళ్ల



**మద్దిపాడు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రధాన ముంపు గ్రామమైన పాత గార్లపాడు నందు శనివారం బాలగంగమ్మ తల్లి తిరుణాల నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులు అందరూ ఐక్యత రాగంతో తిరుణాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులుఏర్పాట్లు చేస్తున్నారు. పూర్వకాలం నుండి ఆనవాయితీగా వస్తున్న తిరునాళ్లను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో పాత గార్లపాడు నందు మల్లెతోటలు ఎక్కువగా ఉండేవి. ఈ క్రమంలో పౌర్ణమి వెన్నెలలో మల్లెల వాసనతో తిరుణాల పరిసరాలు ఉండేవి. ఈ తిరుణాలకు మల్లెపూల తిరుణాలంటే గార్లపాడు బాల గంగమ్మ తల్లి తిరుణాలని ప్రతి ఒక్కరికి గుర్తు వస్తుంది. ఈ తిరుణాల నందు వైఎస్సార్‌సీపీ తరుపున రావూరి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభను ఏర్పాటు చేయనున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి.

## రోటరీ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు



**అద్దంకి ,ఏఫ్రిల్ 11, ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావుపూలే 198వ జయంతి సందర్భంగా స్థానిక రోటరీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవపాలన మాట్లాడుతూ ఆనాటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, అన్నంగి సుబ్బారావు, అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## యోగిరెడ్డికి మంత్రి గొట్టిపాటి నివాళి



**అద్దంకి ,ఏఫ్రిల్ 11, ప్రభాతవార్త**
మండలంలోని కొత్తరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ సంగు యోగిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా, శుక్రవారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆయన దశదిన కార్యక్రమానికి హాజరై యోగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు



**అద్దంకి ,ఏఫ్రిల్ 11, ప్రభాతవార్త**
ఎపి,ఎస్.సి.ఎస్.టి.బి.సి.మైనారిటీస్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బంగ్లారోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐక్యవేదికఅధ్యక్షులుజ్యోతిరమేష్‌బాబు మాట్లాడుతూ పూలే సమాజంలోని అంటరానితనం , కుల వివక్ష, వితంతు వివాహాలు, సతీసహగమనం, లింగవివక్ష, లాంటి అనేక సమాజ రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడి, తన భార్య అయిన సావిత్రిబాయి పూలేకు విద్యను ఆమె ద్వారా అనేకమంది స్త్రీలకు విద్యను అందించి, ఒక అనాధ బ్రహ్మణ బిడ్డను దత్తత తీసుకొని డాక్టర్ చేసిన మహోన్నత వ్యక్తి, అంటరాని వారికోసం తన ఇంటిలోనే బావిని త్రవ్వించి నీటిని అందించిన గొప్ప వ్యక్తి జ్యోతి రావుపూలే. ఆయన ఎంతో మందికి ఆదర్శప్రాయులు ఆయనబాటలో ప్రతి ఒక్కరు నడవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమలో అద్దంకి అభివృద్ధి కమిటీ సభ్యులు మన్నం త్రిమూర్తులు, డాక్టర్ యు. దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రిటైర్డు బ్యాంకు మేనేజర్ తాళ్ళూరి బాబురావు, ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పసుమర్తి చిన్నకోటయ్య, పాదయాత్ర రోశయ్య, నక్క కాంతారావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, మందా జోసఫ్, కొమ్మాలపాటి బుజ్జి, బందారు చంటిబాబు, మంచు హనుమంతరావు, జ్యోతి డెవిడ్, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపి కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**అద్దంకి ,ఏఫ్రిల్ 11, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలోని 16వ వార్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ జ్యోతిరావుపూలే బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదలపెన్నిధని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అద్దంకి పట్టణ బీసి సెల్ అధ్యక్షులు యర్రాకుల రామాంజనేయులు, బచ్చల వాసు, పునూరి నరేంద్ర, కాస పుల్లయ్య, బొజలు నాగరాజు, విశ్వరూపచారి, ఎస్.కె. అబ్దుల్లా, గుండెమెడ వెంకటసుబ్బారావు, ఎస్.కె.రసూల్, ఎస్.కెమాబు మేస్త్రి, మిద్దెబోయిన పాపారావు, అద్దంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిటి ప్రత్తి విత్తనాలపై విత్తనాల షాపుల తనిఖీ



**అద్దంకి ,ఏఫ్రిల్ 11, ప్రభాతవార్త**
మండలంలోని నాలుగు విత్తనాల షాపుల్లో రాష్ట్ర స్థాయి తనిఖీ బృందం సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బాలభాస్కర్, వ్యవసాయాధికారి జి.మోహన్ తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం నాలుగు షాపుల్లో బిటి ప్రత్తి రకాలలో ప్రభుత్వం నిషేధించబడిన హెర్బిసైడ్ ట్రేట్‌కి సంబంధించిన ప్రత్తి విత్తనాల తనిఖీ చేయగా స్టాక్ లేకపోవడంతో మార్కెట్లో కూడ షాపులు తనిఖీ చేసి నాలుగు శాంపిల్స్ తనిఖీ చేయగా నెగిటివ్ వచ్చింది రైతులు విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు మార్టూరు డి.బాలాజీ నాయక్, మాట్లాడుతూ రైతులకు అమ్మకాల సమయంలో రసీదులు ఇవ్వాలని రిజిస్టర్లను ఎప్పటికప్పుడు రాయాలని, స్టాక్ వివరాలు మరియు ధరల వివరాలు కూడా అందుబాటులో వుంచాలని డీలర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అద్దంకిమండల వ్యవసాయాధికారి కొర్రపాటివెంకటకృష్ణ, పాల్గొన్నారు.

## పశువైద్యశాలలను ఆకస్మిక తనిఖీ

**- పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబిరాణి**



**పొన్నలూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
శుక్రవారం నాడు మండలంలోని పొన్నలూరు, చౌటపాలెం పశువైద్యశాలలను పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారిణి డాక్టర్ కె.బేబిరాణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం చౌటపాలెం పశుపోషక రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పశువుల మేత విత్తనాలను పంపిణీ చేశారు. వేసవి కాలంలో పశువులను ఉదయం, సాయంత్రం సమయాల్లో మేతకు తీసుకెళ్లడం తాగునీరు అందుబాటులో ఉంచడం, ఎక్కువగా పచ్చి మేత వేయడం, పశువులకు ఖనిజ లవణాల మిశ్రమాన్ని అందించడం వంటి పశుయాజమాన్య పద్ధతులపై రైతులకు డాక్టర్ బేబిరాణి అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే పశుబీమా పథకాన్ని వినియోగించు కోవాలని ఆమె రైతులకు సూచించారు. అనంతరం వెంకుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పశువుల నీటి తొట్టిని పరిశీలించి త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు,చౌటపాలెం పశువైద్యాధికారులు డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ జె.శివరామకృష్ణ, డాక్టర్ భరత్, వైద్యశాలల సిబ్బంది చెన్నయ్య, షహన్, రైతులు పాల్గొన్నారు.

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

**- ఈసీ నీలం సాహ్ని**



**దొనకొండ,ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
ఏపీలో త్వరలో ఎన్నికల మోత మోగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని అధికారులకు సూచనలు చేశారు. పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని నీలం సాహ్ని ఆదేశించారు. రానున్న సంవత్సరంలో జరిగే ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రణాళిక బద్ధంగా మాస్టర్ ట్రైనర్ శిక్షణ, పోలీస్ బలగాలు, ఎలక్టోరల్ రోల్ అంశాలపై దృష్టి పెట్టాలన్నారు.

## సమాజంలోని పీడిత, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే

**- మంత్రి గొట్టిపాటి రవికుమార్**





**బల్లికురవ, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
సామాజిక సంస్కరణలకు నాందిపలికిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొనియాడారు. శుక్రవారం జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బల్లికురవలో కూటమి నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్త్రీల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు పూలే కృషి చేశారని తెలిపారు. తొలి బాలికల పాఠశాలను ప్రారంభించిన విద్యావేత్త పూలే అని అభివర్ణించారు. సమ సమాజ స్థాపనే జ్యోతిరావు పూలే లక్ష్యమని ఫ్రీ విద్య కసం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని ఉద్ఘాటించారు. సమ సమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారని, మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమన్నారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం అర్పించే ఘన నివాళి అని అన్నారు. ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు పునికి పుచ్చుకున్నారని, ఆయన బాటలో పయనిస్తూ పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం పీ 4 విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కనీసం 20 శాతం (30లక్షల) కుటుంబాలను పేదరికం నుండి గట్టెక్కించాలనే లక్ష్య సాధన దిశగా ముందుకు ప్రణాళికలు రూపొందించారని సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న ధనవంతులు, దాతృత్వం కలిగిన వారి సాయంతో పేదలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి ఉపకరించేలా ప్రోత్సహిస్తున్నారని, పేదరిక నిర్మూలనకు ఇది ఓ చక్కటి ఆదర్శవంతమైన కార్యక్రమమని మంత్రి గొట్టిపాటి అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రకర్ జైన్, ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, క్లష్టర్ ఇన్‌ఛార్జీ మల్లీనీడి ఇన్‌ఛార్జీ గోవిందరావు, బల్లికురవ ఉపసర్పంచ్ పందిరి అంజిబాబు, తహశీల్దార్ రవి నాయక్, ఎంపీడీఓ కుసుమకుమారి, గొట్టిపాటి లక్ష్మయ్య, డిప్యూటీ తహశీల్దార్ ప్రహర్ష రవికుమార్, వ్యవసాయ అధికారి కుమారి, విద్యాశాఖ అధికారులు వస్త్రం నాయక్, రమేష్‌బాబు, కస్తూరిభా ప్రిన్సిపాల్ సరళ కుమారి, సీఐ వెంకటరావు, ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతకు అండగా మహాకూటమి ప్రభుత్వం

**- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**బల్లికురవ, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
సర్వకాల సర్వవస్థల్లోనూ అన్నదాతలకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారి ఆర్థిక అభివృద్ధికి మహా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో చేయూతనిస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరైన ఆయన సబ్సిడీపై ప్రభుత్వం అందజేసిన వ్యవసాయ ఉపకరణాలను రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన రైతులకు 11 తైవాన్ స్ప్రేయర్లు, ఒక రొటావేటర్, ఒక పవర్ వీడర్, రెండు గొర్రులు, ఒక బ్యాటరీ స్ప్రేయర్ పంపిణీ చేశారు. వీటి మొత్తం సబ్సిడీ రూ.2,28,000లని మండల వ్యవసాయాధికారి కుమారి తెలిపారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న ఆదిమూలపు సురేష్



**జరుగుమల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
అల్లూరు గ్రామామానికి చెందిన దాసూరి సుధాకర్‌రెడ్డి వివాహం ఆహ్వానం మేరకు అల్లూరు గ్రామం చేరుకొని నూతన వరుడు సుధాకర్‌ను మాజీ మంత్రి, రాష్ట్ర పీఏసీ సభ్యులు, కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ ఆదిమూలపు సురేష్ అక్షింతలు వేసి ఆశీర్వదించారు. మాజీ మంత్రిసురేష్ రాకతో అల్లూరులో కొత్తజోష్ నెలకొంది. వీరి వెంట జరుగుమల్లి మండలకన్వీనర్ బత్తినమదన మనోహర్‌రావు, శేషారెడ్డి, పిచ్చిరెడ్డి, శ్రీనివాస్‌చౌదరి, అనిల్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న ఆదిమూలపు, బూచేపల్లి, మాదాసి



**జరుగుమల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
జరుగుమల్లి మండల పరిధిలోని తూమాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కసిరెడ్డి చిన్న కోటిరెడ్డి కుమారుడు భాస్కర్‌రెడ్డి వివాహ కార్యక్రమానికి మాజీ మంత్రి, రాష్ట్ర పీఏసీ సభ్యులు, కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ ఆదిమూలపు సురేష్, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా మాజీ పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మాదాసి వెంకయ్యలు పాల్గొన్నారు. నూతన వరుడు భాస్కర్‌రెడ్డిని నేతలు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వీరితో పాటు జరుగుమల్లి మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జ్యోతిరావుపూలే జయంతి వేడుక



**జరుగుమల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
జ్యోతిరావుపూలే జయంతిసందర్భంగా మండలపరిధిలోని కే.బిట్రగుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బత్తిన మనోహర్ ఆధ్వర్యంలో వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలకన్వీనర్ మనోహర్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి,మహిళా సాధికారితకు, సామాజిక రుగ్మతలను రూపు మాపడానికి అలుపెరగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను, ఆయన తీసుకొచ్చిన సామాజిక చైతన్యాన్ని గుర్తు చేసుకుంటూ,ఆ మహనీయుని ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని అన్నారు. అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పిన్నిక శ్రీనివాస్, కాకిజైపాల్, కే.చెంచిరెడ్డి, మీడియా కన్వీనర్ పెద్దిరెడ్డి, గ్రామ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్దుడు షేక్ అబ్దుల్ మునాఫ్ మృతి



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
స్వర్గీయ పెద్దదోర్నాల మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ జబ్బర్ సోదరుడు శతాధిక వృద్దుడు షేక్ అబ్దుల్ మునాఫ్(101) శుక్రవారం కన్నుమూశారు. ఈయన 1942లో జన్మించారు. ఆర్‌అండ్‌బి శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ 1987లో రిటైర్డ్ అయ్యారు. పదవి విరమణ చేసినప్పటి నుండి దైవచింతనలో గడుపుతూ వచ్చారు. వీరి కుటుంబ నేపథ్యం పెద్దదోర్నాలలో అందరికి సుపరిచితులు. రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం. ఈయన సోదరుడు షేక్ అబ్దుల్ జబ్బార్ పెద్దదోర్నాల మేజర్ గ్రామ సర్పంచ్‌గా 25 సంవత్సరాలు సుదీర్ఘవంగా పని చేశారు. వీరు నలుగురు అన్నదమ్ములు. వీరంతా దివంగతులయ్యారు. అయితే వీరందరిది ఒకే మాట ఒకే బాట. అన్నదమ్ముల అనుంధం అంటే ఏమిటో చూపించి పెద్దదోర్నాలకే ఆదర్శంగా నిలిచారు. ఒకరికొకరు ధైర్యం, పరస్పర సహకారం మంచి అనుబంధంతో నాటితరం పెద్దలుగా నిలిచారు.

## విద్యుత్ చౌర్యంపై 65 కేసులు నమోదు

**- 1లక్ష 48 వేల రూపాయల అపరాధ రుసుం విధింపు**

**- పెద్దదోర్నాల మండలంలో విద్యుత్ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు**



**పెద్దదోర్నాల, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా పెద్ద దోర్నాల మండలంలో 19 గ్రామాలను సందర్శించి 3150 విద్యుత్ కనెక్షన్లను తనిఖీలు నిర్వహించారు. మార్కాపురం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పీవీ నాగేశ్వరరావు, ఒంగోలు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ డీపీఈ హైమావతి ఆధ్వర్యంలో మార్కాపురం డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎస్‌సీయా నాయక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, కంభం డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ , గిద్దలూరు, వైపాలెం వివిధ మండలాల ఏఈలు, విద్యుత్ సిబ్బంది 36 బృందాలుగా విడిపోయి 19 గ్రామాలలో 3150 విద్యుత్ కనెక్షన్లను తనిఖీ చేశారు. అనధికారికంగా వాడుతున్న మాల్ ప్రాక్టీస్ కేసులు, అధిక లోడు వినియోగిస్తున్న వినియోగదారుల మీద నమోదు చేయడం జరిగింది. గుర్తించిన 65 కేసులకు గాను ఒక లక్ష 45 వేల రూపాయల అపరాధ రుసుం విధించడం జరిగింది.

## లోక కళ్యాణార్థం లక్ష్మీ నరసింహ యజ్ఞం



**ఒంగోలు కల్చరల్ ,ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా ఒంగోలు కర్నూల్ రోడ్డు పాలకేంద్రం దగ్గర ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద గల శ్రీ సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం ద్వి సహస్ర కళ్యాణ చక్రవర్తి బ్రహ్మశ్రీ ప్రముఖ వేద పురోహితులు యాగ్నిక బ్రహ్మ త్రినాధ్ చక్రవర్తి ఆధ్వర్యంలో లక్ష్మీ ్మ నరసింహ స్వామి యజ్ఞం వైభవంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం నిర్వహించిన ఈ యజ్ఞ మహోత్సవంలో భాగంగా నిర్వాహకులు ముందుగా ఆలయంలో సిద్ధి బుద్ధి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముందుగా ఏర్పాటు చేసియాగశాలలో యజ్ఞక్రతువులో శాస్త్రోక్తంగాపూర్ణాహుతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశేషంగా తరలివచ్చిన భక్తులు యాగశాలలోని యజ్ఞగుండ లోని అగ్ని దేవతకు భక్తిశ్రద్ధలతో ద్రవ్యాలను సమర్పించి హోమగుండం చుట్టూ ప్రదక్షణ చేశారు. శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌కి ప్రత్యేక అర్చనలను జరిపించటంతో పాటు విశేష హారతులను భక్తులకు అందజేసి వారికి వేదా ఆశీర్వచనం అందజేశారు.

## బ్రాహ్మణ సేవా సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 11 ,ప్రభాతవార్త**
బ్రాహ్మణ సేవా సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక లాయర్ పేట, రైతు బజార్ వద్ద ఉన్న శ్రీ చిట్టీ ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద శుక్రవారం మధ్యాహ్నం వేసవిని దృష్టిలో ఉంచుకొని పాదచారులకు దేవస్థానానికి వచ్చే భక్తులకు మజ్జిగ పంపిణీ చేసారు. చిట్టి ఆంజనేయ స్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు, అళఘరి శ్రీనివాసాచార్యులు వారి చేతుల మీదుగా, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ బ్రాహ్మణ ట్రస్ట్ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు చేయటం సంతోషమన్నారు. ట్రస్ట్ గౌరవాధ్యక్షులు మాట్లాడుతూ మా ట్రస్ట్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ఈ సారి ఈ వేసవికి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంవల్ల నగరంలోని పలు ప్రాంతాలలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. దీనికి దాతల సహకారం కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ లంకా ప్రసన్న కుమార్, శివదేవుని మురళీధర్, దూపాటి రఘురామ్, సీహెచ్ రామారావు, పి నరసింహా రావు, కె డి వి ప్రసాద్, రాంబాబులు పాల్గొన్నారు.

## కొమ్మాలపాడులో శాంతి ర్యాలీ




**బల్లికురవ, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
వక్ఫ్‌బోర్డు చట్టానికి వ్యతిరేకంగా కొమ్మాలపాడు మర్కస్ మసీదు నుండి శాంతి ర్యాలీని ముస్లిం మత పెద్దలు కమ్యూనిస్టు పార్టీ ఐక్య పల్నాడు జిల్లా కార్యదర్శి మొహిద్దిన్ భాష శాంతి ర్యాలీని ప్రారంభించారు. గ్రామ నలు వీధులలో తిరుగుతూ ఇంకిలాబ్ జిందాబాద్ ఓయ్ వన్ జస్టిస్ పోరాడుదాం పోరాడుదాం, సాధ్దిదాం అనే నినాదాలతో పాటు చట్టాలను వెనక్కి తీసుకోవాలని ముస్లింల యొక్క పాత్ర చట్టాలనే కొనసాగించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మత సామరస్యాన్ని కాపాడాలని కులాల మధ్య, మతాల మధ్య చిచ్చులు పెట్టడం మానుకొని భారతదేశం లౌకిక వాదంతో దేశాన్ని కాపాడాలని అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాపాడాలని వారు నినాదాలు చేశారు.

## పలువురికి మంత్రి గొట్టిపాటి పరామర్శ



**బల్లికురవ, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గ పరిధిలో శుక్రవారం పలువురిని పరామర్శించారు. వల్లాపల్లి గ్రామంలో షేక్ ఖాశింవలి ఇటీవల గుండె సమస్యతో మరణించగా వారి నివాసానికి వెళ్లి ఖాశింవలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గొట్టిపాటి అంజయ్య సతీమణి అన్నపూర్ణ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఈ రోజు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొత్తరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ సంగు యోగిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా శుక్రవారం దశదిన కార్యక్రమ సందర్భంగా హాజరై యోగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## విత్తన దుకాణాలను తనిఖీ చేసిన రాష్ట్ర తనిఖీ బృందం



**మార్టూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
మార్టూరులోని విత్తనాల దుకాణాలను రాష్ట్ర తనిఖీ బృందం శుక్రవారం తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీలలో సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బాల భాస్కర్, వ్యవసాయాధికారి జి.మోహన్ లు కావేరి సీడ్ కంపెనీ, శ్రీ సత్య అగ్రి బయోటెక్, అమర్ బయోటెక్ కంపెనీల విత్తనాలను పరీక్షించడం జరిగింది. బీటీ పత్తిలో ప్రభుత్వమే నిషేధించబడిన ఫెర్టిసైడ్ ట్రేట్‌కి సంబంధించిన టెస్టును నిర్వహించారు. నాలుగు కంపెనీలకు సంబంధించిన విత్తనాలకు నెగిటివ్ రిజల్ట్ రావడం జరిగింది. ఎవరైనా పర్మిషన్ లేని హెచ్‌టి కాటన్ విత్తనాలు అమ్మినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదే విధంగా విత్తన స్టాక్ వివరాలు, ధరలను, స్టాక్‌బోర్డు నందు పొందు పరచాలని సూచించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్టూరు మండల వ్యవసాయాధికారి బి.అంజిరెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, అద్దంకి ఎంఏఓ కే.వెంకటకృష్ణ పాల్గొన్నారు. అదే విధంగా రైతులు కూడా విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు.

## స్కూళ్లకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం




**దొనకొండ,ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
ఈ నెల 24 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లకు వేసవి సెలవులు ఇస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. వేసవి సెలవులపై రకరకాల ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారిక ప్రకటన విడుదల జారీ చేసింది. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని పేర్కొంది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే షెడ్యూల్ను ఖరారు చేసినట్లు వెల్లడించింది.

## ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు

**- ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి - సిడిపివో యం.పద్మవతి**



**యర్రగొండపాలెం,ఏప్రిల్11,ప్రభాతవార్త**
ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండటమే లక్ష్యంగా గర్భిణులు, బాలింతలు,కిషోర బాలికలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు య ర్రగొండపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి యం.పద్మవతి అన్నారు. పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం య ర్రగొండపాలెం పట్టణంలోని బాలికల హాస్టల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిడిపివో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగాఉండాలని అమె వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ.పద్మజ మాట్లాడుతూమంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం బాలికలచే ప్రతిజ్ఞచేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.వి.సుజాత, వార్డన్, అంగన్‌వాడీకార్యకర్తలురామసుబ్బమ్మ, పద్మ, షేక్.షంషాద్, రూత్‌మేరి, రామకూమారి, తిరుపాలమ్మ, శివపార్వతి, నసిమా, విజయలక్ష్మి, రేణుక, కోటేశ్వరి, బేబిరాణి, పాల్గొన్నారు.

## గొట్లగట్టు కేజీబీవీలో ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి



**కొనకనమిట్ల, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**
మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో శుక్రవారం జ్యోతిరావు పూలే 198వ జయంతి ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ, పాఠశాల ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

## కిట్స్ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ వేడుకలు

**- విద్య అనేది పాఠశాలలోనే కాదు జీవితంలో ప్రతి దశలో ఉంటుంది : అన్నా రాంబాబు**




**పెద్దారవీడు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

భావోద్వేగాలు, ఆనందం, కృతజ్ఞతలతో నిండిన ఫేర్‌వెల్ కార్యక్రమం కృష్ణచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో ఈసిఈ విభాగం ఆధ్వర్యంలో 2021-2025 బ్యాచ్ విద్యార్థులకు ఘనంగా ఫేర్‌వెల్ పార్టీని 2025 ఏప్రిల్ 11 శుక్రవారం రోజున డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం కాన్ఫరెన్స్ హాల్, సి-బ్లాక్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల జీవితాలలో ఒక జ్ఞాపకంగా నిలిచిపోయేలా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ అన్నా వెంకట రాంబాబు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. తన సందేశంలో ఆయన విద్యార్థులకు ఆసక్తికరమైన సందేశం అందించారు. విద్య అనేది పాఠశాలలో మాత్రమే కాదు. జీవనంలో ప్రతి దశలో కొనసాగుతుందన్నారు. మీరు ఎక్కడ ఉన్నా కృష్ణచైతన్య సంస్థను ప్రతిష్ఠాత్మకంగా నిలుపుతూ ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ కృష్ణచైతన్య తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ మన విద్యార్థులు ప్రపంచంలో ఏ స్థానంలో ఉన్నా విజయం సాధించాలని, వారి ప్రతిభ మన సంస్థకు గర్వకారణంగా మారాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి విద్యార్థులకు వ్యక్తిగతంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కృషి, నిబద్ధత, ఆత్మవిశ్వాసం అనే మూడు మూల స్థంభాలతో మీరు మీ లక్ష్యాలను సాకారం చేసుకోగలరని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సృజనాత్మకత అభినందనీయం హృదయాన్ని హత్తుకునే గీతాల రూపంలో సంగీత ప్రదర్శనలు, ఆధ్యాత్మిక, స్నేహం, సమాజంపై ఆధారిత నృత్యాలు, వినోదాత్మక హాస్య నటనలు, ఫోటో మెమరీ వీడియోల ద్వారా గత నాలుగేళ్ళ జ్ఞాపకాలను గుర్తు చేసే క్షణాలు అన్నీ కలగలిపి ఈ వేడుకను మరపురాని మధురానుభూతిగా మార్చాయి. విభాగాధిపతి మరియు టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది అందరూ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి కృషిచేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి దశను ప్రణాళికాబద్ధంగా రూపొందించి సమయపాలనతో, విద్యార్థులకు గుర్తుండిపోయే మధుర జ్ఞాపకాలతో అలరించబడింది.

## సమసమాజ నిర్మాత కృషివలుడు మహాత్మా జ్యోతిరావు పూలే



**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

అడుగంటిన బలహీన వర్గ కులాలకు మార్గ దర్శకులు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు పట్టణంలోని స్థానిక కరెంట్ ఆఫీస్ దగ్గర భారతీయ జనతాపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ కౌన్సిల్ మెంబర్ శాసనాల సరోజినీ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బొంతల కృష్ణలు హాజరయ్యారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొంతల కృష్ణ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే పూర్తిపేరు గోవిందరావు పూలే అని మానవజాతికి విద్య మాత్రమే బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయుధమని గమనించి బిసిల విద్యాభివృద్ధికి తోడ్పడిన మహనీయుడని, మహిళా జాతికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిన వ్యక్తి అని అన్నారు. మహిళలు ఉద్యోగాలలో ముందుడుగులో ఉన్నారంటే ఆయన ఇచ్చిన నినాదమే అన్నారు. ఆయన మహారాష్ట్రలో 1827 ఏప్రిల్ 11వ తేదీన జన్మించడం జరిగిందన్నారు. ఆయన ఒక బిజినెస్ మ్యాన్ అని ఆయన సతీమణి ఒక ఉపాధ్యాయురాలు అని అదే విధంగా సోషల్ సర్వీస్ యాక్టివిటీస్ అడుగంటిన కులాలను ముందుకు నడిపించే ఆలోచనతో ముందుకు తెచ్చిన వ్యక్తి జ్యోతిరావు పూలే అన్నారు. అనంతరం యువత ఆయన ఆశయాలతో ముందుకు నడవాలని, భారతదేశాన్ని అగ్రరాజ్యంగా నిలబెట్టాలని శాసనాల సరోజినీ తెలిపారు. భారతీయ జనతాపార్టీ నాయకుల ప్రసంగంలో పలు విషయాలను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్ శాసనాల సరోజినీ, జిల్లా కిసన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బొంతలకృష్ణ, జిల్లా సెక్రటరీ మొర్రిబోయిన చిన్నయ్య, జిల్లా మహిళా మోర్చా నాయకురాలు మద్దెల లక్ష్మీదేవీ, మల్లిఖార్జున, కామేశ్వరరావు, బైసాని నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల్లో ఊబకాయం తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవన శైలి అలవాటు చేయాలి

**- పోషణ పక్వాడ కార్యక్రమంలో సిడిపిఓ బి.జ్యోతి**



**గిద్దలూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

పిల్లలో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకునేలా చేయడం, పిల్లల ఆరోగ్య పరిస్థితిని మెరుగు పరచుకునేలా తల్లులకు సిడిపిఓ బి.జ్యోతి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. గిద్దలూరు ప్రాజెక్టు పరిధిలోని గణేషనగర్ ఏరియాలోని కోడ్ నెంబర్ 23, 188, 11అంగన్ వాడీ కేంద్రాలలో సిడిపిఓ బి. జ్యోతి అధ్యక్షతన శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ బి జ్యోతి మాట్లాడుతూ పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా గర్భవతి గర్భస్థ దశ నుండి రెండు సంవత్సరాల పిల్లల పట్ల తల్లులు శ్రద్ధ వహించేటట్లు అవగాహన కల్పించడం, అలాగే లబ్ధిదారుల స్వయంగా తామంతట తామే పోషణ ట్రాకర్ యాప్ లో నమోదు చేసుకునే విధానంపట్ల అవగాహన కల్పించడం తదితర అంశాలమీద తల్లులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, సున్నా నుండి ఐదు సంవత్సరాల చిన్నారుల తల్లులు, మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్ వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, విజయ, మహబూబ్, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**గిద్దలూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని సంజీవరాయునిపేట సబ్ స్టేషన్ 33కెవిలైన్ మరమ్మతుల కారణంగా సంజీవరాయునిపేట, ఉయ్యాలవాడ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో నేడు (శనివారం) ఉదయం 7గంటల నుండి ఉదయం 11.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపిసిపిడిసిఎల్ గిద్దలూరు డిఈఈ బి శేషగిరిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంజీవరాయునిపేట, ఉయ్యాలవాడ సబ్ స్టేషన్ పరిధిలోని సంజీవరాయునిపేట, ఉయ్యాలవాడ, ఆదిమూర్తిపల్లె,సూరేపల్లి, లింగాపురం,గడికోట, దేవనగరం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని ఆయన తెలిపారు. కావునా ఆయా గ్రామాల ప్రజలు విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.


## ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 11 ,ప్రభాతవార్త**

పట్టణంలో శుక్రవారం బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ -ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కరెంట్ ఆఫీస్ ప్రాంగణం నందు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతివేడుకలను ఘనంగా నిర్వహించారు. బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ -ఆంధ్రప్రదేశ్ సలహాదారులు బోడా వెంకట రజనీకుమార్, జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ యాసం బాల శంకరయ్య, బిసి ఉద్యోగ సంఘం నేత పిసి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ కొప్పుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ యాసం బాల శంకరయ్య మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల విద్య ప్రాధాన్యత గుర్తించి బాలికలకు చదువు చెప్పేందుకు తన భార్య సావిత్రి బాయి పూలేను ఉపాధ్యాయునిగా తయారు చేసి దేశంలో మొట్టమొదటి బాలిక పాఠశాలను 1848లో మహారాష్ట్రలోని పూణే పట్టణంలో స్థాపించి అందరికి విద్యను అందించేందుకు దారి చూపారని తెలిపారు. సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను పారద్రోలి విజ్ఞాన పథం వైపు పయనించేందుకు 1873లో సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి జాతిని చైతన్యం చేశారని వీరి దార్శనికతలో ఎందరో సంఘ సంస్కర్తలు సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు కృషిచేశారని వీరి సేవలను గుర్తుచేశారు. అందరికీ విద్యా హక్కు స్ఫూర్తి ప్రదాతలు పూలే దంపతులను, తన గులాంగిరి రచన ద్వారా సమాజంలో సాంఘిక సంస్కరణకు పిలుపునిచ్చిన వారని బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ -ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పిసి వెంకటేశ్వర్లు పూలే దంపతుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత మరియు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథాల రథోత్సవ కమిటీ సభ్యులు పిన్నబోయిన శ్రీనివాసులు, (మార్కెట్‌శ్రీను), నగర సంఘం మార్కాపురం అధ్యక్షులు కొప్పుల వెంకటేశ్వర్లు, నక్కా వెంకట రమణ (టిక్కెట్), రిటైర్డ్ ఎస్సై ఆరెపల్లి శ్రీనివాసులు, కొప్పుల వెంకట రమణ, జలుసాల సుబ్బారావు, నక్కా రమణ, జలుసాల శ్రీను, ఇమ్మడి శివ, విద్యుత్ కార్యాలయ ఉద్యోగులు రాజేంద్ర ప్రసాద్, డాక్యుమెంట్ రైటర్ దేవానంద్, పలువురు బిసి ఉద్యోగ సంఘం నేతలు హాజరయ్యారు.

## ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు



**పొన్నలూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పొన్నలూరులో మండల వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావుపూలే 199వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వైసీపీ శ్రేణులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ అభ్యున్నతికి, బడుగు,బలహీన వర్గాల అభివృద్ధికి పూలే చేసిన పోరాటాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నల్లమలపు వెంకటేశ్వర్లు, వైసీపీ కొండపి నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షులు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, చౌటపాలెం సర్పంచ్ అనుమోలు ప్రసాద్, వైసీపీ సీనియర్ నాయకులు దుద్దుగుంట మల్లిఖార్జునరెడ్డి, కర్ర మస్తాన్‌రెడ్డి, టీడీపీ నాయకులు తన్నీరు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు



**మద్దిపాడు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

అంటరానితనం,కులవ్యవస్థ నిర్మూలన, మహిలో ద్ధరణకు కృషి చేసినటువంటి మహోన్నతమైన వ్యక్తి జ్యోతిరావు పూలే అని మండల టీడీపీ అధ్యక్షులు మండల జయంతిబాబు పేర్కొన్నారు. శుక్రవారం నాడు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతిబాబు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు, మహిళోద్ధరణకు కృషి చేశాడని, 1873 సెప్టెంబర్ 24న పూలే తన అనుచరులతో కలిసి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేశాడని ఆయన అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పని చేసిన, ఈ సంఘంలో అన్ని మతాలు, కులాలు ప్రజలు కూడా చేరవచ్చునని పిలుపునిచ్చారు. లాగ్రేంజ్‌లోని సామాజిక సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డాడు. పూలే, అతని భార్య సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు అని ఆయన అన్నారు. అతను మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందాడని అన్నారు. విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త కూడా ఆయన అని అన్నారు. ఆయన యొక్క సేవా కార్యక్రమాల గురించి పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మదవ జయంత్‌బాబు, ఎంపీటీసీ అద్దేపల్లి దుర్గాభవాని, మద్దిపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కడియాల రఘుబాబు, యూనిట్ ఇన్‌ఛార్జి మండవ గోపిచంద్, మండల బీసీ సెల్ అధ్యక్షులు శుద్దపల్లి అనిల్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రెబ్బవరపు ప్రభాకర్, టీడీపీ నాయకులు సుద్దపల్లి నరసింహారావు, దుద్దుకూరి డేవిడ్, రావి నరసింహారావు, చింతలశ్రీనివాసరావు, కొత్త సుమన్, నాయుడు భానుచందర్, కారుమూడి చింపిరయ్య, బోడిపోగు రమేష్, పెనుబాక సుధాకర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు పిల్లలకు పోషకాహారాలను కల్పించాలి



**పొన్నలూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

మండలంలోని పాత సింగర్‌బొట్లపాలెం గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి అధ్యక్షతన పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ పోషణ పక్వాడా, న్యూట్రిగార్డెన్ కార్యక్రమాలు పోషకాహార లోపాన్ని తగ్గించడానికి ప్రజలకు పోషకాహారం గురించి అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశం పోషకాహారానికి సంబంధించిన పండ్లు, కూరగాయాలు ఔషధ మొక్కలను సాగు చేయటం, పోషణ పక్వాడా, న్యూట్రి గార్డెన్ కార్యక్రమాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహార పక్షం నిర్వహించడం పోషకాహార తోటలను ఏర్పాటు చేయడం తదితర అంశాలను పిల్లల తల్లులకు తెలిపారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించి వారికి తగు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీ రాణి, ప్రసాద్, పి.సునీత, పి.అరుణ, గౌతమి, రామలక్ష్మి, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుక




**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

స్థానిక కమలా కాన్సెప్ట్ స్కూల్ మార్కాపురం నందు శుక్రవారం ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ ఎం పి పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమలా విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ పెనుగొండ భువన సింధుజ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిధూజ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉన్న పరిస్థితులను గమనించి నైపుణ్యాధారిత విద్య యొక్క ఆవశ్యకతను తెలుసుకొని ఈ తరం విద్యార్థులకు అవసరమైన విద్యను అందించాలని సూచించారు. కమలా కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం పెద్దపుల్లయ్య మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో ఇది పునాది దశ అని ఈ దశలో ఆటల ఆధారిత విద్య, కార్యకలాపాధారిత విద్య అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు చాలా ఆసక్తిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

**- ఏపియుడబ్ల్యుజే డిమాండ్**




**మార్కాపురం రూరల్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

పల్నాడు జిల్లాలో వాస్తవాలను ప్రచురించిన సాక్షి ప్రతిక విలేకరులపై పోలీసులు అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని సీనియర్ పాత్రికేయులు ఓపి మల్లిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో విలేకరులపై అక్రమంగా జర్నలిస్టులు మార్కాపురం ప్రెస్ క్లబ్ నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరుగంటి మల్లిక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో నాల్గవ స్తంభంగా ఉన్న ప్రతిక వ్యవస్థపై, విలేకరులపైన అమానుషంగా దాడులు జరపడం, కేసులు నమోదు చేయడం దారుణమని అన్నారు. నిజాన్ని నిర్భయంగా రాసి జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం జర్నలిజానికి సంకెళుల వేయడమేనని అన్నారు. ప్రజాస్వామ్యం పరిహాసం కాకుండా ఇప్పటికైనా విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఏపియుడబ్ల్యుజే నాయకులు జివెల్ నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డి మోహన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె బాజి వలి, జిల్లా యూనియన్ కార్యవర్గ సభ్యులు ఎస్‌కె అన్ను, ఏపియుడబ్ల్యుఎఫ్ నాయకులు వెన్నా శ్రీనివాసరెడ్డి, ఎంపిజె శాఖ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె బాబు, ఏపియుడబ్ల్యుజే నాయకులు ఎస్‌కె మహబూబ్ బాష, సయ్యద్ షాకీర్ హుస్సేన్, వేశపోగు రాజు,ఆదినారాయణ, మల్లిఖర్జున, నరేంద్ర, కల్లూరి వెంకటేశ్వర్లు, తిప్పనబోయిన మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు. అనంతరంపై సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయంలో యూనియన్ నాయకులు అందజేశారు.

## నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో కూలిన స్లాబు మిద్దె

**- తప్పిన పెను ప్రమాదం**



**యర్రగొండపాలెం రూరల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టణానికి చెందిన పేరం నాగిరెడ్డికి చెందిన స్వంత మిద్దె కూలి పెను ప్రమాదం తప్పింది. యర్రగొండపాలెం పట్టణ పరిధిలో వినుకొండ రోడ్ నందు నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో పెను ప్రమాదం తప్పింది. యర్రగొండపాలెం మెయిన్ రోడ్డులో పేరం నాగిరెడ్డికి చెందిన మిద్దె స్లాబు కూలి పెను ప్రమాదం తప్పింది. రద్దీగా ఉండే ఆ ప్రాంతం మధ్యాహ్నం కావడంతో ఆ సమయంలో ఇంటిలో నివశిసునతన్న వారు లేకపోవడంతో పెను ప్రమాదం నుంచి ఆ కుటుంబం బయటపడింది. ప్రజలు, వాహనాలతో రద్దీగా ఉండే రహదారిలో ఇలా ఇల్లు అమాంతం ఒక్కసారిగా కూలిపోవడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. స్లాబు కంకర, ఇనుము దిమ్మెలు రోడ్డుమీద పడడంతో అక్కడి ప్రజలు భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో స్లాబు దిమ్మెలు పడి అక్కడే ఆపిఉన్న ఓ ద్విచక్రవాహనం ధ్వంసం అయ్యింది. గాలి, వానా లేకుండానే ఇలా మంచి ఎండలకు మిద్దె కూలడం ఏమిటని స్థానికులు ఆశ్యర్యం వ్యక్తం చేస్తున్నారు.

## హత్యకేసు వివరాలను వెల్లడించిన

### మార్కాపురం డిఎస్పి నాగరాజు



**అర్ధవీడు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

అర్ధవీడు మండలంలో ఈనెల 8వ తేదీన జరిగిన హత్యకు సంబంధించిన వివరాలను మార్కాపురం డిఎస్పి నాగరాజు శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. అర్ధవీడు మండలంలో నివాసముంటున్న షేక్ ఖాశింవలి ప్రతిరోజు మద్యం సేవిస్తూ ఉండేవాడని ఏప్రిల్ 8వ తేదీ రాత్రి 8గంటల సమయంలో మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి ఆమెను చంపాలనే ఉద్దేశ్యంతో వంటగదిలో ఉన్న కూరగాయల కత్తితో దాడి చేయడానికి వెళ్ళగా ఆ సమయంలో అడ్డుగా వచ్చిన వారి కుమారుడు షేక్ షాకీర్‌ను కోపంతో అతను ఎడమవైపు ఛాతిపై కత్తితో పొడిచాడు. గాయడిప బాలుడిని కుటుంబ సభ్యులు వెంటనే మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినా అప్పటికే అతని కుమారుడు షేక్ షాకీర్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు మార్కాపురం డిఎస్పి నాగరాజు వెల్లడించారు. ముద్దాయి షేక్ ఖాశింవలిని అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు హాజరు పరచి రిమాండ్‌కు తరలించినటు ఆయన తెలిపారు. పాత్రికేయుల సమావేశంలో మార్కాపురం డిఎస్పి నాగరాజు వెంట కంభం సిఐ మల్లిఖార్జున, ఎస్సై సుదర్శన్ యాదవ్‌లు పాల్గొన్నారు.

## బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల




**గిద్దలూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని ముండ్లపాడు రోడ్డులోగల శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వారితోపాటు ఆయన సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి, పట్టణ తెలుగుదేశంపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపి కార్యాలయంలో ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు



**సంతనూతలపాడు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

సంతనూతలపాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాడు జ్యోతిరావు పూలేజయంతివేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి సంతనూతలపాడు మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు జన్మదినోత్సవాన్ని పురష్కరించుకుని టీడీపీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, రాష్ట్ర టీడీపీకార్యదర్శి అడకా స్వాములు తదితరులు టీడీపీ నేత ముప్పరాజు శ్రీనివాసరావుకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్ధన్, గ్రామ టీడీపీ అధ్యక్షులు బొడ్డ శంకర్‌బాబు, బాపట్ల పార్లమెంటు టీఎన్‌టీయుసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామి చౌదరి, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు మందాడి వెంకటేశ్వర్లు, బాపట్ల పార్లమెంట్ టీఎన్‌టీయుసీ ఉపాధ్యక్షులు చెరుకూరి వెంకట సుబ్బయ్య, టీడీపీ నేతలు సాదినేని శ్రీరామమూర్తి, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, కే.ఆంజనేయులు, వేమా అంకంశెట్టి, నల్లూరి గోపి, నువ్వల మీరయ్య,బొడ్డపాటిచంద్రశేఖర్, ఎస్.ఉమా,చెరుకూరి సుబ్బారావు,చెరుకూరిబోస్,మద్దిరాల సుబ్బారావు, రావులపల్లి సురేష్‌బాబు, నల్లగట్ల సుబ్బారావు, హరిబాబు, ఎన్.ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితురాలుకు చేయూత



**సంతనూతలపాడు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

ఉలిచి గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి పి.అక్షయ ఊపిరితిత్తులు క్యాన్సర్‌తో హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా సంతనూతలపాడు సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ శనగల వెంకటరమణ, ట్రస్టు ట్రస్టీ మద్ది మల్లిఖార్జునరావులు ఈ మేరకు వారి కుటుంబానికి 28 వేల 600 రూపాయలను అందజేశారు. ఒంగోలు ఎన్ఎస్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ నందు సదరు విద్యార్థిని చికిత్స పొందుతున్నారు. సదరు విద్యార్థి కరవాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. పరీక్షలకు ముందు సదరు విద్యార్థినికి హాస్పిటల్ నందు చూపిస్తే ఊపిరితిత్తుల క్యాన్సర్ అని చెప్పారు. ఫేస్‌బుక్ ద్వారా సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు వారిని ఫోన్లో సంప్రదించగా ఈ మేరకు ఆయా విద్యార్థినికి ఈ ట్రస్టు ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. సదరు పాప ఆక్సిజన్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాప తండ్రి కూడా కిడ్నీ సమస్యతో అనారోగ్యంతో ఉన్నాడు. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పాపకు చేయూతనిచ్చిన సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టును పలువురు ఈ సందర్భంగా ప్రశంసించారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దాం

**- ఘనంగా మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహావిష్కరణ**



**సింగరాయకొండ, ఏప్రిల్ 11,ప్రభాతవార్త**

మహాత్మా జ్యోతి రావు పూలే పేదల అభ్యున్నతికి చేసిన సేవలును గుర్తించుకొని పూలే ఆశయాలుకు అనుగుణంగా నడుచుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కోరారు. శుక్రవారం రైల్వే రోడ్డు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతి రావు పూలే కాంశ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్,రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి చైర్మన్ నూకసాని బాలాజీ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే కాంశ్య విగ్రహాన్ని వారి చేతుల మీదగా పైలాన్ ఆవిష్కరించారు. తొలుత పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతకు పూలే నిరంతరం పోరాటం చేశారని అన్నారు. పేదల విద్యాభివృద్ధికి కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతా వాది అని కొనియాడారు. కుల, లింగ వివక్షతకు తావు లేకుండా అన్ని వర్గాలు కు విద్య సమానంగా అందాలని కృషి చేసారని వివరించారు. ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన పూలే విగ్రహ ఆవిష్కరణకు బీసీ మంత్రిగా రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. పూలే జయంతి రోజు జిల్లాలో 897 కోట్ల రూపాయలతో రాయితీ పై రుణాలను అందజేయడం జరిగిందన్నారు. బీసీల అభ్యున్నత కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ స్వామి మాట్లాడుతు బీసీ ల అభ్యున్నతికి తెలుగు దేశం పార్టీ పెద్ద పీట వేయడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం 33 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 24 తగ్గించిన ఘనత గత ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఏడు ఏళ్ల తర్వాత విగ్రహ ఆవిష్కరణ చేయడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా కమిటీ వారిని అభినందించారు. పూలే జయంతి రోజే బిసి రుణాలు ద్వారా యూనిట్లు అందించి చిత్తశుద్ధిని నిరూపించిందన్నారు. పూలే ఆసియాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ వెనుకబడిన కొండేపి నియోజకవర్గానికి 100 పడుకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేయాలని వైద్య శాఖ మంత్రిని కోరగా, ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందించి ఏర్పాటుకు త్వరలోనే పైలెట్ ప్రాజెక్టు కింద మల్టీ స్పెషాలిటీ హాస్పిటలను ఏర్పాటు చేస్తామని సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సత్య కుమార్ యాదవ్,మంత్రి స్వామిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, మండల ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ చైతన్య, జనసేన కొండేపి నియోజకవర్గ సమన్వయ సమన్వయకర్త కే మనోజ్ కుమార్, బిజెపి నాయకులు,టిడిపి నాయకులు,పూలే విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుదీపాలంకరణలతో వెలిగిపోతున్న రంగస్వామి క్షేత్రం




**రాచర్ల, ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి క్షేత్రం విద్యుద్దీ పాలంకరణ లతో వెలిగిపోతుంది. ఈ నెల 12వ తేదీ నుండి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు రంగస్వామి క్షేత్రాన్ని అత్యంత వైభవంగా తీర్చిదిద్దారు. శుక్రవారం సాయంత్రం ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించి బ్రహ్మోత్సవాల శోభ సంతరించుకునేలా సిద్దం చేశారు. నేటి నుండి ప్రారంభమయ్యే రంగస్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజులపాటు జరుగుతాయని 12వ తేదీ అంకురార్పణ 13వ తేదీ కళ్యాణం, 14వ తేదీన తెప్పోత్సవం 15వ తేదీ చక్రస్నానం తదితర కార్యక్రమాలు జరుగుతాయని అందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపటు ప్రశాంత వాతావరణంలో సజావుగా కార్యక్రమాలు సాగేందుకు ప్రత్యేక నిబంధనలు కూడా విధించినట్లు ఆయన తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రజలు నడుచుకోవాలని ఆయన కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలోనికి ఎలాంటి వాహనాలకు అనుమతి లేదని కేవలం భక్తుల దర్శనానికి, రాకపోకలకు ఇబ్బందులు కలుగకూడదని వాహనాలు లోపలికి అనుమతిస్తే వాటి ద్వారా భక్తుల దర్శనానికి ఇబ్బంది కలుగుతుందని అందుకే అనుమతి లేకుండా చేశామన్నారు. కళ్యాణం రోజు కూడా అనుమతి ఉన్నవారికి వేదిక పైకి ఆహ్వానం ఉంటుందని వారు మాత్రమే కళ్యాణ వేదికపై ఉంటారని ఆయన తెలిపారు. కళ్యాణం సందర్భంగా భక్తుల ఉధృతి వలన కళ్యాణ వేదిక పరిసరాలలో ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేశామని, ప్రజలు బారికేడ్ల బయట నుండే స్వామివారి ఆశీస్సులు అందుకోవాలని అన్నారు. గుండం వద్ద ప్రమాదాల నివారణకు చర్యలతోపాటు ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించామని తెప్పోత్సవం రోజు తెప్పపైకి దాదాపు 20మందికి మాత్రమే అనుమతి ఉంటుందని అదికూడా ఉన్నతాధికారుల ఆదేశాలతోనే అన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, నాట్య ప్రదర్శనలు, భక్తులను ఆహ్లాదపరిచేందుకు నిర్వహించడం జరుగుతుందని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో 200మందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారని ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

## బంగారు బాల్యం పై మండల స్థాయి అధికారుల సమావేశం

**పామూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



బంగారు బాల్యంపై ఏవో చెన్నకేశవరెడ్డి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు బంగారు బాల్యంపై మండల స్థాయి అధికారులు స్వచ్ఛంద సంస్థలు మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాల కార్మిక వ్యవస్థపై, బాల్య వివాహాలపై బాలల అక్రమ రవాణాపై, విద్యార్థులు డ్రాపౌట్స్‌లను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించడం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించడం, వెట్టి చాకిరి నిర్మూలన, 0-6 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఆధార్ అప్‌డేట్ నిర్వహించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించి తీర్మాణించడం జరిగింది. ఈ సమావేశంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీరామ అజయ్ కుమార్, హెల్త్ విజిట్ ఆఫీసర్ నిర్మల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఏపీఎం విద్యా సాగర్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్, స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఓగురు సుబ్బమ్మ, వీఆర్వో రమేష్ తదితరులు హాజరయ్యారు.

## తల్లిబిడ్డ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి

**పామూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



తల్లిబిడ్డ క్షేమం కోసం బాలింతలు గర్భిణీలు అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ళ పద్మజా తెలిపారు. మండలంలోని బొట్లగూడూరు అంగన్‌వాడీ కేంద్రం నందు శుక్రవారం నాడు నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహార విలువలు, వాటి పోషకాల గురించి వివరించారు. గర్భిణీ స్త్రీలు, పిల్లలు వెయ్యి రోజుల పాటు తీసుకునే ఆహారం గురించి తెలియజేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చిన్నారులు మానసిక వికాసంతో పాటు ఆరోగ్య పరిరక్షణ కొరకు వివిధ రకాల పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని తినుబండారాలను అందిస్తుందన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలకు, రక్తహీనత లోపించిన వారికి ప్రత్యేక ఆహారాన్ని అందిస్తుందన్నారు. ఆకు కూరలు విధిగా తీసుకోవాలని, గుడ్డును తినాలని చెప్పారు. జన్మించిన బిడ్డ బరువు తక్కువ కాకుండా ఉండాలని, అందుకు తల్లి గర్భంలోనే బిడ్డకు ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

## యారవను సన్మానించిన మానవత సంస్థ ప్రతినిధులు

**పామూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



యువపారిశ్రామిక వేత్త యారవ శ్రీనివాసులును పామూరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు శుక్రవారం నాడు కలిసి దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. రైతులు గురించి అన్ని తెలిసిన యారవ శ్రీనుకు నియోజకవర్గంలోని ఆరు మండలాల రైతుల కష్టాలు తీరే విధంగా పని విధానం ఉండాలని సూచించారు. రైతులకు అవసరమైనటువంటి పొలాల రహదారులు, సబ్సిడీ విత్తనాలు, మార్కెట్ తగ్గ విధంగా మద్దతు ధర కల్పించాలని వారు కోరారు. సన్మానించిన వారిలో మానవత సంస్థ సభ్యులు వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, రమేష్, టి.మాల్యాద్రి, టీఎస్ రంగారెడ్డి, మితికెల నారాయణయాదవ్, ఎం.తిరుపతిరెడ్డి, కోదూరు ప్రభాకర్, జి.పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ పాటించాలి

**పామూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించి వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా అయ్యేలా చూడాలని యువనేత, టీడీపీ నియోజకవర్గ నాయకులు యారవ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండలంలోని పడమరకట్టకిందపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పిల్లలకు ఇస్తున్న మెనూను పరిశీలించారు. వంట గది శుభ్రంగా ఉంచాలని తెలిపారు. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని, బొమ్మల రూపంలో ప్రదర్శన చేయాలని సూచించారు. పిల్లల్లో ఆదరణ పెంచాలని, గర్భిణీ స్త్రీలను గుర్తించి వారికి తగు పోషకాలు సక్రమంగా అందించాలని యారవ సూచించారు. ఈ కార్యక్రమంలో మితికెల నారాయణ, శేషం మోషే, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంతరానితనాన్ని రూపుమాపిన మహనీయులు జ్యోతిరావు పూలే

**చీరాల, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



అంటరానితనాన్ని రూపుమాపడంతో పాటు బాలికల విద్య, స్త్రీల హక్కుల కొరకు తన జీవితాంత పోరాటం చేసిన మహనీయుడు సామాజిక విప్లవ చైతన్య మూర్తి జ్యోతిరావు పూలే అని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు లింగం జయరాజు అన్నారు. శుక్రవారం పూలే 198వ జయంతి సందర్భంగా స్థానిక గడియారస్థంభం వద్ద ఆయన విగ్రహానికి కేవీపీఎస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాటమే మహాత్మజ్యోతిబాపూలే కు మనం ఇచ్చే ఘనమైన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఎన్.బాబూరావు, ఎం.వసంతరావు, పి.కొండయ్య, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయులు మహాత్మజ్యోతిరావుపూలే - ఎమ్మెల్యే కొండయ్య

**చీరాల, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



చదువు ప్రధానమని గుర్తించి భార్య సావిత్రిబాయి చదువు నేర్పించి సమాజంలో స్త్రీలు సగభాగం అని, వారి అభివృద్ధి వలనే సమాజం అభివృద్ధి చెందుతుందన్న మహనీయులు జ్యోతిరావుపూలే అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం మహాత్మజ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకుని సుల్తానుపేట నందు గోకుల్ కృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో కలిసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పుష్పమాలతో నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కంటే ముందుగా మహాత్మ బిరుదుతో జన నీరాజనాలు అందుకున్న గొప్ప వ్యక్తి మహాత్మజ్యోతిరావు పూలే అని, ఆ అభివృద్ధి కేవలం విద్యతో సాధ్యమని భావించి అందు కోసం ఎన్నో మహిళా పాఠశాలలు ఏర్పాటు చేసి మహిళా సాధికారిత అశేష కృషి చేసిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో కాలేజ్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

**చీరాల, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా బహుజన పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ భానిసత్వ సంకెళ్ల నుండి బహుజనులను మేలుకొల్పిన విముక్త ప్రధాత, విద్య ద్వారా మూఢ విశ్వాశాల నుండి సమాజాన్ని చైతన్యపరిచిన సాంఘిక చైతన్యమూర్తి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గొర్రెపాటి రవి కుమార్, మార్క్స్, దుడ్డు భాస్కరరావు, బుర్ల సాంబశివరావు, నాయకులు సంగీతరావు, పుల్లయ్య, అర్జున్‌రావు, దానియేలు, బుజ్జిబాబు, మత్తయ్య, జగదీష్, వాసు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధర తగ్గించాలంటూ మహిళలు నిరసన

**కనిగిరి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం కనిగిరి పట్టణంలో మహిళలు గ్యాస్ సంభాలతో నిరసన ర్యాలీ చేపట్టారు. సుగుణవనమ్మ హాస్పిటల్స్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమం వెంకమ్మ అధ్యక్షతన జరిగింది. కనిగిరి పట్టణ కార్యదర్శి ప్రసన్న మాట్లాడుతూ గ్యాస్ ధరలతో పాటు నిత్యవసర ధరలు పెరగడం వల్ల సామాన్యుడి జీవనం ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ఉచిత గ్యాస్ అని చెప్పి గ్యాస్ భారాలు మోపడం సరికాదని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.

## పండ్ల మొక్కల స్థానంలో నీడనిచ్చే మొక్కలు

### - సంతకాలు లేకుండా నగదు జమ - పీడీ జోసఫ్ కుమార్

**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



మండలంలోని వివిధ గ్రామాల్లో ఎక్కువ శాతం పండ్ల మొక్కల స్థానంలో నీడనిచ్చే మొక్కలు కొద్దిమేర మాత్రమే ఉన్నాయని ఎస్ఆర్‌పీ రామచంద్రారావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక డ్వామా పీడీ జోసఫ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం గ్రామాల వారీగా నిర్వహించిన తనిఖీల్లో భాగంగా వచ్చిన అంశాలను గ్రామాల వారీగా చదివి వినిపించారు. అందులో భాగంగా ఎక్కువ శాతం పండ్ల మొక్కలు వేసినట్లు బిల్లులు చేశారని అవి ఎక్కడ లేవని ఉన్న కొద్దిపాటి మొక్కలు కూడా నీడ నిచ్చే మొక్కలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా అనేక గ్రామాల్లో సంతకాలు లేకుండా కూలీ డబ్బులు జమ చేశారని మస్టర్లు తక్కువ ఉంటే ఎక్కువ రోజులకు కూలీ డబ్బులు చెల్లించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ పండ్ల మొక్కలు నాటేటప్పుడు తీసిన ఫొటోలనే ప్రామాణికంగా తీసుకోవాలని అప్పుడు వేసిన మొక్కలు లేవని ఫీల్డ్ అసిస్టెంట్‌లను బాధ్యులను చేయడం సరైన పద్దతికాదన్నారు. వారికి రైతువారి కుంటలు గోకుళం షెడ్ల నిర్మాణం తదితర రకాల పనులు అప్పచెప్పడంతో వాటిని చూస్తారా మొక్కల బాధ్యత చూస్తారా అన్నారు. ప్రతి సచివాలయంలో ఉద్యానవనశాఖ అసిస్టెంట్‌లు ఉన్నారు. మొక్కలు బాధ్యత వారికి అప్పగించవచ్చు కదా ఎస్ఆర్‌పీలు డీఆర్‌పీలు మంచి వాళ్ళు మేము చెడ్డ వాళ్ళమా అని ఆవేదన వ్యక్తం శారు. తద్వారా ప్రజా వేదిక చప్పగా సాగింది. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ఒండర్ మ్యాన్, ఎంపీడీఓ వై.మహాలక్ష్మి, ఏపీవో రవిబాబు, టెక్నికల్ అసిస్టెంట్‌లు , ఈసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, వివిధ గ్రామాల క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కెట్‌కి అనుగుణంగా బేళ్లు తీసుకురావాలి - రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు

**టంగుటూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణ రావు టంగుటూరు వేలం కేంద్రాన్ని సందర్శించి పొగాకు వేలం పక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు మాట్లాడుతూ రైతులు అందరూ మండెలలో మగ్గిన పొగాకునే బేళ్లు కట్టుకుని అమ్మకానికి తీసుకురావాలని తెలిపారు. అలాగే మార్కెట్‌కి అనుగుణంగా బేళ్లు తీసుకురావాలని సూచించారు. బేళ్లు అమ్మకానికి తెచ్చేటప్పుడు తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న మార్కెట్ దృష్ట్యా తెలపరి పొగాకు, నీళ్లు కట్టిన పొగాకును తీసుకురావద్దని తెలిపారు. కొన్ని కంపెనీ వాళ్లు కొనుగోలు చేసిన బేళ్ళలో అన్య పదార్థాలు ఉన్నందున కస్టమర్స్ వాటిని తిరస్కరించారని తెలిపారు. అందువలన రైతులందరూ తమ బేళ్లలో ఎటువంటి పొగాకేతర అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. కంపెనీ కొనుగోలు దారులకు అన్ని రకాల గ్రేడ్ పొగాకును కొనుగోలు చేయాలని తెలిపారు. అలాగే రైతులు తీసుకువచ్చిన బేళ్ళు అన్నింటిని నో బిడ్స్ లేకుండా మంచి సరాసరి ధరతో కొనుగోలు చేయాలని కంపెనీ వాళ్ళకి సూచించారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

**దర్శి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



దర్శి పట్టణంలోని ప్రధాన డ్రైన్లపై ఉన్న ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులను తొలగించి నూతన కల్వర్టులను నిర్మిస్తున్న పలు వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య. ఈ కార్యక్రంలో మూడో వార్డు కౌన్సిలర్ ఇత్తడి సునీత, దినకర్, టీడీపీ నాయకులు శ్రీనాథ్, అంజి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కల్తీ పాలు తయారు చేస్తే కఠిన చర్యలు

**దర్శి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**





దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల పరిధిలో గతంలో పాలు కల్తీ జరిగింది. కాబట్టి ఇప్పుడు కూడా ఆ విధంగా ఎవరైనా కల్తీ పాలు తయారు చేస్తున్నారని పూర్తి స్థాయిలో నిఘా బెట్టి అటువంటి వారిపైన కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ వై.రామారావు ఆధ్వర్యంలో ఒక ప్రణాళిక రచించుకుని గత పది రోజుల నుండి ఆకస్మిక దాడులు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సాధారణంగా కల్తీ పాలు తయారు చేయడానికి కొంత మంది గతంలో పామాయిల్, యూరియా, ఇంకా ఇతరత్ర హానికర పదార్థాలను కలిపి వారికి సహజంగా వచ్చిన పాలకంటే రెండింతలు పాలు తయారు చేసి కేంద్రానికి పోసేవారని, సమాజంలో పుట్టిన పసిబిడ్డ దగ్గర నుండి ముసలి వారి వరకు కూడా పాలు ఆహారంగా తీసుకుంటా ఉంటారు, దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరికి పాలు ఎంతో అవసరం అని, అటువంటి పాలు కల్తీ చేయడం అంటే అమానవీయం అని అన్నారు. కాబట్టి గ్రామాల్లో రైతాంగం డబ్బులకు ఆశ పోయి ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దర్శి సర్కిల్ పరిధిలో ప్రతి రోజు కూడా గ్రామాల్లో గాని పాల కేంద్రాల్లో గాని డైరీలలో పోలీసు వారి నిఘా పెట్టి ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.

## పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి - సీపీఎం డిమాండ్

**దర్శి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మంగళవారం నుంచి బండపై ఒక్క సారిగా 50 రూపాయలు పెంచడం చాలా దుర్మార్గమని పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెల్లంపల్లి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్యాస్ రేట్లు తగ్గించాలని కోరుతూ శంకరాపురం, ముండ్లమూరులలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంబానీ, ఆదానీలకు ప్రభుత్వ రంగ పరిశ్రమని దారాదత్తం చేస్తూ వారిని కుబేర్లుగా చేస్తూ ప్రజలపైన భారాలు మోపుతున్నారని విమర్శించారు. పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశాఉ. ఈ కార్యక్రమంలో బి.హనుమంతరావు, జి.సత్యం, రమేష్, ఎర్రయ్య, హనుమయ్య, వెంకటయ్య, నరసింహారావు, శ్రీను, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## మహాత్మజ్యోతిరావుపూలేకు ఘన నివాళి

**చీరాల, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



మహాత్మజ్యోతిరావుపూలే 198వ జయంతి సందర్భంగా చీరాల వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ కరణం వెంకటేష్‌బాబు సూచనలతో చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు గవిని శ్రీనివాసరావు, చీరాల నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు సాధు రాఘవ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు యాతం మేరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన

## కిరణ్‌పై చర్యలు తీసుకోవాలి

**కనిగిరి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మను ఉద్దేశించి ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు తీవ్రంగా ఖండిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిరసనగా కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ ఆధ్వర్యంలో వైసీపీశ్రేణులు నిరసన తెలిపారు. శుక్రవారం నల్లబ్యాడ్జీలతో పామూరు బస్టాండ్ సెంటర్ నందు నిరసన తెలియజేసి తదనంతం కనిగిరి పోలీసు స్టేషన్‌కు ర్యాలీ గా వెళ్లి చేబ్రోలు కిరణ్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గఫూర్, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, లక్ష్మీకాంతం, పులి శాంతి, తమ్మినేని సుజాత, ఆదినారాయణరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, కటికల వెంకటరత్నంలు ఉన్నారు.

## వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు : దద్దాల

**కనిగిరి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం విలేకర్ల సమావేశంలో తీవ్రంగా విమర్శించారు. ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ చేసిన వ్యాఖ్యలు అమర్యాదకరమైనవే కాకుండా, మహిళల గౌరవాన్ని తక్కువ చేసేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఘటన పాయింట్ బ్లాక్ టీవీ ద్వారా ముందుగా రచించబడిన ప్రణాళిక ప్రకారమే జరిగిందని, వీడియో చిత్రీకరణ, ఇంటర్వ్యూ కూడా అందులో భాగమేనని ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై ఈ తరహా వ్యాఖ్యలు మన్నించదగినవి కావని, ఇటువంటి చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చర్యలు తీసుకోకపోతే, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్దంగా ఉన్నామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## పారిశుధ్యం పట్ల అలసత్వం వహించరాదు : ఛైర్మన్ గఫార్

**కనిగిరి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



పారిశుధ్యం పట్ల అలసత్వం వహిస్తే ప్రభుత్వ పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం కనిగిరి పట్టణంలోని 14వ వార్డులోని లాడే సాహెబ్ బజార్‌లో ఆయన పర్యటించగా వార్డుల్లో పారిశుధ్యం చేయుట లేదని డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించడం చేయుట లేదని ప్రజలు విన్నవించుకోగా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో ఎక్కడా కూడా అపరిశుభ్రంగా ఉండకుండా చూడాలని ప్రజలు నుండి ఫిర్యాదులు వచ్చినట్లయితే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులలో పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం చేయరాదని, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించరాదని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఆరోగ్య సిబ్బంది డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు పట్ల నిర్లక్ష్యంగా ఉండి ప్రజలకు పరిసరాలు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించకపోతే విష జ్వరాలైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పారిశుధ్యం ఆరోగ్యం, జీవన ప్రమాణాలకు సంబంధించినది కాబట్టి ప్రతి ఒక్కరూ పారిశుధ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రఘునాయక స్వామి కళ్యాణ వేడుక ఏర్పాట్లను పర్యవేక్షించిన సీఐ

**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



మండలంలోని చదలవాడలోని శ్రీ రఘునాయక స్వామి కళ్యాణ వేడుకలు ఈనెల 14న జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, నాగులుప్పలపాడు ఎస్సై బి.శ్రీకాంత్‌లు శుక్రవారం పర్యవేక్షించారు.

**చోరీకి గురైన స్వామివారి వస్తువులు అప్పగింత:**

గత సంవత్సరవం జనవరి 27వ తేదీన చదలవాడలోని శ్రీరఘునాయక స్వామివారి



దేవస్థానంలో జరిగిన దొంగతనం కేసులో చోరీకి గురైన స్వామివారి వస్తువులను ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్, ఎస్సై బి.శ్రీకాంత్‌లు రికవరీ చేసి ఆలయ ఈవోకి శుక్రవారం అందజేశారు. 5కేజీల వెండి ముద్ద, 400 గ్రాముల వెండి పళ్లెం, సీతమ్మ వారి రెండు బంగారు మంగళసూత్రాలను అందజేశారు.

## పోషకాహారం తప్పనిసరి - సూపర్‌వైజర్ ఉషారాణి

**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య పోషకాహారాన్ని తప్పనిసరిగా అందించాలని సూపర్‌వైజర్ ఉషారాణి తెలిపారు. శుక్రవారం నాడు నాగులుప్పలపాడులో జరిగిన పోషణ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నతుడు పూలే

**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



అణగారిన వర్గాల ప్రజల్లో చైతన్యం నింపి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు మహాత్మజ్యోతిరావు పూలే అని ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి కొనియాడారు. పూలే 199వ జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో పూలమాలలతో ఎంపీపీ దంపతులు అంజమ్మ కృష్ణారెడ్డి పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ దక్షిణామూర్తి, పార్టీ నాయకులు పోలినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ పొద పవన్, సర్పంచ్ ఘట్టమనేని అశోక్, నాయకులు జి.వెంకటరావు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, పాదర్తి శివ, అత్తంటి యేసు. వెంకట్రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలి

**కొత్తపట్నం, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలంలోపేదల సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని, పట్టాలు ఇచ్చిన భూములను ఆన్లైన్ చేయాలని, పేదలకుఇల్లాస్థలాలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల డబ్బులు బకాయి చెల్లించాలని, ఆటో కార్మికులకు స్టాండ్ ఏర్పాటు చేయాలని ఈ సమస్యల పరిష్కారం కొరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కొత్తపట్నం తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది ఈ ధర్నాకు పి. ప్రకాశం అధ్యక్షత వహించారు .ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకురాలు కె రమాదేవి మాట్లాడుతూ మండలంలో పేదల సాగు చేసుకుంటున్నా భూ సమస్యను పరిష్కరించాలని ముఖ్యంగా ఈతముక్కలు పేదలు 40 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న సోమర్పపాడు భూ సమస్యను వెంటనే రీ సర్వే చేసి సాగుదారులుగా గుర్తించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తపట్నం ఆటో కార్మికులకు స్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిశారు .సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ స్వామిరెడ్డి మాట్లాడుతూ 1204 సర్వే నెంబర్లు ఉప్పు కొటారు భూములను ఆన్లైన్ ఎక్కించాలని మండలంలో అనేక గ్రామాల్లో పేదలకు పట్టాలి ఇచ్చి ఆన్లైన్ ఎక్కించలేదని వెంటనే ఆన్లైన్ చేయాలని అదేవిధంగా మండలంలో ఆరు వారాల నుండి పది వారాల వరకు ఉపాధి పెండింగ్ బిల్లులు ఆగిపోయి ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ మధుసూదనరావు ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ మీ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధి పెండింగ్ బిల్లుల సమస్యను ఉపాధి ఏపీఓ కే నాగరాజు మాట్లాడుతూ ఈ వారంలో డబ్బులు వచ్చేటట్లు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి కృష్ణ, కే శీను, పి జై బాబు, జి జాను, సుబ్బులు సులోచన మొదలగు వారు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలి

**చీరాల, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**

భవన నిర్మాణ సంక్షేమసంఘం బోర్డును ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం తక్షణమే పునరుద్దరించాలని ఏఐటీయుసీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. శుక్రవారం చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏఐటీయుసీ చీరాల నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు మాట్లాడుతూ ఏఐటీయుసీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని అన్నారు. ఇప్పటికి ఏఐటీయుసీ పోరాటాలతో ఎన్నో విజయాలు సాధించామని ఇప్పటికి ప్రజల పక్షాన పోరాడుతూ కార్మికులకు అండగా ఏఐటీయుసీ నిలబడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష హోదాలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్దరిస్తామని హామీ ఇచ్చిందని అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికి నేటి ఇచ్చిన హామీ నెరవేర్చలేదని అన్నారు. నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం మంజూరు చేయాలని, నూతనంగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ చీరాల నియోజకవర్గ అధ్యక్షులు దేవతోటి నాగేశ్వరరావు, కార్యదర్శి బాసి పైడయ్య, సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకటరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిరమల ప్రకాష్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకురాలు జొన్నాదుల భారతి, సివిల్ సప్లయర్స్ యూనియన్ నాయకులు రమణయ్య, శాంతి, రుతుమ్మ, వీరమ్మ, ఆటోవర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాపై చైనా 125%సుంకాలు



**బీజింగ్, ఏప్రిల్ 11:** యూఎస్ చైనా మధ్య వాణిజ్యయుద్ధం మరింత ముదురుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా ఎగుమతులపై 145 శాతం విధించినందుకు ప్రతీకారంగా, చైనా శుక్రవారం అమెరికా దిగుమతులపై సుంకాలను ఏకంగా 125శాతానికి పెంచింది. ఇంతకు ముందు అమెరికన్ దిగుమతులపై చైనా 84 శాతం వరకు సుంకాలు విధించింది. దీనితో యూఎస్ దిగుమతులపై చైనా కొన్ని ఆంక్షలు విధించింది. తరువాత ఈ సమస్య పరిష్కారానికి డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరపడానికి కూడా సిద్ధమైంది. అయితే ట్రంప్ మొండి వైఖరితో చైనా తీరులో మార్పు వచ్చింది. తాము ఎక్కడా తగ్గబోమని స్పష్టం చేసింది. తాజాగా అమెరికా దిగుమతులపై సుంకాలను 125 శాతానికి పెంచినట్లు చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ తెలిపింది. అమెరికా సుంకాలు పెంచడంపై తాము కూడా డబ్ల్యూటీఓలో దావా వేసినట్లు చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. తాజా అమెరికా టారిఫ్ నోటిఫికేషన్ ప్రకారం, చైనాపై మొత్తం వాణిజ్య సుంకాలు 145 శాతంగా ఉన్నాయి. వాస్తవానికి ట్రంప్ చైనా, భారత్‌తో సహా చాలా దేశాలపై ప్రతీకార సుంకాలు విధించారు. కానీ ఏ దేశం కూడా యూఎస్‌పై ప్రతీకార సుంకాలు విధించేందుకు సిద్ధపడలేదు. కానీ ఒక్క చైనా మాత్రం అమెరికాను ఢీకొంటూ పోటాపోటీగా ప్రతీకార సుంకాలు విధిస్తోంది. రెండు దేశాలూ పోటాపోటీగా ఒకరిపై ఒకరు సుంకాలు విధించుకుంటున్నాయి. డ్రాగన్‌పై అమెరికా 145 శాతం ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఇక ట్రంప్ బెదిరింపులకు చైనా సైతం ఏమాత్రం వెనకడుగు వేయట్లేదు. అగ్రరాజ్యంపై ప్రతీకార సుంకాలతో దాడి చేస్తోంది. గతంలో అమెరికా దిగుమతులపై సుంకాలు 84 శాతానికి పెంచిన డ్రాగన్.. ఇప్పుడు మరింత పెంచింది. అమెరికాపై 125 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించింది. ఇటీవల పెంచిన పన్నుతో ఇది 54 శాతానికి చేరుకున్నది. దీనిపై డ్రాగన్ దీటుగా స్పందించింది. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది దీనిపై ఆగ్రహించిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గాలంటూ డ్రాగన్‌కు వార్నింగ్ ఇచ్చారు. మరో 50 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో టారిఫ్‌లు 104 శాతానికి చేరాయి. అయినా చైనా వెనక్కి తగ్గలేదు. అమెరికాపై 84 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. ట్రంప్ హెచ్చరికలను చైనా పెడచెవిన పెట్టడంతో మళ్లీ అదనపు సుంకాల పోటు తప్పలేదు. చైనా నిర్ణయంతో ట్రంప్ బుధవారం మరో 21 శాతం బాదారు. దీంతో చైనాపై ప్రతీకార సుంకాలు 125శాతానికి చేరింది. ఇక ఫెంటానిల్ అక్రమ రవాణాలో చైనా పాత్ర ఉందన్న ఆరోపణలకుగాను ప్రత్యేకంగా 20 శాతం సుంకాలు విధించడంతో మొత్తం టారిఫ్‌లు 145 శాతానికి చేరింది. మొత్తానికి ఈ పరస్పర సుంకాలతో ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత పెరిగినట్లయింది. మరోవైపు అమెరికాసుంకాల యుద్ధమే చేయాలనుకుంటే తుదివరకూ తామూ పోరాడతామని చైనా స్పష్టంచేసిన విషయం తెలిసిందే. అమెరికా చర్చలకు రావాలంటే తమ తలుపులు తెరిచే ఉంటాయని వెల్లడించింది. తాము ఘర్షణకు ప్రయత్నించబోమని, ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కోవడానికైనా వెనుకాడబోమని స్పష్టం చేసింది. 'చైనా వైఖరిస్పష్టంగా, స్థిరంగా ఉంది. కవ్వింపు చర్యలకు భయపడం. అమెరికా మాట్లాడాలనుకుంటే మా తలుపులు తెరిచే ఉంటాయి. కానీ పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా సంభాషణ జరగాలి. చైనాతో డీల్ చేయాలంటే ఒత్తిడి, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ వంటివి పనిచేయవు' అని చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి హి యోంగ్కియాన్ అన్నారు.




## ప్రపంచదేశాలపై టెక్నాలజీ, టారిఫ్‌ల ప్రభావం:జైశంకర్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో రెండు టీలు కీలకంగా పనిచేస్తున్నాయని విదేశాంగమంత్రి జైశంకర్ అన్నారు. టెక్నాలజీ, ట్యారిఫ్‌లపై ఆయన వ్యంగ్యోక్తులు విసిరారు. మారుతున్న పరిస్థితుల క్రమంలో టిపదం చర్చించేందుకు సమావేశం అయ్యామన్నారు. ప్రపంచంతో అనుసంధానమయ్యే విధానాన్ని యుఎస్ ప్రాథమికంగా మార్చేసింది. దాంతోప్రపంచంపై దానిపరిణామాలుకూడా ఉంటాయి. ముఖ్యంగా టెక్నాలజీరంగంలో అవి మరింత తీవ్రంగా ఉంటాయి. అమెరికా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండటం ఒకటే అందుకు కారణంకాదు. దాంతోపాటు ఆదేశ సాంకేతిక పురోగతి అత్యంతకీలకం. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చడంలో టెక్నాలజీ కీలకంగా పనిచేస్తోందన్నారు. అందుకే మేక్ అమెరికా గ్రేట్ అగైన్(మాగా)కు టెక్‌కు మధ్య సంబంధంఉంది. 2016 నుంచి 2020 వరకూ ఇది అంత స్పష్టంగా లేదని అన్నారు. చైనా స్థిరమైన ఎదుగుదలను ప్రస్తావిస్తూ ఐరోపాలో నెలకొన్న ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు కూడా ప్రస్తావించారు. టారిఫ్=పరంగా ట్రంప్ కఠినవైఖరి ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపిస్తోందని అన్నిచోట్ల టారిఫ్ పదమే ఘోషిస్తోందన్నారు. అలాగే ఇపుడు సాంకేతికరంగంలో కృత్రిమమేధ ఎక్కువ వినిపిస్తోందని అమెరికా, చైనా పోటాపోటీగా ముందుకు వెళుతున్నాయని, దేశ ఎదుగుదలలో టెక్నాలజీ పాత్ర అత్యంత కీలకమనే ఉద్దేశంలో తాజాగా మంత్రి మాట్లాడారు.

# అత్యాచారఘటనపై ప్రధాని సీరియస్

## కఠిన చర్యలు తీసుకోవాలని వారణాసి కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు



**వారణాసి, ఏప్రిల్ 11:** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో చోటుచేసుకున్న దారుణ సామూహిక అత్యాచారఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రధాని మోడీ అన్నారు. ఆరు రోజులపాటు 23 మంది వ్యక్తులు 19ఏళ్ల యువతిపై అత్యాచారం చేయడం అమానవీయ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం వారణాసి కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసారు. వారణాసికి వచ్చిన వెంటనే ఈఘటనపై మోడీ ఆరా తీసారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని ఆదేశించారు. గతనెల 29వ తేదీ బాధిత యువతి కొంత మంది స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. దాంతో సామూహిక అత్యాచారం గురించి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఆ యువతి వెల్లడించిన వివరాలప్రకారం కొందరు యువకులు తనను పలు హోటళ్లు, హుక్కాబార్లకు తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది. దర్యాప్తులో పోలీసులు తొమ్మిదిమందిని అరెస్టు చేసారు. కోర్టు వారిని జ్యుడిషియల్ కస్టడీకి పంపించింది. ఇదిలా ఉండగా వారణాసి పర్యటనలో భాగంగా బహిరంగసభలోమోడీ పాల్గొన్నారు. 70 ఏళ్ల దాటిన ముగ్గురులబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందచేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాశీనాది. నేను కాశీకి చెందినవాడిని అని కార్యకర్తలనుద్దేశించి అన్నారు. వారణాసి మోడీ సొంత నియోజకవర్గం. 2014 నుంచి ఇప్పటివరకూ మూడుసార్లు అక్కడి నుంచి విజయం సాధించారు.

# హిందువులపై తమిళమంత్రి అవమానకర వ్యాఖ్యలు

**చెన్నై,ఏప్రిల్ 11:** హిందువులు నుదుట పెట్టుకునే తిలకం ఆచారంపై మంత్రి అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. వేశ్యతో ముడిపెట్టి ఒక జోక్ వేశారు. దీంతో ఆ మంత్రిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పార్టీ పదవి నుంచి ఆయనను తొలగించారు. తమిళనాడు అటవీ శాఖ మంత్రి, సీనియర్ డీఎంకే నేత కే పొన్ముడి ఇటీవల ఒక బహిరంగ కార్యక్రమంలో మాట్లాడారు. హిందూ మతపరమైన బొట్టును శృంగారంతో ముడిపెట్టారు. 'మహిళలు, దయచేసి అపార్థం చేసుకోకండి. ఒక వ్యక్తి ఒక వేశ్య వద్దకు వెళ్తాడు. అతడు శైవుడా లేదా వైష్ణవుడా అని ఆమె అడిగింది. అతడికి అర్థం కాకపోవడంతో ఆమె స్పష్టత ఇచ్చింది. అడ్డ బొట్టు లేదా నామం వైష్ణవానికి సంబంధించిన నిలువు తిలకం అతడు ధరిస్తాడా అని అడిగింది. ఆ వ్యక్తి శైవుడైతే 'పడుకునే' పొజిషన్, వైష్ణవుడు అయితే 'లేచి నిలబడే' పొజిషన్ ఉంటుందని ఆమె వివరించింది' అని జోక్ వేశారు. కాగా, డీఎంకే మంత్రి పొన్ముడి వివాదస్పద వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. డీఎంకే ఎంపీ కనిమొళి కూడా ఆయన వ్యాఖ్యలను ఖండించారు. 'మంత్రి పొన్ముడి సంగం ఆమోదయోగ్యం కాదు. ప్రసంగానికి కారణం ఏమైనప్పటికీ, అలాంటి అసభ్యకరమైన వ్యాఖ్యలు ఖండించదగినవి' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. బీజేపీ నాయకురాలు ఖుష్బు సుందర్, సింగర్ చిన్మయి శ్రీపాద తదితరులు ఘాటుగా విమర్శించారు. మరోవైపు డీఎంకే కూడా వేగంగా స్పందించింది. పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పదవి నుంచి పొన్ముడిని తొలగించింది. ఆయన స్థానంలో ఎన్ శివను నియమించింది. కాగా, 2011 నాటి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పొన్ముడికి విధించిన శిక్షను సుప్రీం కోర్టు గత ఏడాది నిలిపివేసింది. దీంతో సీఎం స్టాలిన్ ఆయనను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అయితే పొన్ముడి వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ పదవి నుంచి ఆయనను తప్పించినప్పటికీ మంత్రి పదవి నుంచి తొలగించలేదు.

# హంతకుడిని పట్టించిన ముక్కుపుడక!



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** దేశరాజధాని నగరంలో నెల రోజులక్రితం జరిగిన ఒక హత్యకేసును పోలీసులు ఛేదించారు. మృతురాలు శరీరంపై ఉన్న ముక్కుపుడకనే ఈకేసు ఛేదనకు కీలకంగా ఉపయోగపడింది. ముక్కుపుడక ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఢిల్లీలోని అనిల్‌కుమార్ అనే వ్యాపారి భార్య సీమాసింగ్‌ను నెలరోజులక్రితం గొంతునులిమి హత్యచేసాడు. ఆ తర్వాత మృతదేహాన్ని బెడ్ షీట్‌లో చుట్టి దానికి రాళ్లు, ఇటుక కట్టి కారులో తీసుకెళ్లి దక్షిణ ఢిల్లీలోని మురుగుకాల్వలో పడేశాడు. గతనెల 15న కాల్వలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దాంతో ఘటనాస్థలానికి చేరుకన్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. పోస్టుమార్టంలో ఆమెను గొంతునులిమి చంపినట్లు తేలింది. కానీ మృతురాలు ఎవరనేది గుర్తించడం కష్టం అయింది ఈ క్రమంలోపోలీసులు ఆమె ఒంటిపై లభించిన ముక్కుపుడకపై పడింది. దక్షిణ ఢిల్లీలోని ఒక జ్యుయెలరీ దుకాణంలో ఆముక్కుపుడకను చూపిస్తే అది తామే అమ్మినట్లు జ్యుయలరీ యజమాని గుర్తించారు. బిల్లును తీస్తే అది అనిల్‌కుమార్‌పేరిట ఉంది. అనిల్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు ఇంటరాగేషన్‌చేస్తే నేరం అంగీకరించాడు. సీమాసింగ్‌పుట్టింటివివరాలు తెలుసుకున్న పోలీసులు ఈనెల 1న వారిని పిలిపించి మృతదేహాన్ని గుర్తించాలనికోరారు. దాంతో సీమాసింగ్ సోదరి, కుమారుడు ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ఆ తర్వాత వారికి సీమాసింగ్ భౌతికకాయం అప్పగించారు. సోదరి బబితాసింగ్ మాట్లాడుతూ పోలీసులు చెప్పే వరకూ తమ సోదరి హత్య జరిగిందన్న విషయం దాచి పెట్టారన్నారు. గతనెల 11న చివరిసారి సీమాకు ఫోన్ చేసానని కానీ అనిల్ మాట్లాడాడని బబిత చెప్పింది. ప్రస్తుతం సీమా మనసు బాగోలేదని మాట్లాడే మూడ్‌లో లేదని ఆమె మంచి మూడ్‌లోకి వచ్చినపుడు తానే మాట్లాడిస్తానని అనిల్‌కుమార్ చెప్పినట్లు ఆమె వెల్లడించింది. కానీ పోలీసులు హత్యవార్త చెప్పే వరకూ అనిల్‌కుమార్ ఫోన్ చేయించలేదని తెలిపింది.



## ఆనాటి ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాం: అసోం సిఎం


**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** ముంబయి ఉగ్రదాడి ప్రధాన కుట్రదారుడు తహవ్వుర్‌హుస్సేన్ రాణాను ఎన్ఐఎ ఢిల్లీ తీసుకువచ్చిన క్రమంలో అస్సాం సీఎం ఆనాటి భయంకర సంఘటనలు గుర్తుచేసుకున్నారు. ఉగ్రదాడులు జరిగిన రోజున తాను ముంబయి తాజ్ హోటల్‌లో బసచేయాల్సి ఉండగా షెడ్యూలు మారడంతో మరో హోటల్‌లో దిగానని తెలిపారు. దాంతో ఆ దాడులనుంచి తృటిలో తప్పించుకోగలిగానని అన్నారు. ఎన్ఎస్జీ ఆపరేషన్ ఇంకా తన కళ్ల ముందే మెదులుతోందని కర్మ సిద్ధాంతం ప్రకారం ఉగ్రదాడుల వెనక ఉన్న సూత్రధారులకు ఏదోఒకరోజు శిక్షపడుతుందని తాను భావించినట్లు తెలిపారు. పదహారేళ్ల తర్వాత తహవ్వుర్ రాణాను దేశంలో చూస్తుంటే న్యాయవ్యవస్థపై మరింత విశ్వాసం పెరుగుతోందన్నారు. కేంద్రంలో ఉన్న బలమైన నాయకత్వం ఇటువంటి చర్యలు తీసుకోవడంద్వారా భారత్‌పై దాడులుచేయాలంటే ముష్కరులు రెండోసారి ఆలోచిస్తారని హిమంత బిశ్వశర్మ తన సోషల్ మీడియాలో పోస్టుచేసారు. ప్రపంచాన్ని వణికించిన ముంబయి ఉగ్రదాడి ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్‌రాణా పాకిస్థాన్ మూలాలున్న కెనడా జాతీయుడు. ముంబయి దాడుల కుట్రదారుగా భారత్ ఆధారాలు ఇవ్వడంతో రాణాను 2009 అక్టోబరులో ఎఫ్‌బిఐ అరెస్టుచేసింది. చికాగాలో ఆతడిని పట్టుకుంది. అయితే తనకు ఇందులోభాగస్వామ్యంలేదని కేసునుంచి తప్పించుకున్నాడు. 2011లో మరో కేసులో ఆతడు అరెస్టు కావడంతో 14 ఏళ్ల జైలు శిక్షపడింది. అప్పటినుంచి భారత్ ఆతడికోసం ప్రయత్నిస్తోంది. రాణాను భారత్‌కు అప్పగించడానికి ట్రంప్ అంగీకరించిన క్రమంలో అక్కడి అధికారులు ఆతడిని ఎన్ఐఎకు అప్పగించారు.

# అన్నాడిఎంకెతో బిజెపి పొత్తు: అసెంబ్లీ ఎన్నికల్లో కలిసే పోటీ

## తమిళనాడు బిజెపి చీఫ్‌గా నయినార్ నాగేంద్రన్

**చెన్నై, ఏప్రిల్ 11:** తమిళనాడు ప్రతిపక్షపార్టీ అన్నాడిఎంకె, భారతీయ జనతాపార్టీల మధ్య పొత్తులు కుదిరాయి. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రెండుపార్టీలు కలిసి పోటీచేస్తాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. మాజీ సీఎం ఎడప్పాడి పళనిసామి నేతృత్వంలో రాష్ట్రంలో ఎన్నికల్లోపోటీచేస్తామని ఆయన స్పష్టంచేసారు. చర్చల అనంతరం జరిగిన మీడియాతోమాట్లాడిన అమిత్‌షా పొత్తులపై స్పష్టత ఇచ్చారు. మాజీసీఎం పళనిసామి మాట్లాడుతూ రెండుపార్టీలు గతంలో పొత్తులు పెట్టుకున్నాయన్నారు. రెండుపార్టీలు కలిసే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి వెళతాయన్నారు. అవసరమైన రెండుపార్టీలు కనీస ఉమ్మడి ప్రణాళికను రూపొందించుకుంటాయని అమిత్‌షా చెప్పారు. అన్నాడిఎంకెకి ఎలాంటి షరతులు, డిమాండ్లు లేవని, ఆపార్టీ అంతర్గత విషయాల్లో తాము జోక్యంచేసుకోమని ఈకూటమి ఎన్డీయేకి అన్నా డిఎంకెకి రెండింటికి ప్రయోజనకరంగా ఉంటుందని అమిత్‌షా చెప్పారు. 1988లో దివంగతమాజీ సీఎం జయలలిత నేతృత్వంలో బిజెపి అన్నాడిఎంకె పార్టీలు పొత్తులు పెట్టుకున్నపుడు లోక్‌సభలో భారీ విజయం నమోదుచేసాయని అమిత్‌షా అన్నారు. ఒక దశలో ఈక ఊటమి తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలకు 30 స్థానాలు గెలుచుకుందన్నారు. తమిళనాడు ఎన్నికల్లో ఎన్డీయే సులువుగా గెలుస్తుందని షా ధీమా వ్యక్తంచేసారు. ఇక సీట్లపంపిణీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రిత్వశాఖల పంపిణీ రెండూ కూడా తర్వాత నిర్ణఇస్తామని అమిత్‌షా అన్నారు. తమిళనాడులో నిజమైన సమస్యల నుంచి దృష్టిమళ్లించడానికి డిఎంకె సనాతన ధర్మ, త్రిభాషా విదానం వంటి వాటిని లేవనెత్తుతోందని ఆయన విమర్శించారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకె అవినీతి, శాంతిభద్రతల సమస్యలు, దళితులు మహిళలపై దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలుఓటేస్తారని చెప్పారు. రూ.39వేలు కోట్లమధ్యం కుంభకోణం, ఇసుక తవ్వకాల కుంభకోణం, ఎస్సీటీఓ స్కామ్, రవాణా కుంభకోణాలను డిఎంకె పార్టీచేసిందని అమిత్‌షా దుయ్యబట్టారు. తమిళనాడుప్రజలకు డిఎంకెపార్టీ, సీఎం స్టాలిన్ ఆతడి కొడుకు ఉదయనిధి స్టాలిన్ సమాధానాలు చెప్పాలని డిమాండ్‌చేసారు.

**తమిళనాడు బిజెపి చీఫ్‌గా నాగేంద్రన్:** కాగా తమిళనాడు బిజెపి అధ్యక్ష ఎన్నికల బరిలో తాను లేనని ఇటీవల ప్రస్తుత చీఫ్ అన్నామలై ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈపదవికి తిరునల్వేలి బిజెపి ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ నామినేషన్‌పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. టినగర్‌లోని రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయన ఒక్కరే నామినేసన్ దాఖలుచేయడంతో ఆయన ఎన్నిక లాంఛనమేనని వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర అధ్యక్షపదవికి నాగేంద్రన్ పేరును అన్నామలై, కేంద్ర మంత్రి ఎల్‌మురుగన్, కేంద్రమాజీ మంత్రిపోన్ రాధాకృష్ణన్‌తోపాటు మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్‌లు ప్రతిపాదించారు. ఇదిలా ఉండగా బిజెపి అధ్యక్షుడు అన్నామలై సేవలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశంసించారు. ఆయన పనితీరుప్రశం సనీయమని, ప్రధానిమోడీ విధానాలనుప్రజలకు చేరవేయడంలోనైనా, పార్టీ కార్యక్రమాలను గ్రామగ్రామానికి తీసుకెళ్లడం లోనైనా ఆయన పనితీరు కృషి అపూర్వమని కొనియాడారు. అన్నామలై సంస్థాగత నైపుణ్యాలను పార్టీ జాతీయ స్థాయిలో వినియోగిం చుకుంటుందని ఆయన అన్నారు.





# ఇడికి ప్రాథమిక హక్కుంటే.. జనం గురించి ఆలోచించాలి: సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కు ప్రాథమిక హక్కులుంటే.. ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. నాగరిక్ అపుర్తి నిగమ్ (ఎన్ఎఎన్) స్కామ్ దర్యాప్తును ఛత్తీస్‌గఢ్ నుంచి ఢిల్లీకి బదలీ చేయాలని ఇడి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 అనేది వ్యక్తుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిన సమయంలో కోర్టులను ఆశ్రయించి వాటిని పునరుద్ధరించుకోవడానికి అవకాశం కల్పిస్తుందని బెంచ్ పేర్కొంది. రాజ్యాంగం ద్వారా పరిష్కారాలు పొందే హక్కును కల్పిస్తుందని గుర్తు చేసింది. బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసిన తర్వాత సోలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు స్పందిస్తూ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరారు. అదే సమయంలో మాట్లాడుతూ 'ఇడికి కూడా ప్రాథమిక హక్కులు ఉంటాయి' అని వ్యాఖ్యానించారు. దీనికి బెంచ్ స్పందిస్తూ 'ఇడికి ప్రాథమిక హక్కులు ఉంటే.. అది ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఆలోచించాలి.' అని చురకలు అంటించి.. పిటిషన్ ఉపసంహరణకు అనుమతించింది.

ఈ కేసులో నిందితుడైన మాజీ ఐఎఎస్ అధికారికి గతేడాది మంజూరైన ముందస్తు బెయిల్ దుర్వినియోగమైందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది. దీనికి తోడు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని ఏజెన్సీలు ఓ హైకోర్టు జడ్జితో టచ్‌లో ఉంటున్నాయని పేర్కొంది. దీంతో మనీలాండరింగ్ కేసులోని కొందరు నిందితులకు న్యాయపరంగా ఉపశమనం కల్పిస్తున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అప్పట్లో ఈ ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఈ కేసులో అత్యున్నత స్థాయి వ్యక్తులకు కేటాయించిన ముందస్తు బెయిళ్లను కూడా రద్దు చేయాలని ఇడి కోరుతోంది. దీంతోపాటు కేసును ఢిల్లీకి బదలీ చేయాలని పిటిషన్ దాఖలు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థ కార్యక్రమాలను పర్యవేక్షించే నాగరిక్ అపుర్తి నిగమ్ కార్యాలయాలపై 2015లో రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ దాడులు చేసి, రూ. 3.6కోట్ల నగదు స్వాధీనం చేసుకొంది. బియ్యం నమూనాలు చాలా నాసిరకంగా ఉన్నట్లు గుర్తించింది. అవి అసలు మనుషులు తినేలా లేవని తేల్చింది. నాడు ఈ సంస్థకు అనిల్ తుతేజా ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు.

# ఇజ్రాయెల్ దాడులు.. హమాస్ స్నైపర్ ఫోర్స్ కమాండర్ హతం



**టెల్‌అవీవ్, ఏప్రిల్ 11:** గాజాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ అట్టుడుకుతోంది. హమాస్ కీలక ఆయుధ స్థావరాలు, నేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. గురువారం ఐడిఎఫ్‌కు చెందిన విమానాలు, డ్రోన్లు, హెలికాప్టర్లు హమాస్‌కు చెందిన 40 స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో హమాస్ స్నైపర్ ఫోర్స్ టెల్ సుల్తాన్ బెటాలియన్ కమాండర్ అహ్మద్ ఐయాద్ మహమ్మద్ ఫర్హాత్ హతమయినట్లు వెల్లడించారు. మహ్మద్ ఫర్హాత్ హమాస్ ఇజ్రాయెల్‌పై అనేక దాడులకు పథక రచన చేసినట్లు, సైన్యాన్ని ముందుండి నడిపినట్లు తెలుస్తోంది. అతడిని హతమార్చడంలో ఇజ్రాయెల్ మరో విజయం సాధించిందని ఐడిఎఫ్ పేర్కొంది.

రఫా, ఖాన్ యూనిస్, మొరాగ్ కారిడార్ ప్రాంతాల్లో తమ దళాలు దాడులు చేయగా పలువురు హమాస్ కార్యకర్తలు మృతి చెందినట్లు వెల్లడించింది. పెద్ద మొత్తంలో భూగర్భ మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. బుధవారం వైమానిక దాడిలో కూడా దాదాపు 40 హమాస్ లక్ష్యాలను నాశనం చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇప్పటికే గాజాలో 50 శాతం భూభాగాన్ని ఆధీనంలోకి తెచ్చు కున్నట్లు పేర్కొంది.

గత 18 నెలలుగా సాగుతున్న గాజా యుద్ధంలో 50వేల మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు. హమాస్ వద్ద ఉన్న ఇజ్రాయెలీ బందీలను విడుదల చేసేంత వరకూ దాడుల తీవ్రత పెంచుతూనే ఉంటామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. కాగా పాలస్తీనియన్లకు నిలువ నీడ లేకుండా చేయడమే ధ్యేయంగా మౌలిక సదు పాయాలు మళ్లీ వాడుకోలేని విధంగా తాము ధ్వంసం చేస్తున్నామని అసోసియేటెడ్ ప్రెస్ (ఎపి)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐదుగురు ఇజ్రా యెల్ సైనికులు పేర్కొన్న విషయం తెలిసిందే.



# హెలికాప్టర్ ప్రమాదానికి మూలం పెంగ్విన్

## జనవరిలో జరిగిన ప్రమాదంపై దక్షిణాఫ్రికా సిఎఎ నివేదిక

**ఈస్టర్న్‌కేప్(సౌతాఫ్రికా), ఏప్రిల్ 11:** హెలికాప్టర్ సుడులు తిరిగుతూ కూలిపోయిన సంఘటనకు ప్రధాన కారణం ఒక పెంగ్విన్ అని దర్యాప్తులో తేలింది. ఈ ఏడాది జనవరి 19న ఈస్టర్న్ కేప్ ప్రాంతంలోని బర్డ్స్ ద్వీపంనుంచి రాబిన్సన్ ఆర్44 రావెన్2 అనే హెలికాప్టర్ పైకి ఎగిరింది. 50 అడుగుల ఎత్తుకు లేవగానే ఒక్కసారిగా అదుపుతప్పి నేలను ఢీకొంది. ఈ ప్రమాదం నుంచి అందులోని ప్రయాణీకులు ప్రాణాలతో బయటపడ్డారు. దక్షిణాఫ్రియా సివిల్ ఏవియేషన్ అథారిటీ దీనిపై దర్యాప్తుచేపట్టింది. ఈ నాలుగు సీట్ల హెలికాప్టర్‌లో పెట్టెలో ఉంచిన పెంగ్విన్ ప్రమాదానికి కారణమని దర్యాప్తు బృందం తేల్చింది. సురక్షితపద్ధతుల్లో ఉంచకపోవడంతోనే ఇదంతా జరిగిందని తేల్చింది. విమానంలో పైలట్ ముగ్గురు ప్రయాణీకులున్నారు. వీరిలో ఒక నిపుణుడు పంగ్విన్‌ను పోర్టు ఎలిజబెత్‌కు తరలించాలని కోరడంతో పైలట్ కూడా రిస్క్‌ను అంచనా వేయకుండా అంగీకరించి తీసుకున్నాడు. ఆ పెంగ్విన్‌ను ఒక కార్డు బోర్డు బాక్స్‌లో ఉంచి హెలికాప్టర్‌లో పైలట్ పక్కనే ఉన్న వ్యక్తి ఒడిలో ఉంచారు. ఆ లోహ విహంగం 50 అడుగుల ఎత్తు ఎగరగానే ఆ బాక్స్ ఒక్కసారిగా పైలట్ సైక్లిక్‌పిచ్ కంట్రోల్ లివర్‌పై పడింది. దీనితో హెలికాప్టర్ అదుపు తప్పి దాని రెక్కలు నేలను తాకడంతో అది కూలిపోయింది. తగిన ఏర్పాట్లు లేకుండా పెంగ్విన్‌ను హెలికాప్టర్లలో తరలించడం సరైన చర్యకాదని దక్షిణాఫ్రికా సిఎఎ తన నివేదికలో వెల్లడించింది. పైలట్ కూడా దానిని కార్డుబోర్డు బాక్స్‌లో తరలించి ముప్పును అంచనా వేయడాన్ని విస్మరించాడని విశ్లేషించింది.



# విషు పర్వదినం నుంచి అయ్యప్ప బంగారు లాకెట్లు

**తిరువనంతపురం, ఏప్రిల్ 11:** అయ్యప్ప భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) కొత్తపథకం అమలుకు తెచ్చింది. అయ్యప్ప విగ్రహంతో కూడిన ప్రత్యేక బంగారు లాకెట్‌ను మలయాళ కొత్త సంవత్సరం విషు పర్వదినం (ఏప్రిల్ 14) సందర్భంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించిందివిషు సందర్భంగా ఈ లాకెట్ అందుబాటులోకి వస్తుందని పేర్కొంది. 1, 2, 4, 8 గ్రాముల్లో లాకెట్లు అందుబాటులో ఉండనున్నాయి. అయ్యప్ప భక్తులు లాకెట్లను రెండు విధాలుగా కొనుగోలు చేయవచ్చని దేవస్థానం బోర్డు తెలిపింది. ఆన్ లైన్ లేదా ఆలయ ప్రధాన ప్రాంతమైన సన్నిధానంలోని దేవస్వం పరిపాలనా కార్యాలయంలో నగదు చెల్లించడం ద్వారా పొందవచ్చని వెల్లడించింది. బంగారు లాకెట్‌ను ఆలయ పవిత్ర గర్భగుడి లోపల పూజలు నిర్వహించి అందజేస్తారు. ఇలా చేయడం వల్ల భక్తులకు అదనపు ప్రత్యేకతను ఇస్తుందని దేవస్థానం పేర్కొంది. జీఆర్‌టీ, కల్యాణ్‌కు బంగారు లాకెట్ల టెండర్లు అయ్యప్ప స్వామి ఫొటోతో బంగారు లాకెట్లను తయారు చేసి సప్లై చేసే టెండర్లను తమిళనాడుకు చెందిన జీఆర్‌టీ జ్యువెల్లర్స్, కేరళకు చెందిన కల్యాణ్ జ్యువెల్లర్స్ దక్కించుకున్నాయి. 1 గ్రాము, 2 గ్రాములు, 4 గ్రాములు, 8 గ్రాముల సైజుల్లో ఈ లాకెట్లు లభిస్తాయి. విషు పర్వదిన వేడుకల్లో ఈ బంగారు లాకెట్లు ముఖ్యమైన భాగం. ఇది శబరిమల సందర్శించే వేలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక అనుభవాన్ని మరింత సుసంపన్నం చేస్తుందనే భావన ఉంది. ఇదిలా ఉండగా, మలయాళ నెల మీనం మొదటి రోజు (శుక్రవారం) పవిత్రమైన ఆరాట్టు ఊరేగింపు ప్రారంభమైంది. ఉదయం 8:30 గంటలకు సన్నిధానం నుంచి పంప వరకు ఉత్సవ ప్రయాణంతో ఊరేగింపు ప్రారంభమయింది. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వెలినల్లూర్ మణికందన్ పాల్గొన్నారు. పంపాలో ఆరాట్టు ఆచారం ఉదయం 11:00 గంటలకు జరిగింది. ఆరాట్టు ఊరేగింపు తర్వాత, అయ్యప్పను పంప గణపతి ఆలయంలోని మండపానికి తీసుకెళ్తారు. అక్కడ భక్తులు ప్రార్థనలు చేసుకునే అవకాశం ఉంటుంది. పూజా కార్యక్రమాలు, ప్రార్థనల తర్వాత ఆరాట్టు ఊరేగింపు సన్నిధానంకు తిరిగి వెళుతుంది.

12- 4pg6exHMNWJQE.qxd:12- 4pg6exHMNWJQE.qxd 01/01/01 10:47 AM Page 1



# రైల్వే అకౌంట్స్ సిబ్బందికి రూ.3.52లక్షల నగదు అవార్డులు

గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 11,ప్రభాతవార్త తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే అకౌంట్స్ విభాగంలో అంకితభావంతో పనిచేస్తూ ప్రతిభా సామర్థ్యాలను కనబరిచిన 190మంది సిబ్బందికి రూ.3.52లక్షల నగదు అవార్డులను జోనల్ ఉన్నతాధికారులు మంజూరు చేశారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని సీనియర్ డిఎఫ్ఎం కార్యాలయంలోపనిచేస్తున్నకిరణ్ కుమార్,భాస్కర కుమార్,శ్రీనివాస నాయుడు,బాలరాజు,షేక్ రిజ్వాన బేగం,కౌశల్ కుమార్, నరేంద్ర, సుజితలతో కూడిన సమూహానికి రూ.14,500ల నగదు అవార్డును మంజూరు చేశారు. అలాగే సెంట్రల్ బడ్జెట్‌లో పనిచేస్తున్న 16మంది సిబ్బందికి రూ.40వేలు, విజయవాడ డివిజన్‌లో ఎనిమిది మంది సిబ్బంది గల గ్రూప్‌కు రూ.14,500లు, నిర్మాణాల విభాగంలో పనిచేస్తున్న అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందికి గల రూ.9వేలు, జనరల్ అకౌంట్స్ విభాగంలో బుక్స్,ఫైనాన్స్,అడ్మిన్ పాలసీ,అడ్మిన్ బిల్స్,ఐటిసెల్ హెడ్ క్వార్టర్స్,ఎఫిషియన్సీ,ఆడిట్,ఇన్స్‌పక్షన్,ఆర్అండ్ డి,పిఎఫ్,ఎక్స్‌పెండెచర్,ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లలో పనిచేస్తున్న మొత్తం 44మందికి రూ.79వేలు, గుంటూరు డివిజన్ అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఆరుగురికి రూ.11వేలు,హైదరాబాద్ డివిజన్ అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందికి రూ.9,500లు,సిబ్బందికి రూ.10,500లు,నాందేడ్ డివిజన్‌లో అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఆరుగురు సిబ్బందికి రూ.12వేలు,ఆఫీసర్స్,స్టాఫ్ పెన్షన్ సెక్షన్‌లో పనిచేస్తున్న 16మందికి రూ.40వేలు, జనరల్ ఇన్స్‌పెక్షన్ సెక్షన్‌లో పనిచేస్తున్న పదిమంది సిబ్బందికి రూ.26వేలు, రాయనపాడు వర్క్‌షాప్ అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఐదుగురికి రూ.9వేలు,సికింద్రాబాద్ డివిజన్ అకౌంట్ విభాగంలో పనిచేస్తున్న 9మందికి రూ.17,500లు,స్టోర్స్ అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న 13మంది సిబ్బందికి రూ.25,500లు, తిరుపతి సిఆర్ఎస్ వర్క్‌షాప్‌లో అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ముగ్గరికి కలిపి రూ.5వేలు,ట్రాఫిక్ అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న 36మంది సిబ్బందికి రూ.65,500లు చొప్పున రైల్వే జోన్ వ్యాపితంగా అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న మొత్తం 190మంది సిబ్బందికి రూ.3,52,500లు నగదు అవార్డులను జోనల్ ఉన్నతాధికారులు మంజూరు చేశారు.

# ఇ.ఎస్.ఐ సేవలను మరింత మెరుగుపరుస్తాం

## - కార్మిక శాఖ రాష్ట్ర అదనపు అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు

**విజయవాడ, ఏప్రిల్ 11,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ఇ.ఎస్.ఐ హాస్పిటల్‌లో అందుతున్న వైద్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కార్మిక శాఖ రాష్ట్ర అదనపు అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు స్పష్టం చేసారు. శుక్రవారం ఉదయం విజయవాడ ఇ.ఎస్.ఐ హాస్పిటల్‌ను సందర్శించిన చంద్రుడు, ఓపీ రిజిస్ట్రేషన్, లాబరేటరీ, ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ విభాగాలను పరిశీలించారు. రోగుల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకుని, వైద్య సేవలు మరింత ప్రభావవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.
ధన్వంతరి ఆన్లైన్ రిజిస్ట్రేషన్, ఆధార్ అనుసంధానం వంటి అంశాలను సమీక్షించిన చంద్రుడు, రిజిస్ట్రేషన్ వ్యవస్థను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. చందాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు.

హాస్పిటల్ అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేసిన చంద్రుడు, ఇ.ఎస్.ఐ డైరెక్టర్ వి. ఆంజనేయులకు తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. వి. జ్యోతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



విజయవాడ ఇఎస్ఐ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కార్మిక శాఖ రాష్ట్ర అదనపు అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు

# ఐస్క్రీంలో సైనేడ్ కలిపి కుమారునికి తినిపించి, తాను కూడా తిన్న తండ్రి - ఇద్దరూ మృతి

**విజయవాడ,ఏప్రిల్11,ప్రభాతవార్తప్రతినిధి:** అప్పులు,అవసరాలు,ఆకలి మనిషిని నిరంతరం వెన్నంటి ఉండే సమస్యలు,వాటిని స్థిరంగా పరిష్కరించుకోవాలి.ఆత్మహత్యలు వాటికి పరిష్కారం చూపవు.జీవన అవగాహనలేని ఓ తండ్రి పిరికితనంతో సైనెడ్ తన కొడుకును చంపి.తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు,విచారిస్తున్నామని పోలీసులు శుక్రవారం తెలిపారు.విజయవాడ నగర సమీపంలోని యనమలకుదురులో ఈ దురదృష్టకర ఘటన లో జరిగింది. ఈ ఘటనకు చోటు చేసుకున్న పరిస్దితులను గమనిస్తే పాత బస్తీలో బంగారం పనులు చేసే సాయిప్రకాశ్‌రెడ్డి భార్య, పిల్లలతో యనమలకుదురు వినోద్ పబ్లిక్ స్కూల్ రోడ్డులో ఉంటున్నాడు. భార్య లక్ష్మీభవాని గాంధీనగర్‌లోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తోంది. వారికి 11 ఏళ్ల పాప, ఏడేళ్ల బాబు తక్షిల్ ఉన్నారు. కరోనా సమయంలో సరిగ్గా వ్యాపారం, పనులు లేక రూ.10 లక్షల వరకు అప్పయ్యాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక కొద్దిరోజులుగా మనస్థాపానికి గురవుతున్నాడు. భార్యాభర్తలు ఎవరి పనులకు వారు వెళ్లి మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చారు. ఒంటిపూట బడులు కావడంతో పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. తల్లి లక్ష్మీభవానీ మెడికల్ షాపునకు వెళ్లిపోయింది. సాయంత్రం 4.30 గంటల సమయంలో సాయిప్రకాశ్‌రెడ్డి.. కుమారుడు తక్షిల్‌కు సెనైడ్ కలిపిన ఐస్క్రీమ్ తినిపించి తానూ తిన్నాడు. కాసేపటికే ఇద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు గమనించి వారిద్దరినీ పటమటలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తంవిజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఇద్దరూ మృతిచెందినట్లు తెలిపారు.

సెనైడ్ సేవించే ముందు సాయిప్రకాశ్‌రెడ్డి తన స్నేహితుడు విజయ్‌కు ఒక మెసేజ్ చేశాడు. ఇద్దరం సెనైడ్ తిన్నామని, క్షమించమని మెసేజ్ పెట్టాడు.

పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం గత రాత్రి వెలుగులోకి వచ్చింది.

# యూనియన్ల పేరుతో ఆర్టీసీపై అసత్య ఆరోపణలు

## దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన యాజమాన్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** కొందరు వ్యక్తులు యూనియన్ల పేరుతో సంస్థపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని .. వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు టిజిఎస్ఆర్‌టిసి ప్రకటించింది. కొంతకాలంగా తమ మనుగడ కోసం కొందరు వ్యక్తులు తమ ఇష్టారీతిన మాట్లాడుతూ, ప్రకటనలు జారీ చేస్తూ ఆర్‌టిసి ఉద్యోగులను గందరగోళానికి గురిచేస్తున్నారని సంస్థ శుక్రవారం జారీ చేసిన ప్రకటనలో మండిపడింది. తాజాగా ఎస్ఆర్ బీఎస్‌ను ఆర్‌టిసి సంస్థ రద్దు చేస్తోందంటూ ఉద్యోగులను తప్పుదారి పట్టించి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని.. సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఉద్దేశపూర్వకంగా చేస్తోన్న ఈ దుష్ప్రచారాన్ని యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. యూనియన్ లీడర్లమంటూ కొందరు చేస్తోన్న తప్పుడు ప్రచారాన్ని, పుకార్లని నమ్మి ఆందోళనకు గురికావొద్దని ఉద్యోగులకు యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. ఆర్‌టిసికి ఉద్యోగులే వెన్నుముకని.. వారంతా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించడం వల్లే సంస్థ మన గలుగుతోందని ప్రకటనలో పేర్కొంది. సిబ్బంది నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేయడంతోనే మంచి ఫలితాలు కూడా వస్తున్నాయని.. ఆర్‌టిసిని అన్ని తామై ముందుకు నడిపిస్తున్న ఉద్యోగుల సంక్షేమం విషయంలో యాజమాన్యం ఏమాత్రం రాజీపడటం లేదని సంస్థ ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న 2017 సిఆర్‌సిని 21 శాతం ఫిట్ మెంట్‌తో 2024 మే నెలలో అందించిందని గుర్తు చేసింది. పెండింగ్‌లో ఉన్న 11 డీఏలను 2019 నుంచి దశలవారీగా ఉద్యోగులకు విడుదల చేసిందని తెలిపింది. ఆర్‌పిఎస్ 2013 బాండ్లకు సంబంధించిన రూ.280 కోట్లను ఆర్టీసీ ఉద్యోగుల ఖాతాల్లో సంస్థ జమచేసిందని.. ప్రమాదవశాత్తు అకాల మరణం చెందిన, శాశ్వతంగా దివ్యాంగులైన సిబ్బందికి రూ.1.20 కోట్ల ప్రమాద బీమాను సంస్థ అందిస్తోందని తెలిపింది. గత మూడున్నరేళ్లలో పీఎఫ్‌కు రూ.2,348.35 కోట్లను, సీసీఎస్ కు రూ. 1300.73 కోట్లను యాజమాన్యం చెల్లించిందని.. 2021-22 నాటికి పీఎఫ్ బకాయిలు రూ. 1,352.82 కోట్లు ఉండగా.. వాటితో పాటు రికవరీ మొత్తాలను ప్రతి నెల క్రమతప్పకుండా చెల్లిస్తూ ప్రస్తుతం రూ.580.37 కోట్లకు తగ్గించిందని ప్రకటించింది. అలాగే సీసీఎస్ బకాయిలు 2021- 22 నాటికి రూ. 887.48 కోట్లు ఉండగా.. రికవరీ మొత్తాలను ప్రతి నెల క్రమతప్పకుండా చెల్లిస్తూ రూ.451.09 కోట్లకు సంస్థ తగ్గించిందని తెలిపింది. సంస్థలో పీఎఫ్, సీసీఎస్ బకాయిలు 2012 నుంచే ఉన్నాయని.. ఇప్పుడే ఆ నిధులను వినియోగించుకున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగానే డిపోల ప్రైవేటీకరణ అంటూ లేనిపోని అపోహలను ఉద్యోగుల్లో సృష్టిస్తున్నారని మండిపడింది. ఎలక్ట్రిక్ బస్సులతో ఒక్క ఉద్యోగిని కూడా తొలగించే పరిస్థితి ఉండదని యాజమాన్యం స్పష్టం చేసింది మరణించిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన 2511 మంది ఉద్యోగుల పిల్లలు, జీవిత భాగస్వాములకు కారుణ్య నియమాకాలు.



ఇంద్రకీలాద్రిపై స్వామి అమ్మవార్ల శ్రీ కళ్యాణోత్సవం దృశ్యం

# నంది వాహనంపై ఆదిదంపతులు

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం నాడు రాత్రి 10.30 గంటలకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దివ్య లీలా కళ్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పండితులు, కవులు సాయంత్రం 7 గంటలకు జరిగే శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణానికి సంబంధించిన రాయభారం నిర్వహించారు. వధూవరులయిన శ్రీ స్వామి అమ్మవార్ల వైభవాన్ని, వారి గొప్పదనాన్ని వివరించారు. ఈ ఎదుర్కోలు ఉత్సవంలో ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్, ఆలయ ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, మల్లేశ్వర శాస్త్రి పాల్గొన్నారు. అనంతరం 10.30 గంటలకు శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణం కమనీయంగా జరిపారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దివ్య లీలా కళ్యాణోత్సవంలో ఉభయ దాతలు రు.1116 (దంపతులకు) చెల్లించి పాల్గొన్నారు.

– నంది వాహనంపై ఆదిదంపతులు:
శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లు శుక్రవారం నందివాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీ గంగాభవానీ సమేత మల్లేశ్వర స్వామివార్లను నందివాహనంపై వేంచేపు చేసి శ్రీ మల్లేశ్వర స్వామివార్ల మండపం నుండి కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కొత్తపేట, సామారంగంచౌక్, మెయిన్‌బజార్ లలో విహరించి భక్తుల జేజేలందుకున్నారు. తిరిగి కనకదుర్గానగర్ అక్కడినుండి శ్రీ మల్లేశ్వర స్వామివార్ల మండపానికి చేరుకున్నాక పండితులు శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

**-నేడు గిరి ప్రదక్షణ:**
ప్రతి పౌర్ణమి పర్వదినాన వేడుకగా నిర్వహించే గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని శనివారం చైత్రమాసం పౌర్ణమి సందర్భంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఇఒ కె రామచంద్ర మోహన్ తెలిపారు. ఉదయం 5.55 గంటలకు ఇంద్రకీలాద్రి పాత గాలిగోపురం వద్ద వేంచేసియున్న శ్రీ కామధేను మాత, శ్రీ గణపతి స్వామివార్లకు పూజాదికాలు జరిపిన అనంతరం టెంకాయలు కొట్టి గిరి ప్రదక్షణను ప్రారంభిస్తామన్నారు.

**- నేడు సింహ వాహన సేవ :**
ఏప్రిల్ 12వ తేదీ శనివారం నాడు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లు సింహ వాహనంపై నగర విహారం చేసి భక్తులను అనుగ్రహిస్తారని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఒ కె రామచంద్ర మోహన్ తెలిపారు. అలాగే 13వ తేదీ నదీ విహారము జరుగుతాయన్నారు.

– దుర్గమ్మవారికి బంగారు హారం కానుక :
దుర్గమ్మవారికి హైదరబాద్‌కు చెందిన భక్తుడు దేవినేని సురేంద్ర 110 గ్రాముల బరువైన బంగారు హారాన్ని శుక్రవారం నాడు ఆలయ ఇఒ కె రామచంద్ర మోహన్‌కు అందించారు. దాతకు వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



నగరవిహారంకు ముందుగా ప్రదర్శనలతో అలరిస్తున్న భక్తుల బృందాలు

**- అలరించిన నృత్యనీరాజనం:**
దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం నాడు విజయవాడకు చెందిన శ్రీ సాయిరాం నృత్య అకాడమి నాట్యాచార్యులు భాగవతుల శ్రీనివాస్ నేతృత్వంలో శిష్యబృందం అధ్భుతంగా కూచిపూడి నృత్యనీరాజనాలర్పించారు. మూషికవాహన, మహిషాసుర మర్ధని, రామాయణశబ్దం, కృష్ణం కలయసఖి, ముద్దుగారే యశోద, శృంగార లహరి, తదితర కీర్తనలకు 25 మంది కళాకారులబృందం నృత్యనీరాజనాలర్పించి భక్తుల మన్ననలందుకున్నారు. అనంతరం వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, ప్రసాదం, చిత్రపటం అందించారు.

# సామాజిక సంస్కరణలకు నాంది పలికిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే : మంత్రి సవిత

**విజయవాడ,ఏప్రిల్11,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక సంస్కరణలకు నాంది పలికిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అనిరాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత కొనియాడారు.దేశంలో బడుగు,బలహీన వర్గాలు విద్యావంతంగా చైతన్యం కావడానికి జ్యోతిరావు పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు.శుక్రవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులు మంత్రి సవిత అర్పించారు. ఈ సందర్భంగా కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అన్నారు. స్త్రీల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు కృషిచేసిన మహ నీయుడు తొలి బాలికల పాఠశాలను ప్రారంభించిన విద్యావేత్తగా శ్లాఘించారు. సమ సమాజ స్థాపనే జ్యోతిరావు పూలే లక్ష్యమని మంత్రి సవిత అన్నారు.బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి అమోఘం అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిసి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ దూంద(పారేపల్లి) రాకేష్, పలువురు డైరెక్టర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



జ్యోతిరావు పూలేకు నివాళిని అర్పిస్తున్న మంత్రి సవిత

# జయప్రద సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వైద్యశిబిరాలు


## -13న జగ్గయ్యపేటలో మెగా నేత్ర వైద్యశిబిరం

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** సమాజమే దేవాలయం ప్రజలే నా దేవుళ్ళు అనే ఎన్‌టిఆర్ అందించిన స్ఫూర్తితో ఆవిర్భవించిన జయప్రద ఫౌండేషన్ సేవా సంస్థ ద్వారా గత ఏడు సంవత్సరాల కాలంగా అసంఖ్యాకంగా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు మాజీఎంఎల్‌సి, సేవా సంస్థ చైర్మన్ తొండెపు దశరథజనార్ధన్ వెల్లడించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023లో జయప్రద ఫౌండేషన్ సేవా సంస్థ ఏర్పాటుచేసిన నాటి నుండి నేటి వరకు కొన్ని వేల మందికి సేవలు అందించామన్నారు.

వత్సవాయి మండలంలోని లింగాల, గంగవల్లి, పోచారం గ్రామాలను దత్తత తీసుకుని అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటంతోపాటు వారికి ఉచితంగా మందిలందించి ఖర్చులకు అవసరమైన ఆర్థిక సహాయం కూడా అందించామన్నారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉపకార వేతనాలు, ఉన్నత విద్యాభ్యాసానికి పేదలకు ఆర్థిక సాయం వంటి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం జగ్గయ్యపేట పట్టణ శివారులోని పివికె ఫంక్షన్‌హాలులో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేస్తుననట్లు తెలిపారు. ఈకార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రారంభిస్తారన్నారు.
విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, స్థానిక ఎంఎల్‌ఏ శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, శంకర్ నేత్ర చికిత్సాలయ ఎండి డాక్టర్ స్వాతి, రోటరీక్లబ్ ఆఫ్ అమరావతిచెన్నుపాటి వినయ్ హాజరవుతారనివివరించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల వారు ఈఅవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని విజ్ఞప్తిచేశారు.

కాగా సమావేశంలో టిడిపి నేతలు కట్టా వెంకటనరసింహారావు,

మేకా వెంకటేశ్వర్లు, వడ్లమూడి రాంబాబు, చింతల సీతారామయ్య, గింజుపల్లి రమేష్, వేగినేటి గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.





సమవేశంలో ప్రసంగిస్తున్న మాజీఎంఎల్‌సి, జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండెపు దశరధజనార్ధన్.

# కుల గణనతో బిఆర్ఎస్ పార్టీలో వణుకు పుట్టింది..

## అందుకే నిందలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** కులగణతో వణుకు పుట్టిన బిఆర్ఎస్ నిందలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ విమర్శించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ పదేండ్లలో భూ దోపిడి చర్చకు సిద్ధమా? దమ్ము ధైర్యం ఉంటే చర్చకు రండి.. అని కేటీఆర్ కి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సవాల్ చేశారు. కరెప్షన్ కి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబం అని ఆయన నిర్వ చించారు. లిక్కర్ స్కాం చేసింది కేసీఆర్ కుటుంబం, అడ్డమైన వాళ్లు వచ్చి మాట్లాడుతున్నారని, తెలంగాణ ప్రజలరా నమ్మకండి అని ఆయన పిలుపునిచ్చారు. కేటీఆర్ ఇంత దిగజారుతాడా? కేసీఆర్ కుటుంబంపై సీబీఐ విచారణ జరపాలని అన్నారు. అత్యంత తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ధనం దోపిడీ చేసింది కేసీఆర్ కుటుంబం అని మహేష్‌కుమార్ ఆరోపించారు. బిల్లీ రావుతో కేటీఆర్ ఒప్పందం చేసుకున్నాడని అన్నారు. కేటీఆర్ గుంటూరులో ఏం చదువు నేర్చు కున్నాడో సగంసగం తెలుసుకొని రాజకీయ లబ్ది కోసం కేటీఆర్ మాట్లాడుతారని ఆయన అన్నారు. బిసి కుల గణన వల్ల బిఆర్ఎస్ పార్టీకి వణుకు పుట్టింది.. బిఆర్ఎస్ పదేళ్లలో ఎన్ని వేల ఎకరాలను కొల్లగొట్టారో తెలి యదా?రైతులు బాగుపడుతుంటే కెటిఆర్‌కి కడుపు నొప్పి వస్తోంది. ప్రభుత్వం టెండర్లను పిలిచింది ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ మొత్తం వైట్‌మనీ ఇచ్చింది. టెక్నాలజీతో వీడియోలు చేయించి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపారు. తెలంగాణకి ఉద్యోగాలు రాకూడదా?బిఆర్ఎస్ దోపిడీని భరించలేకనే కాంగ్రెస్ పార్టీని గెలిపించారని అన్నారు. డ్రామరావు పేరును కేటీఆర్ సార్థకం చేసుకుంటున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. హెచ్ సి యు భూములపై పూటకో డ్రామా ఆడుతూ కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.జిహెచ్ఎంసి పరిధిలో పదివేల ఎకరాలకు పైగా భూములు అమ్మిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీది అని అన్నారు. హైదరాబాద్ చుట్టూ పక్కల అత్యంత విలువైన ప్రభుత్వ భూములను మీ అస్మదీయులకు కట్టబెట్టింది వాస్తవమా కాదా కేటీఆర్ ? అని ప్రశ్నించారు.పదేళ్లలో యదేచ్ఛగా భూములు దోపిడీ చేసిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదే అన్నారు.హెచ్ సియు భూములకి సంబంధించి కేటీఆర్ ఐఎంజీ సంస్థ బిల్లి రావుతో 30 శాతం ముడుపులు మాట్లాడుకొని కుదుర్చుకున్న ఒప్పందం చెప్పారు.ముడుపుల ఒప్పందం బెడిసి కొట్టడంతో కేటీఆర్ నానాయాగి చేస్తున్నారుహెచ్ సి యు భూములు ప్రైవేట్ పరంగా కాకుండా కాపాడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. ఆ భూములు ప్రభుత్వానివే. గైడ్ లైన్స్ పరంగా టిజిఐఐసి తో కంపెనీ తో 10 వేల కోట్లు ఒప్పందం అన్నారు.భూముల ఒప్పందం ద్వారా వచ్చిన 10 వేల కోట్ల రూపాయలను రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఉపయోగించిది అన్నారు. అఫిషియల్ గా ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అనే కంపెనీకి రూ.170 కోట్లు రూపాయలు బదిలీ జరిగిందని తెలిపారు. హెచ్‌సియు భూములను అప్పటి ఎన్డీయే ప్రధాని అటల్ బిహారీ వాజపేయిసీఎం చంద్రబాబు కలిసి ఐఎంజీ భారత్ కంపెనీకి అప్పగిస్తే కోర్టులో కొట్లాడి వైఎస్ఆర్ రద్దు చేయించారని గుర్తుచేశారు. హెచ్ సియుభూములపై కుట్ర పూరితంగానే ఏఐ టెక్నాలజీ తో నెమళ్ళు, జింకలు రోదిస్తున్నాయని అంటూ అవాస్తవాలు ప్రచారం చేశారని అన్నారు. అసత్యాలు అవాస్తవాలు ప్రచారం చేసిన వాళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తెలంగాణ అభివృద్ధికి అడుగడుగునా ప్రతిపక్షాలు అడ్డు పడుతున్నాయి కేటీఆర్ అరెస్టును అడ్డుకుంటుంది ఎవరో అందరికీ తెలుసు అని అన్నారు. కేటీఆర్ జైలుకు పోవడం ఖాయం అని చెప్పారు. ఫార్ములా ఈ కార్ రేస్ లో అరెస్టు అవుతానని కేటీఆర్ కి తెలుసు మంత్రి వర్గంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ చర్చించుకొని ముందుకు వెళ్లే వెసులుబాటు కాంగ్రెస్ పార్టీలో ఉందని ఆయన వివరంచారు కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛకి కొదవ లేదు, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ యూనివర్సిటీల భూముల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరమని అన్నారు.హెచ్‌సీయూకి చెందిన 134 ఎకరాలను కేసీఆర్ టీఎన్జీఓలకు ఇచ్చినప్పుడు కేటీఆర్‌కు యూనివర్సిటీల భూమి అని తెలిసిరాలేదా..? అని ప్రశ్నించారు. అప్పుడు యూనివర్సిటీ భూమి పరిరక్షణపై ఎందుకు నోరు మెదపలేదు..? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రయోజనం కలిగించేలా వర్సిటీ భూముల్లో రోడ్డు వేసింది మీ బిఆర్ఎస్ సర్కార్ కాదా కేటీఆర్ బిఆర్ఎస్ పాలనలో రియల్ ఎస్టేట్ కంపెనీల యాడ్స్ కంటే సర్కారీ భూముల అమ్మకాల ప్రకటనలే పేపర్లలో పెద్దఎత్తున కనిపించిన సంగతి మర్చి పోయావా అని నిలదీశారు. కేటీఆర్ యూనివర్సీటీలకు అన్ని ఎకరాల భూమి ఎందుకంటూ కేసీఆర్ పాలనలోనే యూనివర్సిటీలపై వివక్ష చూపిస్తూ భూముల కబ్జాపై కేటీఆర్ కన్నేశారు హెచ్‌సీయూలో వివాదాస్పద భూమిని మినహాయించి మిగతా భూమి పరిరక్షణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోలేదు.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు

## నివాళులర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే విగ్రహం వద్ద నుంచి ప్రజలకు, పెద్దఎత్తున వచ్చిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సిఎం అభివాదం చేశారు. పూలేకు నివాళులర్పించిన వారిలో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బల్మూర్ వెంకట్,

అద్దంకి దయాకర్, ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రోహిన్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, పిసిసి కార్యదర్శులు లక్‌పతి యాదగిరిగౌడ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పి.నారాయణస్వామి, పులి జగన్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, సత్తిబాబు తదితరులు ఉన్నారు.

కాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమం పూర్తయ్యాక వివిధ పార్టీలకు చెందిన నేతలు జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నివాళులర్పించారు. బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,

మాజీమంత్రి కృష్ణాయాదవ్, బిసి కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తదితరులు పూలేకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# మానవతామూర్తి మహాత్మా జ్యోతిభా పూలే : కేసన శంకరరావు

**మంగళగిరి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** భారతీయ సమాజంలో అంటరానితనానికి వ్యతిరేకంగాకుల వ్యవస్థ నిర్మూలనకు,లింగ వివక్షకు వ్యతిరేకంగామహిళాభ్యుదయానికి, అణగారిన వర్గాల విద్యావ్యాప్తికి ఎనలేని



కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మానవతా మూర్తి మహాత్మా జ్యోతిబా పూలే అంటూ,ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కొనియాడారు. ఏప్రియల్ 11,పూలే 198వ జయంతి సందర్భంగా,స్థానిక మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో,పలువురు బీసీ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి,మిఠాయిలు పంచుకుంటూ,ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూసామాజిక తత్వవేత్తఉద్యమకారుడుసంఘ సేవకుడైన మహాత్మా పూలే, మహారాష్ట్రలోని సతారా జిల్లాలో వెనుకబడిన "మాలి"కులంలో జన్మించాడన్నారు. తన బ్రాహ్మణ స్నేహితుని వివాహంలో జరిగిన అవమానం కారణంగా,కుల వివక్షకు బ్రాహ్మణాధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడాలనే దృఢ సంకల్పం ఆనాడే కలిగిందన్నారు. సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే, సమాజం అభివృద్ధి చెందదని భావించిన పూలే,స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ అనేక పాఠశాలలను స్థాపించారన్నారు. జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ, పూలే దంపతులు వితంతు శరణాలయాలను స్థాపించడమే గాక,ఒక బ్రాహ్మణ వితంతువుకు పుట్టిన బిడ్డ" యశ్వంత్ "ను దత్తత తీసుకొని, డాక్టరుగా తీర్చి దిద్దిన ఘనత,ఆపై యశ్వంత్ కూడా తండ్రి పూలే బాటలోనే తన వైద్య వృత్తిని సామాజిక సేవకు వినియోగింప చేసిన ఘనత పూలే దంపతులదన్నారు. ఇంకా పూలే జయంతి వేడుకలలో నియోజకవర్గ అధ్యక్షులు ఉడతా శ్రీనివాసరావు, మోపిదేవి శివకృష్ణ, మువ్వ మల్లికార్జున్, కిరణ్, నాగబాబు, దానా గౌడ్ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# స్వచ్ఛ నగరంగా తీర్చి దిద్దడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి : ఇంచార్జి మేయర్

గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్11,ప్రభాతవార్త : గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చి దిద్దుకోవడానికి జిఎంసి చేస్తున్న కృషిలో నగర ప్రముఖులు, వివిధ వ్యాపార సంస్థలు భాగస్వాములు కావాలని నగరపాలక



సంస్థ ఇంచార్జి మేయర్ షేక్ సజిలా పిలుపునిచ్చారు. శుక్రవారం తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు నగరపాలక సంస్థకు అందించిన 50 పుష్ కాట్స్ ని కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి, తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు జిఎం అశోక్ కుమార్ తో కలిసి ప్రజారోగ్య కార్మికులకు అందించారు.ఈ సందర్భంగా ఇంచార్జి మేయర్ సజిలా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్ఫూర్తితో గుంటూరు నగరాన్ని నగర ప్రజల సహకారంతో స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకుంటామన్నారు. నగరంలోని నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం, గార్బేజ్ పాయింట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా గుంటూరు నగరంలోని తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ వారిని ప్రజారోగ్య రక్షణలో కీలకమైన పారిశుధ్య మెరుగుకు అవసరమైన పుష్ కాట్స్ కావాలన్న వెంటనే అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నగర ప్రముఖుల చేయూత ద్వారా నగరాన్ని మరింత వేగంగా అభివృద్ధి, స్వచ్ఛత కార్యక్రమాలు విరివిగా చేపడతామన్నారు.తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ శర వేగంగా అభివృద్ధి చెందుతున్న గుంటూరు నగరంలో మౌలిక వసతుల కల్పనకు తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ వంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పి4 ద్వారా గుంటూరులో కూడా అన్ని వర్గాల అభివృద్ధి దోహదపడుతుందని తెలిపారు.పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పిలుపుతో స్వచ్ఛంధ్ర వైపు అడుగులు వేస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2047 స్వచ్ఛంధ్ర వైపు అడుగులు వేస్తున్నదని, ఇందుకోసం పీ 4 విధానంలో భాగంగా వివిధ సంస్థలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. నగర ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.నగరాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.ప్రతి ఒక్కరు సామజిక బాధ్యతగా ముందుకు వస్తే సమాజంలో పేదరికం ఉండదని తెలిపారు.ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరిన వారు అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలన్న ముఖ్యమంత్రి స్ఫూర్తితో రాష్ట్రంలో ఇప్పటికే అనేక మంది, సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ అందించిన పుష్ కాట్స్ గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా మార్చుకోవడానికి తోడ్పడతాయని పేర్కొన్నారు.తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగానికి పుష్ కాట్స్ అందించడం ఆనందంగా ఉందని, రానున్న కాలంలో కూడా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, వివిధ డివిజన్ల కార్పోరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# నూతన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

**పిట్టలవానిపాలెం,ఏప్రిల్11,ప్రభాతవార్త:** పిట్టలవానిపాలెం మండలం అలకాపురం గ్రామ పంచాయతీ లోని ఎస్టీ కాలనీ నందు తుంగభద్ర కాల్వ మీద పిఎంజిఎస్‌వై పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరు అయినా నిధులు సుమారుగా 10 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించబోయే వంతెన శంకుస్థాపన కార్యక్రమానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన



నరేంద్ర వర్మ తో కలిసి బాపట్ల పార్లమెంట్ సభ్యులు మరియు లోక్ సభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వీరాల గోవర్ధన రెడ్డి,అలకాపురం గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, వెంకటపతి రాజు, సాంబమూర్తి రాజు మండల కన్వీనర్ అఫ్జల్,అధికారులు, పెద్ద ఎత్తున కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తడిచెత్త..పొడిచెత్తను తప్పనిసరిగా వేరు చేయాలి : డిఎల్‌పివో స్వరూపరాణి

**కొల్లిపర,ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** తడిచెత్త..పొడిచెత్తను తప్పనిసరిగా వేరు చేయాలని డిఎల్‌పివో స్వరూపరాణి అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని అన్నవరం లంక పంచాయతీ కార్యాలయాలన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను..పారిశుద్ధ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడు తూ పంచాయతీ అధికారులు స్వచ్ఛ సంపద



ప్రాధాన్యతను ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు.కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి భార్గవ్,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాలి భీభత్సానికి మత్స్యకారుల బోట్లు ధ్వంసం

**విజయపురిసౌత్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** నాగార్జునసాగర్ జలాశయంలో గురువారం రాత్రి వీచిన బలమైన గాలుల ధాటికి మత్స్యకారుల మరబోట్లు, పుట్టీలు, వలలు ధ్వంసమయ్యాయి. విజయపురిసౌత్‌లోని డౌన్ మార్కెట్‌కు చెందిన అర్జిల్లి సింహాద్రి, బొందు రాజులు కృష్ణా జలాశయంలో చేపల వేట అనంతరం బోట్లు, పుట్టీలను జలాశయం ఒడ్డున తాడుతో కట్టి వెళ్లారు. గురువారం రాత్రి అకస్మాత్తుగా వీచిన బలమైన గాలులకు చేపల బోట్లు, పుట్టీలు ధ్వంసమయ్యాయి. అప్పటికీ సాగర్ జలాశయం వద్దకు చేరుకుని బోట్లను,



పుట్టీలను కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే అవి ధ్వంసమయ్యాయి. మత్స్యకారుడు సింహాద్రికి చెందిన మరబోటు, రెండు పుట్టీలు, నాలుగు వలల మూటలు దెబ్బతినడంతో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. అలాగే మత్స్యకారుడు బొందు రాజుకు చెందిన మరబోటు, పుట్టి ధ్వంసమైంది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

# మాచర్లలో ఘనంగా మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**మాచర్ల, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను మాచర్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు ఆధ్వర్యంలో పట్టణంలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సమాజాభ్యుదయం స్త్రీ విద్యతోనే సాధ్యమని భావించి ఎంతగానో కృషి చేశారన్నారు. పేదలు ఉన్నత స్థానానికి ఎదగాలంటే విద్యతోనే సాధ్యమని పేర్కొన్నారు. దేశంలో అణచివేతకు గురవుతున్న మహిళా లోకానికి అక్షర లోకాన్ని చూపించి మహిళా జ్యోతులుగా తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



# కారంపూడి అంగన్‌వాడీ కేంద్రాల్లో మురిగిపోయిన గుడ్లు

**- బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు పంపిణీ- పౌష్టికాహారం అంటే ఇదేనా సారూ! - అధికారుల పర్యవేక్షణ కరవు**

**కారంపూడి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** కారంపూడిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మురిగిపోయిన కోడిగుడ్లు వచ్చాయి. ప్రభుత్వం పౌష్టికాహారం పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు కోడిగుడ్లతో మరికొన్ని పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తుంది. కారంపూడిలో శుక్రవారం ముస్లిం బజారు 1వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులకు కోడిగుడ్లను ఇచ్చారు. కోడిగుడ్లను ఇంటికి తీసుకెళ్లి పగులగొట్టి చూడగా అవి మురిగిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. ఇలాంటి పదార్థాలా గర్భిణులకు, చిన్నారులకు అందించేది అని పలువురు విమర్శిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు



నాణ్యమైన సరకులు అందుతున్నాయా లేదా అనే విషయంలో ఐసీడీసీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రచారం జరుగుతుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు మాత్రం కాంట్రాక్టర్లు ఏ పదార్థాలు పంపినా మౌనంగా వాటిని దించుకోవడం తప్ప చేసేదేమీ లేదని వాపోతున్నారు. ప్రభుత్వం పౌష్టికాహారం పథకం కింద బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు పంపిణీ చేసే ఇలాంటి పదార్థాలు నాసిరకంగా ఉండటంతో ఇవి తింటే పుష్టి కాదు కదా ఆసుపత్రుల పాలయ్యే పరిస్థితి ఎదురవుతుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఇలాంటి నాసిరకం గుడ్లను పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకొని, నాణ్యమైన పౌష్టికాహారం అందేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

**అంగన్‌వాడీ సూపర్‌వైజర్: ఉమాదేవి**

మురిగిపోయిన కోడిగుడ్ల విషయంపై అంగన్‌వాడీ కేంద్రాలలో పరిశీలిస్తామని అన్నారు. మండలంలో కేంద్రాలకు వెళ్లి తనిఖీలు చేపడతామని అన్నారు. మురిగిపోయిన కోడిగుడ్ల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నాణ్యమైన గుడ్లు అదేవిధంగా చూస్తామని తెలిపారు.

# నేడు రామప్ప దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**మాచర్ల, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** స్థానిక శ్రీగంగా పర్వత వర్ధిని సమేత చింతల రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో శనివారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొననున్నట్లు సేవా కమిటీ అధ్యక్షులు కంభంపాటి యలమంద తెలిపారు. పౌర్ణమి సందర్భంగా రామప్ప దేవాలయంలో పంచామృత అభిషేకాలు జరుగుతున్నట్లు తెలిపారు. స్వామికి రుద్రాభిషేకం అనంతరం గణపతి హోమం, గాయత్రీ హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రభుత్వ వైద్యశాలలో మీ కోసం మేము

**గుంటూరు తూర్పు, ఏప్రియల్ 11 ప్రభాతవార్త :** ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో 8వ వారం మీ కోసం మేము కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రోగులకు హాస్పటల్ నియమావళి గురించి తెలియజేశారు. ల్యాబ్ టెస్టులు, ఇతర వైద్య సేవలకు ఎటువంటి డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదని తెలిపారు. ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తమకు తెలియజేయాలన్నారు. డబ్బులు అడిగితే రోగీలు ఇవ్వవద్దని కోరాలన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.వి.రమణతో పాటు నర్సింగ్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అసమర్ధతను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు

**- ఇచ్చిన హామీలను నెరవేర్చలేని అసమర్థులు తెదేపా నాయకులు**

**- పల్నాడు వైకాపా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి**

**మాచర్ల, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** ప్రజలకు అలవికాని హామీలను ఇచ్చి వాటిని అమలు చేయలేక, వారి గురించి ప్రశ్నిస్తున్న జగన్మోహనరెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని పల్నాడు జిల్లా వైకాపా



అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన్ సంస్థలకు చెందిన లావు శ్రీకృష్ణ దేవరాయలుకు ఏమాత్రం రాజకీయంగా అనుభవం లేకున్నా, యువకులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో వైఎస్ జగన్ మొదటిసారి ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించారు. అధికారంలో ఉన్నంతకాలం వైఎస్ జగన్ గొప్పవాడని, వైకాపా ప్రభుత్వ చొరవతో పల్నాడుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టే గొప్ప భాగ్యం తనకు దక్కిందని ఆయన మాట్లాడిన వీడియోలు ఇంకా యూట్యూబ్‌లో ఉన్నాయన్నారు. అధికారం కోసం అడ్డమైన గడ్డి తినే శ్రీకృష్ణ దేవరాయలు దుర్బుద్ధి ఇప్పుడు బయటపడింది. నాడు కాంగ్రెస్ జగన్‌పై ఎన్నో కేసులు పెట్టింది. అవన్నీ తప్పుడు కేసులు కాబట్టే ప్రజలు జగన్‌ను నమ్మి ముఖ్యమంత్రిగా 151 స్థానాలతో అఖండ విజయాన్ని అందించి గెలిపించారు. శ్రీకృష్ణదేవరాయలు కూడా ఎంపీగా గెలిచారంటే అది జగన్, వైకాపా గొప్పతనమే. మరలా ఇప్పుడు జగన్‌పై ఉన్న కేసులు గురించి కేంద్రమంత్రి అమిత్‌షా వద్ద శ్రీకృష్ణ దేవరాయలు ప్రస్తావించడం అంటే ఆయన అజ్ఞానం అని చెప్పాలి. చంద్రబాబు, లోకేష్ డైరెక్షన్లో శ్రీకృష్ణదేవరాయలు ఆడుతున్న డ్రామా ఇది. అలవికాని వాగ్దానాలు చేసి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఓడిపోయింది. ఒక పక్కన పత్తి, మిర్చి, కంది రైతులు అల్లాడిపోతున్నారు. సంవత్సరంలో వరికపూడిసెల ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా ప్రాజెక్టుకు కేటాయించలేకపోయారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం చేతగాక ప్రజలను తప్పుదోవ పట్టించడానికి జగన్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. అయిదు సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ గురించి మాట్లాడని శ్రీకృష్ణదేవరాయలు సంస్కారం లేని వ్యక్తిగా ఈ రోజు తెదేపా తరఫున మాట్లాడుతూ జగన్ గురించి ఫిర్యాదు చేసే అంత స్థాయి తనకు ఉందా? అనే విషయం ప్రజలు ఆలోచించాలన్నారు. గతంలో వైసీపీలో ఎంపీగా ఉన్నప్పుడు తెదేపా ప్రజలకు ఏమీ చేయలేదని బహిరంగ సవాల్ విసిరిన శ్రీకృష్ణదేవరాయలు ఇప్పుడు ఇలా మాట్లాడటం చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారు. కేవలం రాజకీయ గుర్తింపు కోసం ఎన్నికల సమయంలో నుంచి ఇప్పటి వరకు అన్ని రకాల అడ్డమైన పనులకు ఫ్యాక్షన్ గొడవలకు పరోక్షంగా మద్దతు తెలుపుతున్నారన్నారు శ్రీకృష్ణదేవరాయలు, రోజులు ఎప్పుడూ ఒకేరకంగా ఉండవు. వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేసి ప్రతి ఒక్కరికీ సోషల్ మీడియా అడ్డం పెట్టుకుని పార్టీపై పార్టీ కార్యకర్తలపై విష రాతలు రాసే ప్రతిఒక్కరికీ, పోలీసులను అడ్డం పెట్టుకొని కార్యకర్తలను వేధిస్తున్న ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో బుద్ధి చెబుతామన్నారు.

# సైబర్ నేరగాళ్ల వల- వ్యాపారి విలవిల

**- అకౌంటు నుంచి నగదు మాయం**

**కారంపూడి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని నగదు కోల్పోయిన వ్యాపారి ఉదంతం ఇటీవల కారంపూడిలో జరిగింది. మండల కేంద్రమైన కారంపూడి గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన ఒక వ్యాపారికి మూడు రోజులక్రితం ఒక అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఆ వ్యక్తి వ్యాపారితో 'మీ ఏటీఎం కార్డును రద్దు చేయమంటార్లా అని అడిగారు. ఆ వ్యాపారి ఏటీఎం కార్డు వద్దు అనుకున్నాడు. ఆ అపరిచిత వ్యక్తి తాను ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాను. మీకు ఓటీపీ వస్తుంది. మాకు ఓటీపీ నంబరు చెప్పండి అని నమ్మబలికాడు. వ్యాపారి వాట్సప్‌కు మూడు సార్లు ఓటీపీ రావడం, వ్యాపారి తిరుగు జవాబు చెప్పడం జరిగిందింది. తరువాత ఆ వ్యాపారి తన బ్యాంకు అకౌంటును చూసుకోగా మూడుసార్లుగా మొత్తం రూ.50,000పైగా నగదు మాయం అయినట్లు గమనించి లబోదిబోమన్నాడు. సైబర్ నేరగాళ్ల ఫేక్ కాల్స్‌కు స్పందించకుండా, లింకులను క్లిక్ చేయకుండా ఉండే ఇలాంటి మోసాలు జరగవు.

# గంజాయి సేవించిన ఇద్దరు వ్యక్తులు అరెస్టు

**గుంటూరు తూర్పు, ఏప్రియల్ 11 ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో గంజాయి తాగే వ్యక్తులను పొన్నూరు రోడ్డు కరెంట్ ఆఫీస్ వెనుక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. నాయి బ్రాహ్మణ కాలనీ, గుంటూరు భరత్‌సింగ్ కాలనీ, హుస్సేన్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్.సుభాని, షేక్.ఖాజా అనే యువకులను



అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మత్తు పదార్థాలు తాగినా, కలిగి ఉన్నా అరెస్ట్ చేస్తామని ఎక్సైజ్‌శాఖ అధికారులు హెచ్చరించారు. దాడులలో ఎస్.ఐ.లు షరీఫ్, తిరుమలేశ్వరరావు, సిబ్బంది రామయ్య, ప్రేమ్‌కుమార్, బసవేశ్వరరావు, వీరాంజనేయులు, గోపి, విఆర్‌ఓలు రోశయ్య, కాసు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

పొన్నూరు, ఏప్రిల్ 11,ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదపడు తుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యం కారణంగా నిరుపేదలైన వారు చికిత్స చేయించుకునేందుకు స్తోమత లేదని బాధపడవద్దని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తమ సహాయనిధి ద్వారా ఆదుకొంటున్నారన్నారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పరిధిలోని నండూరు, ఉప్పరపాలెం, కట్టెంపూడి గ్రామాలకు చెందిన పారి వెంకటేశ్వర్లుకు రూ.75వేలు, సూరిశెట్టి శ్రీనివాసరావుకు రూ.18,441, వేంపాటి రూప శరణ్యకు రూ.10వేలు చెక్కులను అందజేశారు. పట్టణానికి చెందిన పిల్లుట్ల మహేషబాబుకు రూ.1,16,608, తవ్వా రాజ్యలక్ష్మికి రూ.60వేలు, తుపాకుల రెడ్డి అప్పారెడ్డికి రూ.28వేలు, వైరాగ్యం మామిళ్ళమ్మకు



రూ.25వేలు, కాటూరి రాకేష్‌కు రూ.18,819 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబునాయుడికి, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బండ్లమూడి బాబూరావు, బొర్రు రామారావు, సుధీర్, గోవాడ వెంకటకృష్ణారావు, కోట రవిశంకర్, పఠాన్ అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్11,ప్రభాతవార్త :** అణగారిన వర్గాల అభివృద్ధికై తన జీవితాన్ని అంకితం చేసిన మహాత్మా జ్యోతిరావ్ పూలె 199వ జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అయన చిత్ర పటానికి ఇంచార్జి






మేయర్ షేక్ సజిలా, కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి, అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్న కులాలు , సమాజానికి దూరంగా ఉన్న వర్గాలను అక్కున చేర్చుకొని, వారికి విద్య ప్రాధాన్యతను తెలియచేశారన్నారు. పూలే దంపతుల కృషి వలనే నేడు బాలికా విద్య పెరిగిందని, తద్వారా సమాజంలో మహిళలు ఉన్నత స్థానాల్లో నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.గుంటూరు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో...సమాజంలో రుగ్మతలను ఎదుర్కొని బడుగు బలహీన వర్గాలు మహిళల హక్కుల కోసం నిరంతర పోరాటం చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినా పేర్కొన్నారు గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు సమావేశానికి మహిళా ఉద్యోగి ని టి. ఉషాదేవి అధ్యక్షత వహించారు. చైర్ పర్సన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మహిళల హక్కుల కోసం ఆయన ఎంతో పోరాటం చేశారని తెలిపారు. సీఈఓ జ్యోతి బస్సు మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న రుగ్మతలను తొలగించడానికి ఆయన చేసిన కృషి మరువలేనిది అన్నారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి అతిథులు ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు

# ఆధునిక సామాజిక విప్లవమూర్తి జ్యోతిరావు పూలే

గుంటూరు విద్య,ఏప్రిల్ 11,ప్రభాతవార్త : ఆనాటి సమాజంలో కుల వివక్షత,అంటరానితనం పై పోరాటాం చేసి వెనకబడిన వర్గాలు,బడుగు బలహీన వర్గాల వారి హక్కుల సాధన కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త,ఆధునిక సామాజిక విప్లవమూర్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు పేర్కొన్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా



నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న గేరా మోహనరావు మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీన జన బాంధవుడు,సమ సమాజ స్థాపనలో భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన గొప్ప సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు.బాలిక విద్య కోసం అనేక పాఠశాలలు స్థాపించారని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేసి,సమ సమాజ స్థాపనకు పాటుపడాలని పిలుపునిచా ్చరు.కార్యక్రమంలో జింకా వెంకటేశ్వరరావు, మహేష్,రవి,శ్రీనివాస్, ఆనందరావు,మంజుల,కమల తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ముగిసిన ఏఎన్‌యు మహోత్సవం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఏప్రిల్ 11,ప్రభాతవార్త : విద్యార్థుల కేరింతల మద్య ఏఎన్యూ ఇంజనీరింగ్ కళాశాల మహోత్సవం 2025అట్టహాసంగా ముగిసింది.మహోత్సవం రెండోరోజు ఉదయం లఘు చిత్రాల పోటీలు జరిగాయి.పోటీలో 10లఘుచిత్రాలు పాలొ ్గనగా,ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచిన వాటికి బహుమతిని దృవపత్రాలు ప్రధానం చేశారు.క్రికెట్,వాలీబాల్,ఫుట్‌బాల్,త్రోబాల్,టెన్నికాయిట్,200మీటరు ్ల,400మీటరు ్ల పరుగు పందాలు నిర్వహించారు.క్రీడా విజేతలకు ప్రధమ,ద్వితీయ బహుమతులు దృవపత్రాలు ప్రధానంచేశారు.సాయంత్రం 5నుండి 9గంటల వరకు విద్యార్థిని విద్యార్థులు తమసాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరించారు.కార్యక్రమం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించారు.రవి మెలోడిస్ మ్యూజికల్ టీం విజయవాడ తమ కార్యక్రమాలతో అలరించారు.కార్యక్రమంలో విద్యార్థిని విద్యారు ్థలు తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించారు.కొందరు విద్యార్థులు పాటలతో,కొందరు లఘునాటికలతో,కొందరు బృందగానాలతో,మరికొందరు బృందం నిత్యాలతో ప్రేక్షకులను అలరించారు.కార్యక్రమ కన్వీనర్ డాక ్టర్ సిహెచ్ రవికుమార్ వందన సమర్పణ చేశారు.ముగింపు కార ్యక్రమంలో విసి ప్రొఫెసర్ గంగాధర్,రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం,ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్దయ్య,అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ మరియు డాక్టర్ డి.చంద్రమౌళి వివిధ విభాగాధిపతులు డాక్టర్ యు సతీష్,డాక్టర్ కొండా చైతన్య,డాక్టర్ బి.అఖిలజాన్,డాక్టర్ పూర్ణచంద్రశేఖర్,డాక్టర్ ఉమామహేశ్వరీ,డాక్టర్ తిరుమలరావు,డాక్టర్ పుణ్యశేఖర్,డాక్టర్ సునీత,ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండి తౌసిఫ్ అహ్మద్,డివిఎస్కే చైతన్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐపిఎల్‌లో 200 ప్లస్ ఛేజింగ్




## మ్యాచ్‌లలో నయా ట్రెండ్

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 18వ సీజన్‌లో ఒక కొత్త ట్రెండ్ కనిపిస్తోంది. ఈ ట్రెండే జట్ల విజయాలకు కారణమవుతోంది. లీగ్‌లో ఆడుతున్న 10 జట్లు కొత్త ఫార్ములానే అనుసరిస్తున్నాయి. ఈ ట్రెండ్ 200 కంటే ఎక్కువ పరుగులు చేసి దాన్ని డిఫెండ్ చేసుకోవడం లేదా ఛేజ్ చేయడంతో ముడిపడి ఉంది. ఈ ఐపిఎల్-2025లో ఇప్పటి వరకూ జరిగిన 23 మ్యాచ్‌లను చూస్తే వీటిలో 10 మ్యాచ్‌ల ఫలితాలు ఇదే ఫార్ములాపై ఆధారపడి ఉన్నాయి. ఇప్పటివరకు 10మ్యాచ్‌లలో జట్లు మొదట బ్యాటింగ్ చేస్తూ 200 కంటే ఎక్కువ పరుగులు చేశాయి. వాటిలో 9 సార్లు ఆ టోటల్‌ను డిఫెండ్ చేసుకున్నాయి. అంటే, 200 ప్లస్ పరుగులు చేసి దాన్ని డిఫెండ్ చేసుకొని గెలవాలనే ట్రెండ్‌ను జట్లు ఫాలో అవుతున్నాయి. అయితే 10 మ్యాచ్‌లలో ఒకసారి మాత్రం ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేసిన జట్టు విజయం సాధించింది. అంటే 200 ప్లస్ టార్గెట్‌ను ఛేజ్ చేసింది. ఈ సీజనులో తొలి మ్యాచ్ మార్చి 23న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగింది. హైదరాబాద్ మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. ఆ తర్వాత దాన్ని డిఫెండ్ చేసుకొని విజయం సాధించింది. రాజస్థాన్ జట్టు 287 పరుగుల టార్గెట్‌ను ఛేజ్ చేస్తూ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు మాత్రమే చేయగలిగింది.

అలాగే 24న లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 200 ప్లస్ టార్గెట్ ఛేజ్ అయింది. లక్నో మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. బదులుగా ఢిల్లీ 19.3 ఓవర్లలోనే 9 వికెట్ల నష్టానికి 211 పరు గులు చేసింది. 25న 200 ప్లస్ టోటల్ ఉన్న మూడో మ్యాచ్‌కూడా జరిగింది.

గుజరాత్ టైటాన్స్‌తో ఢీకొన్న పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. బదులుగా గుజరాత్ 232 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇక ఈ నెల 3న 200 ప్లస్ రన్స్‌ఉన్న నాలుగో మ్యాచ్ జరిగింది. హైదరాబాద్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో కోల్‌కతా 80 పరుగుల తేడాతో విజయం సాధించింది. నైట్ రైడర్స్ మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. బదులుగా దాన్ని డిఫెండ్ చేస్తూ సన్ రైజర్స్ 120 పరుగులకే కట్టడి చేసింది. 4వ తేదీన లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ కూడా 200 ప్లస్ టోటల్ డిఫెండ్ అవ్వడానికి సాక్ష్యంగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన లక్నో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. బదులుగా ముంబై 191 పరుగులు మాత్రమే చేయగలిగింది. 5న రాజస్థాన్ రాయల్స్ పంజాబ్ కింగ్స్‌పై 205 పరుగులు చేసి దాన్ని డిఫెండ్ చేసుకొని గెలిచింది.

7న రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు కూడా ముంబై ఇండియన్స్‌పై 222 పరుగుల టార్గెట్‌ను డిఫెండ్ చేసింది. 8న లక్నో సూపర్ జెయింట్స్ కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 238 పరుగులు డిఫెండ్ చేసింది. అదే రోజు పంజాబ్ కింగ్స్ చెన్నై సూపర్ కింగ్స్‌పై 219 పరుగులు డిఫెండ్ చేసింది. ఏప్రిల్ 9న గుజరాత్ టైటాన్స్ రాజస్థాన్ రాయల్స్‌పై 218 పరుగుల టార్గెట్‌ను డిఫెండ్ చేస్తూ విజయం సాధించింది.



## బిల్లీ జీన్ కింగ్ కప్‌లో.. మూడో మ్యాచ్‌లోనూ

# నెగ్గిన రష్మిక

### హాంకాంగ్‌పై 2-1తో గెలుపు

### అంతిక-ప్రార్థన ద్వయం ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాదీ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక వరుస విజయాలతో అదరగొడుతోంది. ఆసియా ఓసియానియా గ్రూప్-1లో భాగంగా పుణేలో హాంకాంగ్‌తో జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో భారత్ జట్టు 2-1తో గెలుపొందింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది రెండో విజయంగా నమోదైంది. హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ సింగిల్స్‌లో ఒక మార్పు చేసింది. న్యూజిలాండ్, థాయ్‌లాండ్ జట్లతో జరిగిన మ్యాచ్‌లో బరిలోకి దిగిన హైదరాబాద్ ప్లేయర్ యామలపల్లి సహజ స్థానంలో గుజరాత్‌కు చెందిన వైదేహి చౌదరికి అవకాశం ఇచ్చారు. తొలి మ్యాచ్‌లో పోటీపడ్డ వైదేహి 2 గంటల 3 నిముషాల్లో 7-6 (10/8), 6-1తో హా చింగ్ వు పై గెలిచి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది.

ఇక రెండో మ్యాచ్‌లో బరిలోకి దిగిన రష్మిక 7-6 (8/6), 2-6, 6-3తో హాంగ్ యి కోడీవోంగ్‌ను ఓడించి భారత్‌కు 2-0తో విజయాన్ని ఖరారు చేసింది. 2 గంటల 27 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఎనిమిది ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌ను నాలుగు సార్లు కోల్పోయిన రష్మిక, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో, థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా రష్మిక సింగిల్స్ విభాగంలో వరుస విజయాలను అందుకుంది. ఇక ఫలితం తేలకపోవడంతో నామమాత్రమైన మూడో మ్యాచ్‌లో భారత్‌కు చెందిన అంకిత రైనా-ప్రార్థన తొంబారే జోడీ పోరాడినా చివరకు విజయానికి దూరమైంది. 2 గంటల 2 నిముషాల పాటు జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో అంకిత-ప్రార్థన ద్వయం 7-6 (7/2), 3-6, 11-13తో సూపర్ టైబ్రేక్‌లో యుడైస్ చోంగ్-హాంగ్‌యికొడీ వోంగ్ జంట చేతిలో ఓటమిపాలైంది.

## ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో.. క్వార్టర్ ఫైనల్లోకి

# ఇండో అమెరికన్ ద్వయం



**న్యూఢిల్లీ:** మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ఇండోఅమెరికన్ ద్వయం దూసుకెళ్లింది. భారత్ టెన్నిస్ డబుల్స్ ప్లేయర్ రోహన్ బోపన్న, అమెరికా రైజింగ్ స్టార్ బెన్ షెల్టన్ జోడీ ప్రిక్వార్టర్స్ ఫైనల్లో ఇటలీకి చెందిన మూడో సీడ్ సిమోన్ బొలెలీ-ఆండ్రియా వాహాసోరి జోడీకి షాక్ ఇచ్చింది. 96 నిముషాల పాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-షెల్టన్ జంట 2-6, 7-6 (7/4), 10-7తో సూపర్ టైబ్రేక్‌లో బొలెలీ- వావాసోరి జోడీని బోల్తా కొట్టించింది. మూడు ఏస్‌లు సంధించిన బోపన్న-షెల్టన్ ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడు సార్లు కోల్పోయిన ఈ ఇండో అమెరికన్ జంట ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో ఫ్రాన్స్‌కు చెందిన మాన్యుయెల్ గినార్డ్జ-మొనాకోకు చెందిన రొమైన్ అర్నియోడో ద్వయంతో బోపన్న-షెల్టన్ జంట తలపడుతుంది. ఈ ఏడాది ఏడో టోర్నీలో ఆడుతున్న బోపన్న డబుల్స్ విభాగంలో ప్రస్తుతం మోంటెకార్లో ఓపెన్‌లో, దోహా ఓపెన్‌లో మాత్రమే క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు.

## బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో..

# పోరాడి ఓడిన సింధు



**న్యూఢిల్లీ:** ఆసియా ఛాంపియన్‌షిప్-2025లో భారత స్టార్ షట్లర్ పివి సింధుకు నిరాశ ఎదురైంది. తొలి మ్యాచ్‌లో నెగ్గిన సింధుకు హోరా హోరీగా సాగిన రెండో రౌండ్‌లో పరాజయం ఎదురైంది. ఆమె జపాన్‌కు చెందిన యమగుచి చేతిలో 12-21, 21-16, 16-21 తేడాతో ఓడింది. తాజా ఓటమితో సింధు ఆసియా ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. మ్యాచ్ విషయానికి వస్తే జపాన్‌కు చెందిన యమగుచితో సింధు రెండో రౌండ్‌లో ఢీ కొట్టింది. ఈమ్యాచ్‌లో తొలి నుంచి ఆధిపత్యం ప్రదర్శించి యమగుచి సింధుపై మొదటి సెట్‌లో భారీ తేడా 12-21తో నెగ్గింది. ఇక రెండో సెట్‌లో సింధు కమ్ బ్యాక్ ఇచ్చింది. ప్రత్యర్థికి సవాల్ విసురుతూ చురుగ్గా ఆడింది. ఫలితంగా రెండో సెట్‌ను సింధు 21-16తో దక్కించుకుంది. దీంతో ఫలితం కోసం మూడో సెట్ ఆడాల్సి వచ్చింది.

ఈ డూ ఆర్ డై సెట్‌లో సింధు ప్రత్యర్థికి గట్టిగానే బదులిచ్చింది. హోరాహోరీగా సాగిన ఈ సెట్‌లో సింధు ఆఖర్లో పట్టు కోల్పోయింది. చివర్లో యమగుచి 16-24 తేడాతో నెగ్గి మ్యాచ్ సొంతం చేసుకుంది. దీంతో సింధు టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ విధంగానే గత నాలుగు టోర్నమెంట్‌ల్లో సింధు రెండోరౌండ్ దాటకపోవడం గమనార్హం. కాగా సింధు ఓటమితో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోరాటం ముగిసింది. ఇక పురుషుల సింగిల్స్ విభాగంలో కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ కూడా రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. జపాన్ సీడ్ కొడయ్ నరకొను ఎదుర్కొన్న ప్రియాన్షు 14-21, 17-21 వరుస సెట్లలో ఓడిపోయాడు. అదేవిధంగా కుల్వంత్‌తో ఢీ కొట్టిన కిరణ్ 21-19,13-21,16-21 తేడాతోపరాజయం పాలయ్యాడు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ ధ్రువ్ కపిల-తానిషా క్రాస్టో క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించారు. రెండో రౌండ్లో ఈ జోడీ చైనీస్ తైపీకి చెందిన యేహాంగ్-వీ నికోల్ గొంజాలెస్ చాన్‌ను ఢీ కొట్టింది. ఈ రౌండ్‌లో భారత్ జోడీ 12-21 21-16 21-18తో నెగ్గి క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

# చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా ధోనీ

## ఐపిఎల్ టోర్నీకి రుతురాజ్ గుడ్ బై



**న్యూఢిల్లీ:**న ఐపిఎల్-2025, 18వ సీజనులో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఇప్పటి నుండి మిగిలిన మ్యాచ్‌ల్లో ఎంఎస్ ధోని కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని చెన్నై యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఐపిఎల్‌కు దూరం కావడంతో సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. రుతురాజ్ మోచేతికి గాయం కావడంతో ఐపిఎల్ నుంచి పూర్తిగా తప్పుకున్నాడు. కాగా, ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన పేలవంగా ఉన్న విషయం తెలిసిందే. తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై గెలిచిన చెన్నై ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. మరి ఇప్పుడు ధోని కెప్టెన్సీ తీసుకున్న తర్వాత అయినా చెన్నై సూపర్ కింగ్స్ జాతకం మారుతుందో లేదో చూడాలి. అయితే ఉన్నపళంగా రుతురాజ్ గాయపడటం కూడా అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఇలాగే రవీంద్ర జడేజాకు కెప్టెన్సీ ఇచ్చి చెన్నై వరుసగా ఓడిపోతున్న క్రమంలో అతన్ని తప్పించి మళ్లీ ధోనికే కెప్టెన్సీని ఫ్రాంచైజీ యాజమాన్యం కట్టబెట్టింది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి ఉండటంతో సేమ్ సీన్ రిపీట్ అయిందా? నిజంగానే రుతురాజ్ గాయపడ్డాడా? లేదా అతన్ని బలవంతంగా తప్పించారా? అనే డౌట్స్ క్రికెట్ అభిమానుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

# వాణిజ్యం


# ఈక్విటీల్లోకి ఎంఎఫ్ పెట్టుబడులు డౌన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ప్రపంచ ఈక్విటీ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటున్నాయి. ఈ ప్రభావం మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపైనా పడింది. వరుసగా మూడో నెలలో కూడా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. మార్చి నెలలో ఈ మొత్తం 14 శాతం క్షీణించి రూ.25,082 కోట్లుగా నమోద య్యాయి. మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్.. యాంఫీ సంబంధిత గణాంకాలను విడుదల చేసింది. ఈ ఏడాది జనవరిలో నెలలో ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.39,688 కోట్లు పెట్టుబడులు రాగా.. ఫిబ్రవరిలో ఆ మొత్తం రూ.29,303 కోట్లుగా నమోదైంది. మార్చి నెలలో మరింత క్షీణించి రూ.25,082 కోట్లకు చేరింది. డిసెంబర్‌లో ఈ మొత్తం రూ.41,156 కోట్లుగా ఉండడం విశేషం. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ కేటగిరీలోనే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లోకి మార్చి నెలలో అత్యధికంగా రూ.5,165 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సెక్టోరల్/థీమాటిక్ ఫండ్స్‌లోకి ఫిబ్రవరిలో రూ.5,711 కోట్లు పెట్టుబడులు రాగా, మార్చిలో కేవలం రూ.735కోట్లు మాత్రమే వచ్చాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి మాత్రం పెట్టుబడులు స్థిరంగా కొనసాగుతున్నాయి. మిడ్‌క్యాప్స్‌లోకి రూ.3,439 కోట్లు, స్మాల్‌క్యాప్స్‌లోకి రూ.4,092 కోట్లు చొప్పున పెట్టు బడులు వచ్చాయి. అంతకుముందు నెలలో మిడ్‌క్యాప్స్‌లోకి రూ.3,406 కోట్లు, స్మాల్‌క్యాప్స్ లోకి రూ.3,722 కోట్లతో పోలిస్తే ఈ మొత్తం పెరగడం విశేషం. లార్జ్ క్యాప్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు ఫిబ్రవరిలో రూ.2,866 కోట్లతో పోలిస్తే రూ.2,479 కోట్లకు తగ్గాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో ఫిబ్రవరి నెలలో రూ.1,980 కోట్లు రాగా, మార్చి నెలలో రూ.77 కోట్లు తరలిపోయాయి. డెట్ మ్యూచువల్ ఫండ్స్ కేటగిరీ విషయానికొస్తే, మార్చి నెలలో ఏకంగా రూ.2.02 లక్షల కోట్ల పెట్టుబడులు వెనక్కి మళ్లాయి. ఫిబ్రవరిలో రూ.6,525 కోట్లు ఇన్‌ఫ్లోలు నమోదయ్యాయి. మొత్తంగా చూసినప్పుడు ఫిబ్రవరిలో మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీ ఫిబ్రవరిలో రూ.40వేల కోట్ల ఇన్‌ఫ్లోను చూడగా, మార్చి నెలలో నికరంగా రూ.1.64 లక్షల కోట్ల పెట్టుబడులు తరలిపోయాయి. పెద్ద మొత్తంలో పెట్టుబడులు తరలిపోయినప్పటికీ, మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఎయుఎం) అంతకుముందు నెలతో పోలిస్తే మార్చి నెలలో దాదాపు రూ.7.72 లక్షల కోట్లు పెరిగి రూ.401.54 లక్షల కోట్లకు చేరింది.




# సూచీలు రయ్..రయ్..

**ముంబై, ఏప్రిల్ 11:** ప్రపంచ దేశాలపై విధించిన టారిఫ్‌లకు 90రోజుల పాటు బ్రేక్ వేస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మన మార్కెట్లు శుక్రవారం దూసుకెళ్లాయి. అమెరికా, చైనా మధ్య ఓవైపు సుంకాల పోరు కొనసాగుతున్నా మన మార్కెట్లు మాత్రం భారీ లాభాల్లో ముగియడం గమనార్హం. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో ప్రధాన సూచీలు బలంగా పుంజుకొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 1300 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 22,800 స్థాయిని దాటింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ



ఆసియా, జపాన్ మార్కెట్లు నష్టాలు చవిచూడగా.. షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు లాభాల్లో ముగియడం గమనార్హం. ట్రంప్ విరామ ప్రకటనతో మరుసటి రోజే మన సూచీలు దూసుకెళ్లాల్సి ఉన్నా, మహవీర్ జయంతి కారణంగా మార్కెట్లు పనిచేయలేదు. దీంతో శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ సూచీలు లాభాల్లో ప్రారంభం అయ్యాయి. ఇంట్రాడేలో 75,467.33 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1310.11 పాయింట్ల లాభంతో 75,157.26 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 429.40 పాయింట్ల లాభంతో 22,828.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.86.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ షేర్లు రాణించాయి. ఫార్మా, మెటల్ స్టాక్స్ ప్రధానంగా రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్‌బ్యారెల్ 63.65 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం దూసుకెళుతోంది. ఔన్సు 3248 డాలర్ల వద్ద కొనసాగుతోంది. భారత్ సహా 75 దేశాలపై విధించిన టారిఫ్‌లను ట్రంప్ 90 రోజుల పాటు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించడం మన మార్కెట్లకు ఊరటనిచ్చింది. వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో ఈ ప్రకటన మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది.

# పసిడి ధరలు పైపైకి

**ముంబై, ఏప్రిల్ 11:** దేశంలో బంగారం ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. గురువారం గరిష్ఠంగా రూ.2940 పెరిగిన గోల్డ్ ధర, శుక్రవారం రూ.2020 పెరిగి ఒక్కసారిగా షాకిచ్చింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా పసిడి ధరలలో మార్పులు జరిగాయి. హైదరాబాద్, విజయవాడలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.87,450 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ.95,400 వద్ద నిలిచాయి. చెన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ.1850, రూ.2020 పెరిగింది. దీంతో ఇక్కడ 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి రేటు రూ.87,450 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.95,400 వద్ద ఉంది. దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు 10 గ్రాముల 22 క్యారెట్లకు రూ.87,600, 10 గ్రాముల 24 క్యారెట్లకు రూ.95,550 వద్ద ఉన్నాయి. అదేవిధంగా వెండి ధరలు కూడా కొంత పెరుగుదలవైపు అడుగులు వేశాయి. శుక్రవారం కేజీ సిల్వర్ రేటు రూ.1,08,000కు చేరింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు ఒకే విధంగా ఉన్నప్పటికీ, ఢిల్లీలో మాత్రం కేజీ వెండి ధర రూ.97,100 వద్ద ఉంది.



# 'నేను సైతం రెండు సార్లు ఫైన్ కట్టా': నితిన్ గడ్కరీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** భారతదేశంలో ట్రాఫిక్ రూల్స్ కఠినంగా మారుతున్నాయి. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన ఎవరికైనా జరిమానా తప్పదు అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. నేను కూడా ముంబైలో రెండు సార్లు ఫైన్ కట్టానని రైజింగ్ భారత్ సమ్మిట్ 2025 కార్యక్రమంలో వెల్లడించాయి. ఇప్పుడు హైవేల మీద అత్యాధునిక కెమెరాలు, సెన్సార్లు ఉన్నాయి. ఎవరూ తప్పించుకోలేదు. మిమ్మల్ని ఎవరూ రక్షించలేరు. కెమరా ఫోటో తీస్తుంది. జరిమానా తప్పకుండా కట్టాల్సిందే. కఠినమైన ట్రాఫిక్ చలాన్లపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా జరిమానాలు ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రవేశపెట్టలేదు. చట్టానికి కట్టుబడి ఉండటానికి తీసుకొచ్చాము. జరిమానాలు పెరిగాయని ప్రజలు అంటున్నారు. అలాంటప్పుడు నిబంధనలను ఉల్లంఘించకుండా ఉండే సరిపోతుందని గడ్కరీ అన్నారు. ప్రభుత్వం 2019లో మోటారు వాహన చట్టాన్ని సవరించింది. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం, రవాణా నియమాల ఉల్లంఘనలు పెరగడం వల్ల రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కాబట్టి ట్రాఫిక్ ఉల్లంఘనలు తగ్గించడానికి ప్రధాన మార్గం అధిక జరిమానాలు విధించడమే. 2019లో రోడ్డు ప్రమాదం వల్ల మరణించినవారి సంఖ్య సుమారు 1.59 లక్షలు, ఈ సంఖ్య 2022 నాటికి 1.68 లక్షలకు చేరింది. కాబట్టి నియమాలను మరింత కఠినతరం చేయకపోతే, మరణాల సంఖ్య నానాటికి గణనీయంగా పెరిగిపోతుందని గడ్కరీ తెలిపారు. గత సంవత్సరం ట్రాఫిక్ ఉల్లంఘనలను పర్యవేక్షించడానికి, జరిమానాలు విధించడానికి కృత్రిమ మేధస్సుతో పాటు, ఇతర సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించాలని గడ్కరీ పేర్కొన్నారు. ఇవన్నీ ఎప్పటికప్పుడు రూల్స్ అతిక్రమించిన వారిని గుర్తించ డంలో సహాయపడతాయి. తద్వారా దేశంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



# గూగుల్‌లో మళ్లీ లేఆఫ్‌లు..

**వాషింగ్టన్, ఏప్రిల్ 11:** టెక్ దిగ్గజం గూగుల్ మరోమారు లేఆఫ్‌ల ప్రక్రియ చేపట్టింది. తమ ప్లాట్‌ఫామ్, డివైజ్ యూనిట్లలో పనిచేసే వందల మంది ఉద్యోగులను తొలగించింది. ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్లలో పనిచేసే ఉద్యోగులపై ఈ వేటు పడినట్లు తెలుస్తోంది. అయితే కచ్చితంగా ఎంతమందిని తొలగించాలన్న విషయంపై మాత్రం స్పష్టత లేదు. కాగా కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా గత రెండేళ్లలో గూగుల్ అనేక మందిని విధుల నుంచి తప్పించింది. గతేడాది డిసెంబరులో మేనేజర్, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ హోదాల్లో పనిచేస్తున్న వారిలో 10 శాతం మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. ఇక ఈ యేడాది ఫిబ్రవరిలో హెచ్‌ఆర్ విభాగం, క్లౌడ్ ఆర్గనైజేషన్‌లో కొంతమందిని తొలగించింది. ఖర్చు తగ్గింపులో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. గూగుల్‌లో 20శాతం మంది మరింత సమర్థంగా పనిచేయాలని గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ 2022లో వెల్లడించారు. ఆ మరుసటి యేడాదే 12వేల మంది ఉద్యోగులను గూగుల్ తొలగించింది. ఓపెన్ ఎఐ వంటి సంస్థలు సెర్చ్‌ంజిన్‌ను తీసుకొస్తునతండడంతో గూగుల్‌కు గట్టిపోటీ తప్పదని విశ్లేషకులు భావిస్తున్న వేళ ఈ తొలగింపులు చేపట్టడం విశేషం. ఇక అమెరికాలో విదేశీ నిపుణులపై ట్రంప్ కఠిన నిబంధనలు అమలు చేస్తున్న సమయంలో ఈ లేఆఫ్ వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.




# టెస్లా నుంచి కొత్త 'సైబర్‌ట్రక్'

**వాషింగ్టన్, ఏప్రిల్ 11:** ప్రముఖ అమెరికా ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా యుఎస్‌లో కొత్త సైబర్‌ట్రక్ వెర్షన్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను 69,990 అమెరికన్ డాలర్లుగా నిర్ణయించింది. ఇది ప్రస్తుతం అందుబాటులో ఉన్న మూడు సైబర్‌ట్రక్ మోడళ్లలో చౌకైనదిగా కంపెనీ పేర్కొంది. కొత్త సైబర్ ట్రక్ వేరియంట్‌కు సంబంధించిన రేంజ్, టోవింగ్ సామర్థ్యం, యాక్సిలరేషన్ వంటి స్పెసిఫికేషన్లపై వివరాలు వెల్లడించలేదు. అమెరికాలో 69,990 డాలర్ల ధరతో ఎంట్రీ లెవల్ సైబర్‌ట్రక్ యుఎస్ మార్కెట్లో ఆదరణ పొందుతున్న ఫోర్డ్ ఎఫ్-150 లైటనింగ్, రివియన్ ఆర్1 టి వంటి ఇతర ఎలక్ట్రిక్ మోడళ్లతో పోటీ పడుతుందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. స్టెయిన్‌లెస్ స్టీల్ ఎక్సోస్కెలెటన్, ఆర్మర్డ్ గ్లాస్, అధునాతన డ్రైవర్ అసిస్టెన్స్ సామర్థ్యాలు సైబర్ ట్రక్‌లో ఉన్నాయని కంపెనీ తెలిపింది. 'ఇవి' విభాగంలో టెస్లా ఆధిపత్యాన్ని కొనసాగించడానికి కంపెనీ కొంత కాలంగా ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దీనికి తోడు ఆర్థిక అనిశినచతి, ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ హెచ్చుతగ్గులుండడం వాహన తయారీదారులు ధరలకు సంబంధించి పునరాలోచనలో పడేలా చేశాయి. ఈ నేపథ్యంలో టెస్లా తీసుకున్న నిర్ణయం వినియోగదారులు మరింత సరసమైన ధరలకు కార్లను కొనుగోలు చేసేలా ప్రోత్సహిస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps